గురువారం
5•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 160
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ప్రకాశ్ జవదేకర్

## ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం!

### పౌరసత్వ సవరణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు(సీఏబీ)కు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోద ముద్ర వేసింది. వచ్చే రెండ్రోజుల్లో దీన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈమేరకు కీలక నిర్ణయం తీసుకున్నది. మతపరమైన హింస కారణంగా పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు శరణు వచ్చిన ముస్లిమేతరులకు (ఆరు వర్గాలు- హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్సీలు, జైనులు, బౌద్ధులు) దేశ పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ బిల్లు. దీనిని ఈశాన్య రాష్ట్రాలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కాగా, అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్‌లోని ఇన్నర్‌లైన్ పర్మిట్ ఏరియాలు (ఐఎల్‌పీ), రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో పొందుపరిచిన ప్రాంతాలను పౌరసత్వ బిల్లు పరిధి నుంచి తప్పించినట్లు తెలిసింది.

› వివరాలు 5వ పేజీలో

- చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పదేండ్లు పొడిగింపు
- ఆంగ్లో ఇండియన్ల కోటా పొడిగింపునకు నో!
- సీనియర్ సిటిజన్ల సంక్షేమం, వ్యక్తిగత సమాచార భద్రత, సామాజిక భద్రత కోడ్ బిల్లులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం 5

## మెట్రోలో పెప్పర్ స్ప్రేకు అనుమతి



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మహిళల భద్రతదృష్ట్యా హైదరాబాద్ మెట్రో రైల్లో పెప్పర్ స్ప్రేను అనుమతించారు. బాలికలు, యువతులు, మహిళలు తీసుకువచ్చే పెప్పర్ స్ప్రేను మెట్రోలో అనుమతించాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలు జారీచేసినట్లు హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ ఘటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### డయల్ 100పై రవాణాశాఖ విస్తృత ప్రచారం

హైదరాబాద్‌లో ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్ 6

# ఎందుకీ చిన్నచూపు!

- పనిచేసేరాష్ర్టాలను కేంద్రం ప్రోత్సహించడంలేదు
- పారిశ్రామికరంగంలో రాజకీయాలు
- రక్షణరంగంలోనూ వివక్ష
- డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో తాత్సారం
- ఐటీ,పరి శ్రమలశాఖ మంత్రి కేటీఆర్ విమర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పనిచేసే రాష్ర్టాలను ప్రోత్సహించకుండా కేంద్రప్రభుత్వం రాజకీయాలు చేస్తున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు విమర్శించారు. పనిచేసే రాష్ర్టాలను ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తాయని, కానీ దురదృష్టవశాత్తు అలా జరగడం లేదని చెప్పారు. పారిశ్రామికరంగంతోపాటు, రక్షణ రంగంలోనూ కేంద్రం రాజకీయాలు చేస్తున్నదన్నారు. కేంద్రం ఏదైనా ప్రాజెక్టు ప్రారంభిస్తే అది ఢిల్లీ-ముంబైకే పరిమితమవుతున్నదని పేర్కొన్నారు. టీఎస్‌ఐపాస్ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మాదాపూర్ శిల్పకళావేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం పారిశ్రామిక కారిడార్ వస్తే ఢిల్లీ-ముంబైకి మంజూరుచేస్తుందని, బుల్లెట్ ట్రైనూ ఢిల్లీ -ముంబైకే పరిమితం చేస్తూ పని చేసే రాష్ర్టాల పట్ల వివక్ష చూపుతున్నదన్నారు. పారిశ్రామిక కారిడార్ మంజూరుచేయడానికి, బుల్లెట్ ట్రైన్ ఇవ్వడానికి హైదరాబాద్ లేదా ఇతర దక్షిణాది రాష్ర్టాలు, ప్రాంతాలు లేవా? అని ప్రశ్నించారు. హైదరాబాద్- బెంగళూరు- చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను ఎందుకివ్వడం లేదని నిలదీశారు. దీనిని మంజూరు చేస్తే ఇక్కడి ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందికదా అని కేటీఆర్ అన్నారు.

**ఇంక్యుబేటర్ కోరినా ఇంతే సంగతులు**

తెలంగాణలో రక్షణరంగానికి సంబంధించి ఇంక్యుబేటర్ ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరినా ఫలితం లేకుండా పోతున్నదని.. కానీ, అది ఎప్పటికైనా సాధ్యమవుతుందన్న నమ్మకం ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం సైతం రిడ్జ్‌ను నెలకొల్పి ఈ రంగంలో పరిశోధనలకు కృషి చేస్తున్నదని చెప్పారు. ట్రైడెంట్ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో డిఫెన్స్‌కాన్‌క్లేవ్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడారు. గత ఐదేండ్లలో పరిశ్రమల మంత్రిగా తెలంగాణలో రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని, దశాబ్దాల నుంచి హైదరాబాద్‌లో పలు కీలకమైన రక్షణ సంస్థలు పనిచేస్తున్నాయని నలుగురు రక్షణ మంత్రులకు వివరించినట్టు తెలిపారు. ఇన్ని అనువైన పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు నగరాలను కలుపుతూ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుచేయాలని కోరామన్నారు. అయితే కేంద్రం

› మిగతా 2వ పేజీలో




బుధవారం మాదాపూర్ శిల్పకళావేదికలో టీఎస్‌ఐపాస్ ఐదు వసంతాల వేడుకలో ప్రసంగిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు

## పారిశ్రామీకరణ కొత్త పుంతలు

- త్రీ ఐ విధానంతో ముందుకు..
- పరిశ్రమల భూములు దుర్వినియోగం చేస్తే వెనక్కి తీసుకుంటాం
- రాష్ట్రంలో గ్రీన్, వైట్, బ్లూ, పింక్ రెవల్యూషన్లు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు
- టీఎస్‌ఐపాస్ ఐదు వసంతాల ఉత్సవం
- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల రాయితీలకు రూ.305 కోట్ల చెక్కు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పారిశ్రామీకరణ కొత్తపుంతలు తొక్కాల్సిన అవసరం ఉన్నదని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో గ్రీన్, బ్లూ, వైట్, పింక్ విప్లవాలు రానున్నాయని తెలిపారు. టీఎస్‌ఐపాస్ ఐదు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం మాదాపూర్ శిల్పకళావేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలు, శాఖలవారీగా ఎంపికచేసిన వారికి మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. టీఎస్‌ఐపాస్ సీఎం కేసీఆర్ మానసపుత్రిక అని చెప్పారు. టీఎస్‌ఐపాస్ క్రెడిట్ అంతా

› మిగతా 2వ పేజీలో

### దిశ కేసు సత్వర విచారణకు

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

- మహబూబ్‌నగర్ సెషన్స్ కోర్టు ఎంపిక
- ప్రత్యేక కోర్టులో రోజువారీ విచారణ
- దిశ నిందితులకు ఏడు రోజుల కస్టడీ
- క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్ట్ చేయనున్న పోలీసులు
- డీఎన్‌ఏ, ఇతర ఆధారాల సేకరణ




దిశ హత్యాచారంపై బుధవారం కోల్‌కతాలో మహిళల ర్యాలీ దృశ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ సిటీబ్యూరో/ మహబూబ్‌నగర్ లీగల్:** అత్యంత దారుణంగా లైంగికదాడి, హత్యకు గురైన దిశ కేసులో బాధిత కుటుంబసభ్యులకు సత్వర న్యాయం అందించేందుకు, నిందితులకు వేగంగా శిక్ష పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసింది. దిశ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కేసులో బాధిత కుటుంబసభ్యులకు సత్వర న్యాయం అందించడంతోపాటు నిందితులకు వేగంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హైకోర్టుతో న్యాయశాఖ సంప్రదింపులు జరిపింది. హైకోర్టు ఆమోదంతో ఈ కేసులో విచారణకు ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఏ సంతోష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మహబూబ్‌నగర్ ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుగా గుర్తిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దిశ ఘటనపై షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 784/2019 కేసుపై ప్రత్యేకంగా రోజువారీ విచారణ జరుగనున్నది. గతంలో వరంగల్‌లో

› మిగతా 6వ పేజీలో

## సహచరులపై జవాన్ కాల్పులు

- ఐదుగురు ఐటీబీపీ జవాన్ల మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆపై తనను తాను కాల్చుకుని ఆత్మహత్య III
- అధికారులు సెలవు ఇవ్వలేదన్న కోపంతో విచక్షణ కోల్పోయి దారుణం
- ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఘటన

## జియో కూడా..!

39% వరకు చార్జీలు పెంచిన సంస్థ
శుక్రవారం నుంచి అమల్లోకి
9

## ఎయిమ్స్ ఏర్పాటుపై గెజిట్ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో అధికారికంగా ఎయిమ్స్ ఏర్పాటైంది. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను బుధవారం కేంద్ర ప్రభుత్వం విడుదలచేసింది. బీబీనగర్‌లో ఎయిమ్స్ నెలకొల్పనున్నట్లు అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి, దివంగత అరుణ్‌జైట్లీ గతంలో లోక్‌సభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంతో అనేక సంప్రదింపులు జరుపుతూ వచ్చింది. అన్ని అంశాలు పరిశీలించిన మీదట.. తాజాగా కేంద్రం బీబీనగర్‌లో ఎయిమ్స్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ఇచ్చింది.

## జీఎస్టీ నష్టపరిహారం ఏది?

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించిన బీజేపీయేతర పాలిత రాష్ర్టాల ఆర్థిక మంత్రులు
9

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 83.00 | రిటైల్ లైవ్ | 105.00 |
| డ్రెస్డ్ | 152.00 | స్కిన్‌లెస్ | 173.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 444.00 | రంగారెడ్డి | 444.00 |
| మెదక్ | 444.00 | కరీంనగర్ | 447.00 |
| వరంగల్ | 447.00 | చిల్లర ధర | 5.05 |



## నరసింహుడు

బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో మీడియాతో మాట్లాడుతున్న యాదాద్రి ఆలయ ప్రత్యేకాధికారి కిషన్‌రావు. చిత్రంలో ప్రధాన అర్చకుడు నల్లంథిఘల్ నరసింహాచార్యులు, ఈవో గీత, స్థానాచార్యులు రాఘవాచార్యులు, అర్చకులు కారంపూడి లక్ష్మీనరసింహాచార్యులు, రంగాచార్యులు, ప్రధానశిల్పి సుందరరాజన్, ఆర్కిటెక్ట్ ఆనందసాయి కూడా ఉన్నారు

# శాంత స్వరూపుడే

### కోరలు ఉంటే ఉగ్రమూర్తి కాదు

- సిందూరాన్ని అర్చకులమే తొలిగించాం
- నరసింహస్వామి అసలు రూపం దశాబ్దాలుగా ఎవరూ చూడలేదు
- నియమనిష్ఠలతో గర్భాలయం శుద్ధి
- మూలవిరాట్టుకు అపచారం చేయలేదు
- మాకు భేదాభిప్రాయాలు లేవు
- అసంతృప్తి ఉందనడం అవివేకం
- యాదాద్రి ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు
- భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఆంధ్రజ్యోతి కథనం ఉన్నదని విమర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యాదాద్రి ఆలయంలో మూలవిరాట్‌కు ఎటువంటి అపచారం జరుగలేదని యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రధాన పూజారి నల్లంతిఘల్ నర్సింహాచార్యులు స్పష్టంచేశారు. మూలవిరాట్టును శిల్పులు తాకలేదని చెప్పారు. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో అర్చకులమే పూర్తి నిష్ఠ, నియమాలతో సిందూరాన్ని తొలగించామని, ఏండ్లతరబడి వేసిన సిందూరాన్ని తొలిగించడంతో స్వామివారు కొత్తగా కనిపిస్తున్నారని వివరించారు. ఇదే స్వామివారి అసలు స్వరూపమని స్పష్టంచేశారు. ప్రపంచంలో ఎక్కడ నరసింహస్వామిని చూసినా నాలుక బయటికే ఉంటుందని తెలిపారు. యాదాద్రి స్వామివారి అసలు స్వరూపాన్ని దశాబ్దాలుగా ఎవరూ చూడలేదని చెప్పారు. యాదాద్రి ఆలయంలో అపచారం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ కథనంలో పేర్కొన్న అంశాలు వాస్తవంకాదని స్పష్టంచేశారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనని చెప్పారు. 'మన యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి.. ఉగ్రరూపంగా జ్వాలా నరసింహస్వామి.. యోగాలన్నీ సిద్ధంపజేసేందుకు యోగానందుడుగా వెలిశాడు.. గండభేరుండ నరసింహస్వామిగా ఉన్నారు.. దయార్ద్ర నరసింహస్వామి.. ఇక లక్ష్మీనరసింహస్వామిది ఉగ్రరూపం కాదు. అసలు నరసింహస్వామి అవతారమే వాత్సల్య స్వరూపం. తన భక్తులను రక్షించుకోవడం కోసం అవతరించాడు. ప్రహ్లాదుడిని రక్షించుకునేందుకు హిరణ్యకశ్యపునికి బాధ కల్గించకుండా మోక్షం ప్రసాదించాడు. అక్కడ ఉగ్రానికే స్థానంలేదు. అలాంటప్పుడు నరసింహస్వామి ఉగ్రమూర్తి అనడం

› మిగతా 2వ పేజీలో



3

## ఆలయంపై ఆంధ్రజ్యోతి అక్కసు

- నిన్నటివరకు నిర్మాణంపై పిచ్చిరాతలు..
- నేడు మూలవిరాట్ విషయంలోనే విషం
- యాదాద్రికి పూర్వవైభవాన్ని తెస్తున్న సీఎం కేసీఆర్
- జీర్ణించుకోలేకపోతున్న పచ్చపత్రిక
- నాడు భద్రాద్రిపైనా అదే ధోరణి
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనల వెల్లువ
- పత్రిక ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మల దహనం
- ఆంధ్రజ్యోతి ప్రతులు కాల్చిపారేసిన భక్తులు





బుధవారం రాజ్‌భవన్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశంలో సెల్యూట్ చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత



బుధవారం నాగోల్‌లో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు తదితరులు ఉన్నారు.



సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడి వివాహానికి హాజరైన మంత్రి కే తారకరామారావు

# నిస్వార్థ సేవకు సిద్ధంగా ఉండాలి

- స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తృతం కావాలి
- సామాజిక సేవ, జాతి నిర్మాణంలో కీలకం
- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్
- ప్రత్యేక భవనాల కోసం కృషి: మాజీ ఎంపీ కవిత

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** సామాజిక సేవ, జాతి నిర్మాణంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ పాత్ర కీలకమని, వీరి సేవలు సేవలు విస్తృతం కావాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆకాంక్షించారు. వీరు ఎల్లప్పుడూ దేశానికి నిస్వార్థమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బుధవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. ఇటీవల తాను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసినప్పుడు తెలంగాణలో అద్భుతంగా జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను వివరించానని తెలిపారు. యువ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతి సమగ్రతను కాపాడటంలో ముందుండాలన్నారు. మానవత్వం, ప్రేమ భావాలను కలిగి మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో యువత పెద్ద సంఖ్యలో చేరేలా ప్రోత్సహించాల్సిన అవసరమున్నదని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని విశ్లేషించారు. ప్రతి జిల్లాకు పక్కా భవనాన్ని నిర్మించి స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఆదాయవనరులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం కొందరు ప్రజాప్రతినిధులు ఉదారంగా సాయంచేస్తున్నారని వివరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు గవర్నర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ స్టేట్ అసోసియేషన్ సీనియర్ అధికారులు విజయ్‌కుమార్, విజయేంద్ర బోయి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ సేవలందించిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రాజ్‌భవన్‌లో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్. చిత్రంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత కూడా ఉన్నారు.

# మహిళల భద్రతకు భరోసా

- సీఎం కేసీఆర్ ఆదేశాలతో హోంమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష
- హాజరైన మంత్రులు ఎర్రబెల్లి, సబిత, సత్యవతి రాథోడ్
- ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు సహా పలు కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన పటిష్ఠ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. 'దిశ' ఉదంతం నేపథ్యంలో మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుచేసి చర్చించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ నేతృత్వంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్త్రీ శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం లక్డీకపూల్‌లోని హోంమంత్రి కార్యాలయంలో సమావేశమయ్యారు. మహిళల భద్రతకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మొత్తం 16 రకాల చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు జగదీశ్వర్, రవిగుప్తా, జనార్దన్‌రెడ్డి, శాంతిభద్రతల అడిషనల్ డీజీ జితేందర్, పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, సజ్జనార్, మహేశ్‌భగవత్, ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, వీవీ శ్రీనివాసరావు, ఎస్పీలు సుమతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బుధవారం హోంమంత్రి మహమూద్ అలీ అధ్యక్షతన సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, పోలీస్ కమిషనర్లు అంజనీకుమార్, సజ్జనార్, మహేశ్ భగవత్, వరంగల్ పోలీస్ కమిషనర్ రవీంద్రకుమార్ అధికారులు

## కమిటీ తీసుకున్న ప్రధాన నిర్ణయాలు

- ☞ జస్టిస్ ఫర్ దిశ కేసు ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తిచేయాలి. మహిళలపై నేరాలు, అదృశ్యంపై ఫిర్యాదు అందిన వెంటనే పరిధితో సంబంధం లేకుండా కేసు నమోదు చేసిదర్యాప్తు చేపట్టాలి. జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అనుసరించాలి.
- ☞ మహిళలు, బాలికల రక్షణకు అన్ని ప్రభుత్వశాఖల సమన్వయంతో స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి.
- ☞ షీటీమ్స్‌ను మరింత పటిష్ఠపర్చి, హాక్ఐ సేవలు అందుబాటులోకి తేవాలి.
- ☞ అత్యవసర సమయాల్లో పోలీస్ సహాయం కోసం ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు (100, 181, 1098, 112), మొబైల్ యాప్స్‌పైన విస్తృత అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిచాలి.
- ☞ ప్రాథమిక పాఠశాలల నుంచి కళాశాలల వరకు, రవాణా వాహనాల్లో, ఆటోల్లో, క్యాబ్‌లలో అత్యవసర సేవల నంబర్లను విధిగా ప్రదర్శించేలా నోటీస్ బోర్డుల ఏర్పాటు. హెల్ప్‌లైన్ నంబర్లను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, బస్, రైల్వే, మెట్రో స్టేషన్లు ప్రదర్శించాలి.
- ☞ మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన పెంచేలా ఈ-లెర్నింగ్ కోర్సును అందుబాటులోకి తీసుకురావాలి.
- ☞ లింగ వివక్ష అంశాలపై బాలురు, పురుషులకు, మహిళా సాధికారతపై ఈ-లెర్నింగ్ కోర్సులు నిర్వహించాలి.
- ☞ మహిళల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసుల హెల్ప్‌లైన్ నంబర్లను తెలియజేసేలా రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌లు, చిన్న నాటకాలు, స్లైడ్స్‌ను సినిమా థియేటర్లలో, టీవీల్లో ప్రదర్శించాలి.
- ☞ విద్యార్థులకు మానవతా విలువలు, మహిళలు, బాలికలను గౌరవించే అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. హాజరయ్యే విద్యార్థులను ప్రోత్సహించేలా సర్టిఫికెట్లు ఇవ్వాలి. ఇందుకు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, క్రీడలు, సాంస్కృతికశాఖ చర్యలు తీసుకోవాలి.
- ☞ గ్రామాల్లో విపరీత ప్రవర్తన ఉన్న యువకులను గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా గుర్తించి పోలీసులకు తెలియజేయాలి. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మంచి మార్గంలో నడిపించాలి.
- ☞ గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు సెర్ప్, స్వయంసహాయ బృందాలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మెప్మా, కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మహిళా, శిశు, పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది, వృద్ధులతో కలిపి కమిటీలు ఏర్పాటుచేసి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకోవాలి.
- ☞ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి.
- ☞ స్వయం సహాయక సంఘాల సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్లను సందర్శించి స్థానిక మహిళల, బాలికల భద్రత అంశాలపై వారితో చర్చించేలా చర్యలు.

లాభాదాయక పదవుల నుంచి

# కార్పొరేషన్లకు మినహాయింపు

- గవర్నర్ సంతకంతో ఆర్డినెన్స్ జారీ
- చైర్మన్ల నియామకానికి మార్గం సుగమం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవలి రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం మేరకు కార్పొరేషన్లను లాభాదాయక పదవుల నుంచి మినహాయిస్తూ బుధవారం ఆర్డినెన్స్ జారీ అయింది. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర వేతనాలు, పెన్షన్ చెల్లింపుల అనర్హతను తొలిగిస్తూ ఆర్డినెన్స్ ఫైల్‌పై గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సంతకంచేశారు. ఈ ఆర్డినెన్స్‌తో ముఖ్యమైన కార్పొరేషన్లకు ఎంపీ, ఎమ్మెల్యేలను నియమించడానికి ఆస్కారం ఏర్పడింది. ఇప్పటివరకు ప్రజాప్రతినిధులను వాటికి చైర్మన్లుగా నియమించడానికి ఇబ్బందులు ఉండేవి. ఆర్డినెన్స్‌తో ఈ ప్రతిబంధకాలన్నీ తొలిగిపోయాయి. తాజా ఆర్డినెన్స్‌తో రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల భర్తీ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి రైతు సమన్వయ సమితి అధ్యక్ష పదవిని ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇతర కార్పొరేషన్లకు పాలకవర్గాలను ప్రకటించే అవకాశం ఉన్నది.

### మినహాయింపు ఇచ్చిన సంస్థలు ఇవే

రాష్ట్ర ప్రభుత్వం 27 సంస్థలకు లాభదాయక సంస్థల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇందులో హెచ్ఎండీఏ, ఆర్టీసీ రిజినల్ బోర్డులకు అదనంగా చైర్మన్లు, డైరెక్టర్లను నియమించుకునే అవకాశం కలిగిస్తూ బుధవారం ఆర్డినెన్స్ జారీచేసింది. మినహాయింపు ఇచ్చిన సంస్థలు.. 1) అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ (ఎంబీసీ కార్పొరేషన్), 2) రైతు సమన్వయ సమితి, 3) మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, 4) భవన నిర్మాణ కార్మికులు, ఇతర సంక్షేమ బోర్డు, 5) రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, 6) కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కార్పొరేషన్, 7) యాదగిరిగుట్ట టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ, 8) వేములవాడ టీఏడీఏ, 9) కులీకుతుబ్‌షా పట్టణాభివృద్ధి సంస్థ, 10) పట్టణాభివృద్ధి సంస్థలు, 11) క్రీడల సంస్థ, 12) గొర్రెలు, మేకల సహకార సొసైటీ, 13) హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ, 14) తెలుగు అకాడమి, 15) హాకా, 16) అధికార భాష కమిషన్, 17) తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ, 18) హజ్ కమిటీ, 19) సాంఘిక సంక్షేమబోర్డు, 20) ఫుడ్ కమిషన్, 21) సెట్విన్, 22) తెలంగాణ సాహిత్య అకాడమి, 23) జెన్‌కో, 24) ట్రాన్స్‌కో, 25) యోగాధ్యయన పరిషత్, 26) హెచ్ఎండీఏ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, డైరెక్టర్లు, 27) టీఎస్ ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్మన్, డైరెక్టర్స్.

## ఎందుకీ చిన్నచూపు!

మొదటిపేజీ తరువాయి...

మాత్రం యూపీలోని బుందేల్‌ఖండ్‌లో ఒకటి, చెన్నైలో మరో ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు సమాచారమిచ్చిందని చెప్పారు. స్థానికంగా ఉన్న అనుకూల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రాజకీయాల కోసం ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి నిర్ణయాలు ఉంటేనే సరైన ఫలితాలు వస్తాయని కేటీఆర్ చెప్పారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.35 గంటలకు

సూర్యాస్తమయం: 5.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం నవమి శుక్రవారం తె.జా. 4.16 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాభాద్ర రాత్రి 8.08 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: ఉదయం 11.09 నుంచి మధ్యాహ్నం 12.56 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.26 నుంచి 2.48 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.37 నుంచి సాయంత్రం 4.04 వరకు, వర్జ్యం: లేదు.

# రక్షణ కంపెనీలకు తెలంగాణ బెస్ట్

- దశాబ్దాలుగా అనేక రక్షణ పరిశ్రమలకు నిలయం
- ట్రంప్ హెలికాప్టర్ క్యాబిన్ హైదరాబాద్‌లోనే తయారీ
- డిఫెన్స్‌కాన్‌క్లేవ్ ప్రారంభంలో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దశాబ్దాల క్రితమే ఏర్పాటైన రక్షణరంగ సంస్థలు, స్థానిక వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో రక్షణ రంగ పరిశ్రమలు నెలకొల్పేందుకు తెలంగాణ అత్యంత అనుకూలమైనదని పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. రక్షణ రంగానికి చెందిన కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు నెలకొల్పేందుకు మరిన్ని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బుధవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో డిఫెన్స్ కాన్‌క్లేవ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలానగర్, చర్లపల్లి, కుషాయిగూడ ప్రాంతాల్లో దాదాపు వెయ్యికిపైగా ఎయిరోస్పేస్, రక్షణ రంగానికి చెందిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలున్నాయని చెప్పారు. డజన్‌కు పైగా డీఆర్డీవో రక్షణ రంగ పరిశోధనా కేంద్రాలు, 25కిపైగా పెద్ద కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. గత దశాబ్దకాలంగా చూస్తే ఎయిరోస్పేస్ రంగంలో హైదరాబాద్ అత్యంత ప్రముఖంగా మారిందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉపయోగించే హెలికాప్టర్ క్యాబిన్‌ను హైదరాబాద్‌లోనే తయారుచేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. నాలుగు ఎయిరోస్పేస్ పార్కులు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. రక్షణ రంగ ఉత్పత్తులకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని, పలు అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయన్నారు. ఆదిబట్ల, జీఎంఆర్, అదానీ ఏరోస్పేస్ సెంటర్లు రక్షణ రంగ ఉత్పత్తులకే కేంద్రాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, రఫేల్ లాంటి బహుళజాతి సంస్థలు కూడా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రస్ సంస్థ కూడా ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటుచేసిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల భాగస్వామ్యంతో అతితక్కువ ఖర్చుతో ఏరోస్పేస్ రంగంలో సర్టిఫికెట్ కోర్సులు అందించేలా తెలంగాణలో ప్రైవేటు భాగస్వాములతో ఏరోస్పేస్ వర్సిటీ ఏర్పాటుచేయనున్నట్టు మంత్రి చెప్పారు. టాస్క్ ద్వారా నిపుణత గలయువతను తయారుచేస్తున్నట్టు తెలిపారు. పరిశ్రమలకు కావాల్సిన వర్క్‌ఫోర్స్ పుష్కలంగా ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో సానుకూల దృక్పథం ఉన్న ప్రభుత్వం ఉండడం సంతోషమని పెట్టుబడిదారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఐఐ చైర్మన్ రాజు, వైస్‌చైర్మన్ కృష్ణ బడనపు, కో కన్వీనర్ సీఐఐ డిఫెన్స్ అండ్ ఎయిరోస్పేస్ ప్యానెల్ చైర్మన్ అశోక్ అట్లూరి పాల్గొన్నారు.




బుధవారం ట్రైడెంట్ హోటల్లో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన డిఫెన్స్ కాంక్లేవ్‌లో ప్రసంగిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో రామిందర్‌సింగ్, కృష్ణ బోదనపు, డీ రాజు, రుద్రా జడేజా తదితరులు

# పారిశ్రామికీకరణ కొత్త పుంతలు

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరంటు కోసం పారిశ్రామికవేత్తలు సైతం ధర్నాలుచేశారని.. అలాంటి పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటపడేసి అన్నిరంగాలకు 24 గంటల విద్యుత్‌ను సరఫరాచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని సీఎం ఎప్పుడూ చెపుతుంటారని.. ఆ స్ఫూర్తితో రాష్ట్రంలో త్రీ 'ఐ' విధానాన్ని అమలుచేస్తున్నామన్నారు. నవీన ఆవిష్కరణలు (ఇన్నోవేషన్), మౌలిక సదుపాయాలు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), సమ్మిళిత అభివృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్)తో ముందుకెళుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించిన వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నామని.. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీల కోసం రూ.305 కోట్ల చెక్కు అందించినట్టు తెలిపారు. పారిశ్రామిక రాయితీలపై కొందరిలో తప్పుడు అభిప్రాయం ఉన్నదని.. ఒక కంపెనీకి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడమంటే ఒక వ్యక్తికి ఇస్తున్నట్టు కాదని, అందులో పనిచేసే ఉద్యోగులందరికీ ఇస్తున్నట్టేనని చెప్పారు. ఉపాధి కల్పించే వాటిల్లో 70 శాతం ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమలే ఉంటాయని.. భారీ పరిశ్రమలపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. ఇందులోభాగంగానే హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌ను ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. దీనికోసం ఇప్పటికే 10 వేల ఎకరాలు సేకరించామని, మరో 2 వేల ఎకరాలు సేకరించగానే కంపెనీలకు కేటాయింపులు చేస్తామన్నారు. అవినీతి తగ్గితే కాస్ట్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ తగ్గుతుందని.. టీఎస్ఐపాస్ ద్వారా అవినీతి తగ్గిపోయిందని తెలిపారు. టీఎస్ఐపాస్ ద్వారా 11 వేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని, వీటిద్వారా 13 లక్షల మందికి ఉద్యోగాలు, రూ.1.76 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని కేటీఆర్ వివరించారు.

### పర్యావరణహితంగా పారిశ్రామికీకరణ

పారిశ్రామికీకరణ పర్యావరణహితంగా ఉండాలని, కాలుష్యంపై మనల్ని మనం ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్ నుంచి పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ అవతలికి తరలించడానికి 13 ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. పరిశ్రమలకు కేటాయించిన భూములను దుర్వినియోగంచేస్తే వెనక్కు తీసుకుంటామని హెచ్చరించిన కేటీఆర్.. ఈ విధంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించిన 1200 ఎకరాలను వెనక్కి తీసుకున్నట్టు చెప్పారు. కేంద్రం ఈవోడీబీ ర్యాంకులు పెట్టడంతో రాష్ట్రాల మధ్య పోటీపెరిగినట్టే.. రాష్ట్రంలోనూ జిల్లాల మధ్య ఈవోడీబీ ర్యాంకులపై పోటీఉండేలా కొత్త విధానాన్ని అమలుచేస్తామని, దీనిపై కలెక్టర్లతో మాట్లాడిన మార్గదర్శకాలను ఖరారు చేయనున్నట్టు తెలిపారు.

### రెండో హరితవిప్లవం సీఎం కేసీఆర్ స్వప్నం

రాష్ట్రంలో రెండోహరిత విప్లవం సీఎం కేసీఆర్ స్వప్నమని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణంతో పంట దిగుబడి పెరిగిందన్నారు. కరీంనగర్ జిల్లాలో 2013-14కు 2019-20 నాటికి వరి దిగుబడి ఐదింతలు పెరిగిందని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్‌రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పంటల దిగుబడి (గ్రీన్ రెవల్యూషన్), పాడి ఉత్పత్తి (వైట్ రెవల్యూషన్), చేపల పెంపకం, ఆక్వా కల్చర్ (బ్లూ రెవల్యూషన్), మాంసం ఉత్పత్తి (పింక్ రెవల్యూషన్) ద్వారా తెలంగాణ అగ్రభాగాన నిలుస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో డ్రైపోర్టు, మరో ఎయిర్‌పోర్ట్ రావాల్సి అవసరం ఉన్నదని చెప్పారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ..తాను పాల వ్యాపారం చేశానని.. ఇప్పుడు రెండు వైద్య, 13 ఇంజినీరింగ్ కాలేజీలు, 10 సీబీఎస్ఈ స్కూల్స్ ఏర్పాటుచేశానని, కష్టపడితే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, పరిశ్రమల కమిషనర్ నదీమ్ అహ్మద్, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, సీఐఐ అధ్యక్షుడు రాజు, మాజీ అధ్యక్షుడు రాజన్న, టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సుధాకర్ పైప్స్ అధినేత మీలా జయ్‌దేవ్, ఎలిప్ అధ్యక్షురాలు రమాదేవి, అదనపు సంచాలకులు రాజ్‌కుమార్ వోడ్కర్, సంయుక్త సంచాలకులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్, ఖలీల్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# నరసింహుడు శాంత స్వరూపుడే

మొదటిపేజీ తరువాయి...

సంప్రదాయానికే మంచిదికాదు. లక్ష్మీనరసింహస్వామి శాంతమూర్తి. అలాంటప్పుడు కోరలున్నాయా అనే ప్రశ్నలు సరైనవి కావు' అని నర్సింహాచార్యులు చెప్పారు. భక్తి ప్రపూర్ణుడైన నర్సింహస్వామి అన్నిరూపాల్లో ఉంటారన్నారు. దీనిపై రాద్ధాంతంచేసేలా ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, కించపర్చేలా ఉన్నదని ఆక్షేపించారు. బుధవారం టూరిజం ప్లాజాలో ఆలయ ప్రత్యేకాధికారి కిషన్‌రావు,ఈవో గీత, స్థానాచార్యులు రాఘవాచార్యులు, అర్చకులు కారంపూడి లక్ష్మీనరసింహాచార్యులు, రంగాచార్యులు, ప్రధానశిల్పి సుందరరాజన్, ఆర్కిటెక్ట్ ఆనందసాయి తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాను 39 ఏండ్లుగా స్వామివారికి సేవచేస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ యాదాద్రిని అభివృద్ధి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారని, ప్రపంచమే ఆశ్చర్యపోయేలా నియమ, నిష్ఠతో ఆలయాన్ని పునర్నిస్తున్నారని లక్ష్మీనరసింహాచార్యులు చెప్పారు. బృహత్తరస్థాయిలో దేవాలయ పునర్నిర్మాణం పూర్తికావస్తున్న సమయంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం కోట్లమంది భక్తులను కించపరిచేలా ఉన్నదన్నారు. నరసింహస్వామిని అన్ని రూపాల్లో కొలుస్తారన్న ప్రధాన అర్చకులు.. కోరలు ఉంటే ఉగ్రమూర్తి అవుతారా? అంటూ ప్రశ్నించారు. అమ్మవారు లేకపోతే ఉగ్రమూర్తి అవుతారని, అమ్మవారు ఉంటే శాంతమూర్తి అవుతారని వివరించారు.

### నాలుక బయటికే ఉంటుంది

ప్రపంచంలో ఎక్కడ నరసింహస్వామిని చూసినా నాలుక బయటికే ఉంటుందని ప్రధానార్చకులు నర్సింహాచార్యులు స్పష్టంచేశారు. నరసింహస్వామి రూపంలో ఇది ప్రధానమన్నారు. అమ్మవారు ఉండటంతో స్వామివారు శాంతమూర్తిగా ఉన్నారని, అమ్మవారు లేకున్నా దయామూర్తిగా ఉంటారని, అంతేకానీ ఉగ్రమూర్తికారని నర్సింహాచార్యులు పేర్కొన్నారు. యాదాద్రి పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం ప్రశంసనీయమని, లోకోత్తరస్థాయిలో గోపురాల నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు.

### మూల విరాట్టును ఎవరూ తాకలేదు

నరసింహస్వామి మూలవిరాట్టును శిల్పులు తాకలేదని ప్రధానార్చకులు నరసింహాచార్యులు స్పష్టంచేశారు. స్వామివారికి ఏండ్ల తరబడి సిందూరం వేస్తున్నామని, దీంతో దాదాపు 15 అంగుళాల మందం వరకు సిందూరం అంటుకున్నదని వివరించారు. పునర్నిర్మాణం సమయంలో శిల్పాలు చెక్కుతున్నప్పుడు దుమ్ము, ధూళి గర్భగుడిలో స్వామివారిపై పడుతున్నదని చెప్పారు. స్వామివారికి ప్రాచీనకాలంనుంచి వేసిన సిందూరాన్ని పునర్నిర్మాణం నేపథ్యంలో తామే స్వయంగా ఉపవాసం ఉండి, నిష్ఠతో తొలిగించినట్టు తెలిపారు. వేల ఏండ్ల నుంచి స్వామివారికి సేవచేస్తున్నామని, స్వామివారిని ఎవరినీ తాకనీయబోమని చెప్పారు. సిందూరం వేసినప్పుడు చీమలు, ఎలుకలతోనూ ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఏండ్ల తరబడి అంటిన సిందూరం తీసివేయడంతో స్వామివారి రూపం కొత్తగా కనిపిస్తున్నదని వివరించారు. స్వామివారి అసలురూపం అదేనని స్పష్టంచేశారు. సిందూరం తీయడం తప్పుకాదని చెప్పారు. సింహాచలంలో స్వామివారికి ఏటా చందనోత్సవం చేస్తుంటారని, అక్కడపైన ఉన్నది నరసింహస్వామి అయితే.. లోపల ఉన్నది వరహాస్వామి అని తెలిపారు. ఏడాదికొక్కసారి మాత్రమే దర్శనం కల్పిస్తుంటారని చెప్పారు. ఎలుకలు, పందికొక్కులు గర్భాలయం కింద భూమిని తవ్వుతుంటే ఇబ్బంది జరుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానంలో 12 ఏండ్లకోసారి అష్టబంధనం చేస్తుంటారని తెలిపారు. ఇది ఆగమశాస్త్రంలోనే ఉన్నదని గుర్తుచేశారు. గర్భాలయంలో స్వామివారికి అపచారం జరుగలేదని, భవిష్యత్తులో కూడా జరుగబోదని స్పష్టంచేశారు.

### దివ్యదర్శనం ఎవరూ చూడలేదు

లక్ష్మీనరసింహస్వామి దివ్యదర్శనం ఎవరూ చూడలేదని, శతాబ్దాల కిందట జగద్గురు శంకరాచార్యులు నృసింహస్వామి స్వరూపాన్ని స్తుతించారని ప్రధానార్చకులు తెలిపారు. శతాబ్దాల క్రితమే నరసింహస్వామి పూర్వపు స్వభావాన్ని నంబార్ అళ్వార్ స్తుతించారని చెప్పారు. ఇలాంటి నరసింహస్వామి ఎప్పుడో యుగయుగాల కిందటే ఆవిర్భవించారని, కాలపరిణామ క్రమంలో మార్పులు, చేర్పులు సహజమేనని తెలిపారు.

### అసంతృప్తి లేనే లేదు

యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో ఎలాంటి అసంతృప్తి లేదని ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు స్పష్టంచేశారు. ఆగమశాస్త్రం ప్రకారం నిర్మాణం పూర్తయిన తర్వాత బాలాలయంలోని మూర్తులన్నింటినీ గర్భాలయంలోకి తీసుకుపోతామని తెలిపారు. అసంతృప్తి అనేది లేనేలేదని, లోపాలుంటే వాటిని సవరించే అవకాశం ఇస్తున్నామని చెప్పారు. ద్వారాన్ని రెండు అంగుళాలు ఎత్తుచేశారని, దాన్ని గుర్తించి చెప్పడంతో సవరించుకున్నారని తెలిపారు. చినజీయర్ స్వామి ఆదేశాలు, పర్యవేక్షణతోనే పనులు జరుగుతున్నాయని స్పష్టంచేశారు. మతాచార్యులను తాము అగౌరవపరచుకోబోమని చెప్పారు.

### ఫొటోలకు అవకాశం ఇవ్వలేదు

గర్భాలయంలోగానీ, ఆలయ పరిసరాల్లోగానీ ఎలాంటి ఫొటోలకు అవకాశం ఇవ్వలేదని ఈవో గీత పేర్కొన్నారు. పనులుచేసే విషయంలో కూడా శిల్పులు వెళ్లడం, రావడంపై నిబంధనలు వర్తింపజేస్తున్నామన్నారు. అర్చకుల సమక్షంలో గర్భాలయ పనులు జరుగుతున్నాయని చెప్పారు. గర్భాలయ పనుల సందర్భంగా నిష్ఠతో పనులు చేయిస్తున్నామని తెలిపారు. ప్రధాన ఆలయ పనులన్నీ ముగిశాయని, విద్యుత్తు దీపాలు, ఫ్లోరింగ్ పనులు మిగిలాయని, జనవరి నెలాఖరుకు సంపూర్ణంగా పూర్తవుతాయని చెప్పారు.

### త్వరలోనే పనులు పూర్తి: కిషన్‌రావు

యాదాద్రి ఆలయపనులు త్వరలోనే పూర్తిచేస్తామని ఆలయ ప్రత్యేకాధికారి కిషన్‌రావు చెప్పారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని ఖండించారు. యాదాద్రిలో 750 ఎకరాల్లో కాటేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. దాతలకు ప్లాట్‌లు ఇస్తామని, త్వరలోనే వాటి ధరలు నిర్ణయిస్తామని అన్నారు. తిరుపతి మాదిరిగా ఇక్కడ నిర్మాణం చేస్తామని చెప్పారు. పురాతన దేవాలయంలో అభివృద్ధి పనులుచేస్తున్నామని, పనులు పూర్తి అయిన తర్వాత సీఎం కేసీఆర్ మహాయజ్ఞం చేయాలని నిర్ణయించారని కిషన్‌రావు తెలిపారు. ఇలాంటి దేవాలయం వెయ్యి ఏండ్ల తర్వాత కూడా చరిత్రలో నిలుస్తుందని చెప్పారు. ఇది రాతితో నిర్మిస్తున్నామని, వాస్తవాలు తెలుసుకుని రాయాలని హితవు పలికారు.

## లోకం పోకడ



నేను హోం వర్క్ చేయలేదని, మార్కులు తక్కువొచ్చాయనీ చింత వలదు.. ఫలితాలపై ఆశ వదిలి మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి!

# ఆలయంపై అక్కసు

- నిన్నటివరకు నిర్మాణంపై.. నేడు మూలవిరాట్‌పై పిచ్చిరాతలు
- యాదాద్రికి పూర్వవైభవాన్ని తెస్తున్న సీఎం కేసీఆర్
- జీర్ణించుకోలేకపోతున్న పచ్చపత్రిక.. నాడు భద్రాద్రిపైనా అదే ధోరణి
- ఏడాదిన్నర క్రితమే సిందూరం తొలిగించామన్న ప్రధానార్చకులు




**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో ఏదైనా అభివృద్ధి జరుగుతుంటే.. ఆ పత్రికకు నిద్రపట్టదు! తెలంగాణ అభివృద్ధి చెందటం అంటే.. జీర్ణంకాదు! అందుకే విషపురాతలు.. వెకిలి వ్యాఖ్యలు! గతంలో భద్రాద్రి విషయంలోనూ 'రాముడా.. రామ నారాయణుడా' అంటూ దుమారం లేపి.. భక్తులను అయోమయానికి గురిచేసి పబ్బంగడుపుకొన్న ఆంధ్రజ్యోతి.. ఇప్పుడు ఏకంగా యాదాద్రి ఆలయం పునర్వైభవానికి సిద్ధపడుతుంటే.. కడుపుమండి పతాకశీర్షికల్లో తన పైత్యాన్ని వాంతిచేసుకుంటున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి! యావత్ ప్రపంచం అద్భుతం అంటూ కీర్తిస్తున్న యాదాద్రి ఆలయం పునర్నిర్మాణ పనులపై మొన్నటిదాకా అక్కసు చూపిన ఆంధ్రజ్యోతి.. ఇప్పుడు ఏకంగా మూలవిరాట్ విషయంలోనే విషంగక్కేలా తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నదని భక్తకోటి మండిపడుతున్నది. యాదాద్రిని ప్రపంచంలోనే శ్రీవైష్ణవ దేవాలయాలకు దిక్సూచిగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న పనులపై మూడేండ్లుగా ఆంధ్రజ్యోతి ఏదో ఒక తీరున అసహనాన్ని వ్యక్తంచేస్తూనే ఉన్నది. మరికొద్ది రోజుల్లో నిజరూప దర్శనాల వేడుకలకు యాదాద్రి నరసింహుడు సిద్ధమవుతున్న తరుణంలో ఆ పత్రిక అబద్ధపు వార్తలు పరాకాష్టకు చేరుకున్నాయని భక్తులు మండిపడుతున్నారు.

**మూలవర్యులు కనిపించనంత సిందూరం!**

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి మూలవరులకు ఆలయంలో ఎలాంటి ఉత్సవాలు జరిగినా సిందూరంతో అలంకరణ చేస్తారు. వందేండ్ల నుంచి ఇలాగే చేస్తున్నారు. చివరికి మూలవరులు కనిపించనంత మందంలో సిందూరం పేరుకుపోయింది. అందుకే మూలవిరాట్‌పై ఏడాదిన్నర క్రితమే సిందూరం తొలిగించామని ఆలయ అర్చకులు స్పష్టంచేస్తున్నారు. సిందూరం తొలిగింపు కార్యక్రమాన్ని ప్రధానార్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు ఆధ్వర్యంలోని అర్చక బృందం ఏడాదిన్నర క్రితమే నిర్వహిస్తే.. ఇప్పుడు జరిగినట్లు ఎందుకు చిత్రీకరిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఏడాదిన్నర క్రితమే తొలిగించాం**

'సింహాచలంలో ప్రతి ఏడాది చందనోత్సవం జరిపి అప్పన్న విగ్రహానికిగల చందనమంతా తీసి కొత్త చందనం పూస్తారు. తిరుమలలో ప్రతి పన్నెండేండ్లకోసారి కళావరోహణం నిర్వహిస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహానికి పేరుకుపోయిన సిందూరం, ఇతర పదార్థాలను తొలిగించి, కొత్త హంగులు అద్దుతారు. అలాంటిదే యాదాద్రిలో నిర్వహించాం. ఆలయాన్ని పునర్నిర్మించేవేళ.. మూలవర్యుల విగ్రహాలు భక్తులకు చక్కగా కనిపించాలన్న తపనతో చినజీయర్ స్వామివారి చేతుల మీదుగా కళావరోహణము నిర్వహించి, ఏడాదిన్నర క్రితం సిందూరం తొలగించాం' అని ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఉప ప్రధానార్చకులు కారంపూడి నరసింహాచార్యులు వెల్లడించారు. 'మూలవరులకు గల సిందూరం తొలిగించడం వల్ల నిజమూర్తి దర్శనమిచ్చారు. ఎన్నోఏండ్లుగా పేరుకుపోయిన సిందూరం వల్ల.. వెలిసిన మూర్తి కనిపించని పరిస్థితి ఏర్పడింది. కొన్నేండ్ల నుంచి సిందూ రం పేరుకుపోవడం వల్ల దానిలో క్రిమికీటకాలు పేరుకున్నాయి. వాటిని తొలిగించాలనే ఉద్దేశంతో శ్రీస్వామివారికి ఏడాదిన్నర కిత్రమే శాంతిపూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా సిందూ రం తొలిగించాం. నరసింహుడు హిరణ్యకశ్యపుడిని చంపినప్పుడు మాత్రమే ఉగ్రమూర్తి. అమ్మవారు శ్రీవారి అంకపీఠంపై కూర్చోగానే దివ్య మంగళమూర్తిగా, శాంతమూర్తిగా మారిపోయి భక్తులను యాదాద్రిలో ఉద్ధరిస్తున్నారు. సిందూరం తొలిగిస్తే ఉగ్రమూర్తిగా మారాడనే కథనం పూర్తిగా అబద్ధం. సింహరూపుడైన నారసింహునికి కోరలు సహజం. శ్రీవారి దంతాలు బయటకు కనిపించినంత మాత్రాన ఉగ్రరూపుడంటే ఎలా? పనిగట్టుకుని ప్రచారం చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఎవరూ ఊహించని విధంగా ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న వేళ నరసింహుని భక్తులకు తీవ్ర మానసిక వేదన కలిగించాలనే దుర్మార్గం స్పష్టంగా కన్పిస్తున్నది. ఆలయంలో కొంతమంది అర్చకులు కావాలని కుట్ర పన్ని బద్నాం చేస్తున్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడు శాంతమూర్తిగానే ఉన్నారు' అని వారు పేర్కొన్నారు.




## ఆనాడు భద్రాద్రిపై దుష్ప్రచారం

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల క్షేత్రం విషయంలో కూడా ఆంధ్రజ్యోతి గతంలో రాద్ధాంతం చేసిందని, 'రాముడా...రామనారాయణుడా' అనే అంశంతో అయోమయానికి గురిచేసిందని భక్తులు పేర్కొంటున్నారు. ''భద్రాద్రీశునకు జరుగుతున్న ఘోరాపచారం' అనే పుస్తకం సైతం పెను వివాదానికి దారితీసింది. ఆలయ అర్చకులు.. ఆ పుస్తకాన్ని చించివేసి మరీ తమ నిరసన వ్యక్తం చేశారు. భద్రాచలం క్షేత్రం పాంచరాత్రాగమన ప్రకారం శ్రీవైష్ణవ సంప్రదాయమే కొనసాగుతుందని స్పష్టంచేశారు.

**గాలి వార్తలా ఉంది..**

యాదాద్రిపై ఆంధ్రజ్యోతి కథనం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నది. ఇది గాలివార్తలాగా ఉన్నది. సిందూరం, శుభ్రపరచడం విషయంలో ప్రధాన అర్చకులు, శిల్పి వాస్తవ విషయాలు పేర్కొన్నారు. నిర్ధారణ లేకుండా నిర్ణయం రాయడం భక్తులను అయోమయానికి గురిచేస్తుంది. మీడియా సంయమనం పాటించాలి. భక్తుల మనోభావాలను దెబ్బతీసే అర్హత ఎవ్వరికి లేదు.

– స్థలసాయి, భద్రాచలం రామాలయంస్థానాచార్యులు

## అనుచిత ప్రచారం హేయం

- దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి


బేతి రంగారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, పురాతన శిల్ప సంపదలను మైమరిపించేలా, ఆగమ సంప్రదాయాలను పాటిస్తూ సీఎం కేసీఆర్ యాదాద్రి దేవాలయాన్ని పునర్నిర్మిస్తున్నారని, ఇలాంటి సమయంలో అనుచిత ప్రచారం చేయడం హేయమైన చర్య అని తెలంగాణ దేవాదాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి అన్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి సూచనలను, సలహాలను పాటిస్తూ దేవాలయ పనులు అద్భుతంగా సాగుతున్నాయని చెప్పారు. నిర్మాణాలపైనే కాకుండా ఏకంగా స్వామివారి మూలవిరాట్టుకే అపచారం జరిగిందంటూ ప్రచారం చేయడం దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. స్వామివారికి ఎన్నో ఏండ్లుగా సిందూరాన్ని తొలిగించలేదని, ఇప్పుడు దాన్ని తొలిగించి, మూల విరాట్టును శుద్ధిచేసి తిరిగి సిందూరంతో అలంకరించడం ఆగమ శాస్త్రానుసారమే జరిగిందని చెప్పారు. యాదాద్రి ఆలయ కీర్తిప్రతిష్ఠలను ప్రపంచవ్యాప్తంచేస్తున్న విషయాన్ని తట్టుకోలేక కొందరు దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని, తప్పుడు సమాచారాన్ని నమ్మరాదని భక్తులను రంగారెడ్డి కోరారు.





బొమ్మలరామారం మండల కేంద్రంలో ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులను దహనంచేస్తున్న టీఆర్ఎస్ మండల నాయకులు


యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్‌లో ఆంధ్రజ్యోతి ఎండీ రాధకృష్ణ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న టీఆర్ఎస్ నాయకులు

# ఆంధ్రజ్యోతి కథనంపై ఆగ్రహం

- జిల్లావ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు
- ఆంధ్రజ్యోతి ప్రతులు.. ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మ దహనం
- యాదగిరిగుట్ట ఏసీపీకి టీఆర్ఎస్ ఫిర్యాదు

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ విషయంలో ఆంధ్రజ్యోతి పత్రిక ప్రచురించిన తప్పుడు కథనంపై యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు మండిపడ్డారు. ప్రపంచదేశాలే అబ్బురపడేలా జరుగుతున్న యాదా ద్రి అభివృద్ధిని ఓర్వలేకే తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని నిప్పులు చెరిగారు. స్వయంభువు అయిన స్వామివారిని దర్శించుకునే వేల మంది ప్రజల మనోభావాలు దెబ్బతిసేలా, ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా కథనం ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం యాదగిరిగుట్టలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు కాటబత్తిని ఆంజనేయులు, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, వివిధ గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. గుట్టలోని ప్రధాన రహదారిపై ఆంధ్రజ్యోతి దినపత్రికను, ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. తప్పుడు కథనం రాసిన పత్రిక ఎండీపై చర్య లు తీసుకోవాలని యాదగిరిగుట్ట పీఎస్‌లో ఫిర్యాదుచేశారు. ఆలేరులో టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు ఆకవరం మోహన్‌రావు ఆధ్వర్యంలో, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య ఆధ్వర్యంలో, రాజాపేట మండల కేంద్రంలో ఎంపీపీ గోపగాని బాలమ్మణి, జెడ్పీటీసీ గోపాల్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నాయకత్వంలో, బొమ్మలరామారం మండల కేంద్రంలో ఎంపీపీ చీముల సుధీర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో, తుర్కపల్లి మండల కేంద్రంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడి నేతృత్వంలో, గుండాల మండలంలో టీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు.

**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad
**DEPARTMENTAL TESTS, NOVEMBER-2019 SESSION (Notfn.No.07/2019)**
It is to inform that **Departmental Test** examinations of **November-2019 Session (Notification No. 07/2019)** are scheduled from **14/12/2019 to 23/12/2019** in CBT (Computer Based Test) Method of examination on On-Line Mode to be conducted in 9 District Head Quarters of Telangana State including Hyderabad clubbed with Ranga Reddy & in HMDA Limits and also in Delhi as one of the Examination centres. The candidates who have applied may download the Hall Ticket from Commission's official website **www.tspsc.gov.in** from **07-12-2019** onwards. The Hall Tickets may be preserved carefully for future needs as duplicate Hall Tickets will not be issued under any circumstances.
In case of any difficulty in downloading the Hall tickets, the candidates may contact Help-Desk through Land Line No. 040-22445566.
**Place: Hyderabad** **Sd/-**
**Date: 27/11/2019** **SECRETARY**
DIPR R.O. No. 522-PP/CL/Advt/1/2019-20





కాంగ్రెస్ నేత చిదంబరంను బీజేపీ కక్షసాధింపుతో కేసులు పెట్టి వేధిస్తున్నదన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఆయనపై ఉన్న అవినీతి కేసుల్లో ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయి. అందుకే ఆయనకు బెయిల్ రావటం లేదు. ఆయన హోంమంత్రిగా ఉన్నప్పుడు నాపై, మోదీ, అమిత్ షాలపై తప్పుడు కేసులు పెట్టించారు. కానీ నిర్దోషులుగా నిరూపించుకున్నాం.

**నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి**

కర్ణాటక ఉప ఎన్నికల్లో బీజేపీ కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నది. నోట్లతో ఓట్లను కొనేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రజలంతా బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు అదను కోసం వేచిచూస్తున్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.

**సిద్ధరామయ్య, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1955**

అమెరికా అలబామాలో బస్సు బహిష్కరణ ఉద్యమాన్ని ప్రారంభించిన హక్కుల కార్యకర్త రోసా పర్క్స్.

**1957**

ఇండోనేషియా నుంచి డచ్ దేశస్థులను బహిష్కరించిన అధ్యక్షుడు సుకర్ణో.





**1958**

ఇంగ్లండ్‌లో సబ్‌స్క్రైబర్ ట్రంక్ డైలింగ్ (ఎస్‌టీడీ) విధానాన్ని ప్రారంభించిన బ్రిటిష్ రాణి ఎలిజబెత్-II.

నేపాల్ రాజకీయాలలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎన్‌సీపీ), నేపాలీ కాంగ్రెస్ ప్రధాన రాజకీయపక్షాలని మిగతా పార్టీలు దరిదాపుల్లో కూడా లేవని ఇటీవలి ఉప ఎన్నికల ద్వారా తెలిసిపోయింది. కొన్ని పార్టీల అభ్యర్థులకు, కొందరు ఇండిపెండెంట్లకు ఒక్క ఓటు కూడా రాలేదు. కాస్కీ (2) నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్‌సీపీ అభ్యర్థి బిద్యా భట్టారాయ్ నేపాలీ కాంగ్రెస్ అభ్యర్థిపై భారీ మెజారిటీతో గెలిచారు. ఈ ఉప ఎన్నికలు ముగిసినందున ఇక రాజకీయపక్షాలు ప్రజాసేవపై దృష్టి సారించాలె.

**ది హిమాలయన్ టైమ్స్**

కెనడాలో వృద్ధుల సమస్యలపై ప్రభుత్వం కొత్త చూపును ప్రసరిస్తున్నది. ఇంతకాలం వృద్ధులను ఆశ్రమాల్లో పెట్టి ఉపచారాలు చేయడంతో సరిపోయేది. దీనివల్ల వారు చివరిరోజులు ఏ సార్థకత లేకుండా నిస్సారంగా గడపవలసి వస్తున్నది. కానీ టొరంటోలోని పది నర్సింగ్ హోమ్స్‌లో పరిస్థితులు మారుతున్నాయి. వారిని మానసిక, ఉద్వేగ అవసరాలు తీర్చేవిధంగా ఉద్యోగులకు తర్ఫీదు ఇస్తున్నారు. వారు సమాజంతో సంబంధాలను కలిగి ఉండటం వల్ల సంతృప్తిగా ఉంటారు.

**ది టొరంటో స్టార్**



# ప్రగతిలో ప్రథమం

తెలంగాణ అవతరించిన అనతికాలంలోనే వ్యవసాయ, పారిశ్రామిక రథచక్రాలపై ప్రగతిరథం పరుగులు తీయడం అబ్బురపరిచే పరిణామం. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన ప్రతిష్ఠాత్మక టీఎస్ఐపాస్ పథకం దేశానికే ఆదర్శంగా మారింది. వివిధ రాష్ట్రాల వారు వచ్చి ఈ పథకాన్ని అధ్యయనం చేస్తున్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో మున్నెన్నడూ లేనివిధంగా పరిశ్రమల స్థాపన, ఉద్యోగకల్పన జరిగింది. టీఎస్ఐపాస్ ఆరో సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ రాష్ట్ర అభివృద్ధి మార్గం మరింత ఉజ్వలంగా ప్రజల జీవితాలను ఉన్నతీకరించటానికి దోహద పడనున్నది. 2014 డిసెంబర్ 4న ఈ చట్టం అమల్లోకి వచ్చిన నాటినుంచి ఈ ఐదేండ్ల కాలంలోనే 11వేలకు పైగా పరిశ్రమలు అనుమతులు పొంది, 13 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఈ పరిశ్రమల స్థాపన నేపథ్యంలో రాష్ట్రంలోకి 1.73 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సమకూరాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అనుమతులు, స్వీయ ధృవీకరణ విధానం (టీఎస్ఐపాస్) అపూర్వమైనది, విశిష్టమైనది. టీఎస్ఐపాస్ మూలంగా అనేక అనుమతుల చిక్కుముడులు, కాలయాపన విధానాలు లేకుండాపోయాయి. పరిశ్రమల స్థాపనకు సరళతర విధానం ఏర్పాటైంది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి పెట్టేవారికి అనుమతులు పొందే హక్కును గుర్తిస్తూ, దరఖాస్తుదారు స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ఆమోదం పొందే వెసులుబాటును కల్పించింది. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వటంలో ఆలస్యం జరిగితే అధికారులకు జరిమానా విధించడం ఒక అంశమైతే, దరఖాస్తుదారు గడువులోగా అనుమతులు లభించకపోతే నేరుగా ఆమోదం పొందినట్లుగా పరిగణించటం మరో కీలక అంశం. ఈ విధానపరమైన మార్పులతో పాటు మంత్రి కేటీఆర్ సాగించిన కృషి ఫలితంగా ఇవాళ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచింది.

**తెలంగాణ వస్తే ఏమొస్తుందని ప్రశ్నించిన వారికి పారిశ్రామిక, వ్యవసాయాది రంగాలలో సాధించిన విజయమే తగిన జవాబు. తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుతగలడం మొదలుకొని అయినదానికి, కానిదానికి వివాదాలు సృష్టించి అభివృద్ధికి అడ్డుతగిలేవారికి ఈ తెలంగాణ సాధించిన విజయమే దీటైన సమాధానం. తెలంగాణ భవిష్యత్తులో కూడా ఇదేరీతిలో అభివృద్ధి చెందాలంటే.. సమాజమంతా ఒక్కతాటిపై నిలిచి పరస్పర సహకారంతో ముందుకుపోవాలె. తెరవెనుక కుట్రలు చేసే పరాయి మనుషుల ఉచ్చులో పడకూడదు.**

వినూత్నమైనరీతిలో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం మూలంగా ఇవాళ రాష్ట్రంలోని జలాశయాలు నిండుకుండల్లా మారాయి. భూగర్భ జలమట్టం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ కృతనిశ్చయానికి తాజా ఉదాహరణ- శ్రీరామ్‌సాగర్ ఆయకట్టుకు చివరివరకు నీరందించడం! గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో తగిన సాగునీటి ప్రాజెక్టులే చేపట్టలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఒకటి ఉన్నదీ అదీ ఇంతకాలం నామమాత్రంగానే మారింది. పేరుకు పద్నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టు అని చెప్పడమే తప్ప అందులో మూడోవంతు కూడా ఏనాడూ పారింది లేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర నీటి విధానం మూలంగా- నేడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చివరి ఎకరం వరకు నీరందడంతో రైతుల మొహంలో వెలుగులు నిండాయి. భారీ జలాశయాలతో పాటు చెరువులు కుంటలు కూడా నీటితో కళకళలాడుతున్నాయి. తెలంగాణ ఉద్యమసారథి కేసీఆర్‌కు ఉద్యమకాలం నుంచే తెలంగాణ సమగ్రాభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉన్నది. పారిశ్రామికాభివృద్ధి పట్ల కూడా స్పష్టత ఉన్న దార్శనికులు కేసీఆర్. అన్నిరంగాల్లో సమగ్రాభివృద్ధి సాగాలంటే నిర్దిష్ట సమాజానుకూల విధానాల రూపకల్పన ఎంత ముఖ్యమో, వాటి అమలులో అంతటి నిబద్ధత నిమగ్నత అత్యవసరం. తెలంగాణ సమగ్రాభివృద్ధిలో భాగంగా వ్యవసాయ, పారిశ్రామికరంగాలకు రాష్ట్ర ప్రభుత్వం సమప్రాధాన్యం ఇచ్చింది. దీనిలో భాగంగానే ఎన్నడూ లేనివిధంగా సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణం రాష్ట్రావతరణ తర్వాత చేపట్టారు. ఒకప్పుడు తెలంగాణ అంతా కరువు కాటకాలతో అల్లాడుతుంటే, గోదావరి నదీజలాలు మాత్రం సముద్రం పాలయ్యేవి. ఇప్పుడు జలకళను సంతరించుకోవడం తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయం.

తెలంగాణ వస్తే ఏమొస్తుందని ప్రశ్నించినవారికి పారిశ్రామిక, వ్యవసాయాది రంగాలలో సాధించిన విజయమే తగిన జవాబు. తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుతగలడం మొదలుకొని అయినదానికి, కానిదానికి వివాదాలు సృష్టించి అభివృద్ధికి అడ్డుతగిలేవారికి ఈ తెలంగాణ సాధించిన విజయమే దీటైన సమాధానం. తెలంగాణ భవిష్యత్తులో కూడా ఇదేరీతిలో అభివృద్ధి చెందాలంటే.. సమాజమంతా ఒక్కతాటిపై నిలిచి పరస్పర సహకారంతో ముందుకుపోవాలె. తెరవెనుక కుట్రలు చేసే పరాయి మనుషుల ఉచ్చులో పడకూడదు. దశాబ్దాల పాటు పరాయి పాలనలో నలిగిపోయిన తెలంగాణ రాష్ట్రం తన శక్తియుక్తులన్నీ కూడదీసుకొని ఇతర రాష్ట్రాలను మించి ఎదుగుతున్నది. ఈ దశలో తెలంగాణ ప్రభుత్వానికి సహకరించి ప్రోత్సహించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. వ్యవసాయ, పారిశ్రామికరంగాల్లో, మౌలిక వసతుల కల్పనలో, సంక్షేమరంగంలో తెలంగాణ రాష్ట్రానికి తగినరీతిలో నిధులను అందించాలె. రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి అనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. రాష్ట్రంలోని అన్ని రాజకీయపక్షాలూ తమ విభేదాలను పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధిలో సహకరించుకోవాలె. రాజకీయ విభేదాలతో పరస్పరం కలహించుకోవడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. అందువల్ల కేంద్రం నుంచి నిధులను రాబట్టేందుకు రాజకీయ పక్షాలన్నీఏక తాటిపై నిలువాలె.

**జనగళం**

### కఠిన శిక్షలు విధించాలె

నలుగురు మృగాళ్ల చేతిలో శంషాబాద్ సమీపంలో లైంగికహత్యకు గురైన దిశ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకావడం హర్షణీయం. దిశ కేసు విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను హైకోర్టు ఆమోదించడం ఆహ్వానించదిగిన విషయం. నలుగురు నిందితులను వెంటనే ఉరి తీయాలని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకావడంతో నిందితులకు వెంటనే సరైన శిక్ష పడుతుందనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతున్నది. ఏదేమైనా దిశ కేసులో ఆలస్యం చేయకుండా నిందితులకు కఠినశిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దీంతో తప్పుచేసేవారికి భయం ఏర్పడాలి.

**- వేల్పుల రాజుయాదవ్, రామకృష్ణకాలనీ, కరీంనగర్**

### అవినీతి నిర్మూలించాలె

ఒక వైపు అవినీతి నిర్మూలన వారోత్సవాలు జరుగుతుంటే ఇంకో దిక్కు అవినీతి అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడుతున్నారు. అవినీతి నిర్మూలన కోసం ప్రజలందరూ చైతన్యంగా వ్యవహరించి అవినీతి పరుల ఆట కట్టించాలి.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి రహితంగా పనులు జరుగాలి. అవినీతికి పాల్పడే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే అవినీతి రహిత తెలంగాణ గా రాష్ట్రం భాసిల్లుతుంది.

**- పిల్లి కిరణ్, హైదరాబాద్**

### వ్యక్తిగత విమర్శలు మానుకోవాలె

కొందరు ప్రభుత్వ నేతలపై సామాజిక మాధ్యమాలు వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తుండటం బాధాకరం. వ్యక్తిగత విమర్శలు చేస్తూ వారి ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి వారిని చట్టప్రకారం శిక్షించాల్సిన అవసరం ఉన్నది. అట్లాగే సోషల్‌మీడియాలో అబద్ధపు వార్తలను ప్రచారంలో పెట్టేవారిని కూడా కనిపెట్టి అబద్ధపు వార్తలకు అడ్డుకట్ట వేయాలె. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలె.

**- సీహెచ్ అరుణ్, వెల్గనూర్, మంచిర్యాల**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# గౌరవనీయత అక్కరలేని బీజేపీ

**రాజకీయపార్టీలు అధికారం కోసం నిర్హేతుకమైనవి అనేకం చేస్తాయి. కానీ ఆ రాజకీయ ధోరణి శృతిమించినప్పుడు ప్రజల దృష్టిలో అపహాస్యం పాలవుతాయి. వాటిపట్ల గౌరవనీయత లేకుండాపోతుంది. తెలంగాణలో బీజేపీ ముఖ్యంగా నాలుగు లోక్‌సభ సీట్లు వచ్చినప్పటి నుంచి ఇదే అతిశయాన్ని ప్రదర్శిస్తున్నది. అందుకు తాజా ఉదాహరణలు, కేంద్రం జోక్యం చేసుకోగలదనే భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకుందనటం, బీజేపీ జాతీయ నాయకత్వం మహారాష్ట్ర వలె ఇక్కడ కూడా సర్జికల్ స్ట్రయిక్ చేసి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందనటం.**

ఈ రెండు మాటలు కూడా అన్నది తెలంగాణ బీజేపీలో ఎవరో కిందిస్థాయి నాయకులు కారు. అట్లా అయిన పక్షంలో వారిని పట్టించుకోనక్కర లేదు. కానీ సాక్షాత్తూ పార్టీ అధ్యక్షుడు అయిన డాక్టర్ లక్ష్మణ్ వ్యాఖ్యలివి. ఆ పార్టీలో ఆయనంతటి మర్యాదస్తులు, సున్నితమైనవారు అరుదు. ఇటువంటి దశాబ్దాల ప్రతిష్ఠను ఆయన ఉన్నట్లుండి, ఎందువల్లనో గాని గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి నాలుగు లోక్‌సభ సీట్లు వచ్చినప్పటి నుంచి చేజేతులా దెబ్బతీసుకుంటున్నారు. ఆ నాలుగు సీట్లు ఎట్లా వచ్చాయనేది అట్లుంచి, అంతకుముందు వరకు ఆయన వ్యవహారణ గౌరవనీయంగానే ఉండేది. అప్పటినుంచి అకస్మాత్తుగా మారింది. ఇక తెలంగాణలో అధికారానికి వచ్చివేయనున్నామనే అంచనాలకు వచ్చి ఈ ఉత్సాహం కలుగుతున్నదేమో తెలియదు. మొత్తానికి దీని ప్రతిఫలనం వ్యక్తిగతంగా ఆయనపైనే గాక తన పార్టీపై కూడా ఉంటున్నది. ఇంత సీనియర్, నెమ్మదస్తుడు అయిన లక్ష్మణ్ తీరు ఈ విధంగా ఉన్నప్పుడు ఇక జూనియర్ నాయకుల మాట చెప్పనక్కరలేదు.

ముందుగా ఆర్టీసీ విషయం చూద్దాం. ఆ సిబ్బంది సమ్మె యాభై రోజులకుపైగా సాగింది. చివరకు యూనియన్లు విలీనం డిమాండ్‌ను పక్కన పెట్టడం ఒక దశగా, ఆందోళనను బేషరతుగా విరమించటం రెండవ దశగా ఆ సమ్మె ముగిసింది. సమ్మె సాగిన 55 రోజుల కాలంలో దాని నుంచి లాభపడేందుకు ఇతర పార్టీలతో పాటు బీజేపీ సకల ప్రయత్నాలు చేసింది. అటువంటి ప్రయత్నాలలో కేంద్రం గురించిన ప్రస్తావనలు పదే పదే చేయటం ఒకటి. కేంద్రంలో అధికారం నెరపుతున్నారు గనుక అటువంటి ప్రస్తావనలు చేసే సదవకాశం ఇతర పార్టీలకు లేనివిధంగా బీజేపీకి లభించింది. దానిని వారు పూర్తిగా సద్వినియోగం చేసుకొని, ఆర్టీసీ సిబ్బందిలో పేరు తెచ్చుకోవాలనుకున్నారు. అందుకోసం విసిరిన మొదటి పాచిక, తెలంగాణ ఆర్టీసీ అన్నది ఇంకా ఏపీఎస్ ఆర్టీసీలో భాగమే తప్ప దానికి సొంత ఉనికి లేదనటం. కనుక టీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదని ప్రకటించటం. మొత్తంగా ఆర్టీసీలో కేంద్రానికి 30 శాతం వాటా ఉంది గనుక సమ్మె విషయాల్లో ఏ నిర్ణయానికైనా కేంద్రం అనుమతి కావాలనటం. కేంద్రంలో ఉన్నది తమ పార్టీ ప్రభుత్వం అయినందున ఆ ప్రభుత్వపు జోక్యాన్ని హైదరాబాద్ నుంచి తాము ప్రభావితం చేయగలమని ధ్వనింపజేయటం. ఈ పరిస్థితుల్లో సమ్మెకారులు భయపడనక్కరలేదని భరోసా ఇవ్వబూనారు వారు.

వినేందుకు ఇదంతా ఆకర్షణీయంగా ఉన్నందున ఆందోళనకారులు, పలువురు ఇతరులు ఈ మాటలను తొలి దశలో నమ్మారు. రాష్ట్ర హైకోర్టు కూడా కేంద్రానికి నోటీసు జారీచేసి విషయమేమిటో చెప్పమన్నది. ఆ దరిమిలా జరిగిందేమిటో తెలిసిందే. తెలంగాణ ఆర్టీసీ విభజన తుదిరూపంలో ఇంకా జరుగని మాట నిజమే అయినా, కేంద్రం వాటా ఏపీ ఆర్టీసీలోనే తప్ప టీఎస్ ఆర్టీసీలో కాదని కేంద్రం పక్షాన అదనపు సొలిసిటర్ జనరల్ హైకోర్టు ముందు స్పష్టీకరణ ఇచ్చారు. మరొకవిధంగా చెప్పాలంటే సమ్మె విషయంలో తాము జోక్యం చేసుకొనలేమని ప్రకటించటమన్నమాట. ఈ మాటతో డాక్టర్ లక్ష్మణ్ బృందం పడవకు తెరచాప విరిగిపోయినట్లయింది. ఆశ్చర్యపోవటం ఆర్టీసీ సిబ్బంది వంతయింది. ఇందులో అర్థం కాని విషయం ఒకటుంది. కేంద్రం వాటా వగైరా మాటలను వారు మొదట హైదరాబాద్‌లో అనటం విన్నవారు, బహుశా బీజేపీ నాయకులు తమ ఢిల్లీ మంత్రులను, నాయకులను సంప్రదించిన తర్వాతనే ఇదంతా చెప్తుండవచ్చునని భావించి నమ్మారు. తర్వాత ఇదే నాయకులు ఢిల్లీ వెళ్లి, అక్కడ ఎవరిని నేరుగా సంప్రదించారో తెలియదుగాని, అవే ప్రకటనలు మళ్ళీ చేశారు. దానితో మొదటి నమ్మకాలు ఇంకా బలపడ్డాయి. బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో, ఢిల్లీలో చక్రం తిప్పగలరని, కేసీఆర్ ప్రభుత్వం దిగిరాక తప్పదని మాటలు సాగాయి. నిజానికి ప్రజారవాణా,రోడ్డు రవాణా రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలను, కేంద్రానికి మైనారిటీ వాటా ఉన్నంత మాత్రాన నిజమైన అర్థంలో జోక్యం అన్నది సాధ్యం కాదని, పైగా రవాణారంగంలో ప్రైవేట్‌రంగం పాత్రకు వీలు కల్పించే చట్ట సవరణను స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఇటీవల చేసిందన్న విషయాలను వివిధ వర్గాల వారు ఎత్తి చూపటమే గాక, అటువంటి సూచనాత్మకమైన కథనాలు ఢిల్లీ నుంచి కూడా ఆ రోజుల్లో వెలువడినాయి. అదనపు సొలిసిటర్ జనరల్ వివరణ ఉండనే ఉన్నది. ఆ విధంగా డాక్టర్ లక్ష్మణ్ పడవ రెండవ తెరచాప కూడా విరిగిపోయింది. వారు హైదరాబాద్ నుంచి గాని, ఢిల్లీ వెళ్లి గాని ఎవరిని సంప్రదించి ఇటువంటి తప్పు సమాచారాలు సంపాదించినట్లు అన్నది ప్రశ్న. ఈ ఉదంతంతో లక్ష్మణ్ బృందం గౌరవనీయత, విశ్వసనీయత రెండూ దెబ్బతిన్నాయి.

**రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నవంబర్ 23న మంచిర్యాల వద్ద మాట్లాడుతూ, తమ పార్టీ మహారాష్ట్రలో రాజకీయమైన సర్జికల్ స్ట్రయిక్స్ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందని, ఆ పనిని అక్కడ రాజకీయ చాతుర్యంతో చేసిన ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అదే పద్ధతిలో తెలంగాణలోనూ స్ట్రయిక్స్ చేసే పరిస్థితి దగ్గరలోనే ఉందని ప్రకటించారు. ఆయన రాజకీయ అణ్వస్త్రం అనే మాటను కూడా ఉపయోగించినట్లు పత్రికలు పేర్కొన్నాయి. మహారాష్ట్ర పరిణామాలు ఏ విధంగా మహావేగంగా సాగి ఎట్లా ముగిశాయో అందరికీ తెలుసు గనుక మళ్లీ రాయనక్కరలేదు. ఆ మహావేగం మధ్యలో బీజేపీ ప్రభుత్వం ఒక లిప్తకాలం పాటు ఏర్పడినప్పుడు కలిగిన మహోత్సాహంలో డాక్టర్ లక్ష్మణ్ ఈ ప్రకటన చేశారన్నది అర్థమవుతూనే ఉన్నది.**

జరిగినదంతా ఇది కాగా ఇప్పుడు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర ప్రభుత్వ జోక్యం భయానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నదని అపహాస్యపు వాదన చేస్తున్నారు. వాదన ఏమైనా చేయవచ్చు. కానీ అందులోని తర్కమేమిటో చూపించాలి. డాక్టర్ లక్ష్మణ్ అటువంటి తర్కం ఏదీ ఒక్క ముక్కయినా చూపించలేదు. అప్పటికే యాభై దినాలకు పైగా సమ్మె, చివరకు రెండు దశలుగా విరమణ, ఆ కాలమంతా కేంద్ర జోక్యాలు, వాటాలు వగైరాల గురించి రాష్ట్ర బీజేపీ నాయకుల రకరకాల ఆర్భాటాలన్నీ జరిగిపోయాయి. ఎప్పుడూ చిరునవ్వులు నవ్వే కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇంకా అదేపని చేయటం తప్ప హైదరాబాద్‌పైకి కేంద్ర జోక్యపు క్షిపణులు ఏవీ ప్రయోగించలేదు. తమ ముప్పై శాతం వాటా ప్రకారం ఇన్నేండ్లుగా ఒక్క రూపాయి అయినా ఇవ్వని నేపథ్యంలో మాట్లాడుతూ, ఇప్పుడు సైతం ఏమీ ఇవ్వజాలమని కాంగ్రెస్ ప్రతినిధి వర్గానికి చెప్పివేశారు. అనగా ఆర్థిక జోక్యం కూడా ఉండదన్నమాట. ఈ విధంగా వివిధ పరిణామాల మధ్య సమ్మె మొదటి నుంచి సమ్మె చివరివరకు రాష్ట్ర బీజేపీ పాలిట ఒక ఎడారిగా మారిన కేంద్ర జోక్యం, డాక్టర్ లక్ష్మణ్‌కు ఒక ఒయాసిస్సు వలె గోచరించి భ్రమింపజేస్తున్నది. అది కూడా సమ్మె ముగిసిపోయిన తర్వాత. అటువంటపుడు గౌరవనీయత ఎక్కడ? అదిలేనిదే విశ్వసనీయత ఏ విధంగా?

సరిగా ఇటువంటి ప్రహసనమే పైన పేర్కొన్న రెండవ విషయంలోనూ జరిగింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నవంబర్ 23న మంచిర్యాల వద్ద మాట్లాడుతూ, తమ పార్టీ మహారాష్ట్రలో రాజకీయమైన సర్జికల్ స్ట్రయిక్స్ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందని, ఆ పనిని అక్కడ రాజకీయ చాతుర్యంతో చేసిన ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అదే పద్ధతిలో తెలంగాణలోనూ స్ట్రయిక్స్ చేసే పరిస్థితి దగ్గరలోనే ఉందని ప్రకటించారు. ఆయన రాజకీయ అణ్వస్త్రం అనే మాటను కూడా ఉపయోగించినట్లు పత్రికలు పేర్కొన్నాయి. మహారాష్ట్ర పరిణామాలు ఏ విధంగా మహావేగంగా సాగి ఎట్లా ముగిశాయో అందరికీ తెలుసు గనుక మళ్లీ రాయనక్కరలేదు. ఆ మహావేగం మధ్యలో బీజేపీ ప్రభుత్వం ఒక లిప్తకాలం పాటు ఏర్పడినప్పుడు కలిగిన మహోత్సాహంలో డాక్టర్ లక్ష్మణ్ ఈ ప్రకటన చేశారన్నది అర్థమవుతూనే ఉన్నది. ఇటువంటి తొట్రుపాట్లు ఎవరికైనా, ముఖ్యంగా అధికారపు ఆతృత ఒక మేనియా వలె పట్టివేసిన వారికి సహజం గనుక దానిని అంతటితో వదలి వేద్దాం.

కానీ అసలు విషయం, అదేతరహాలో సర్జికల్ స్ట్రయిక్స్ తెలంగాణలో చేస్తామనటం, ఆ పని త్వరలోనే జరుగుతుందనటం, అందుకు మోదీ, షాల రాజకీయ చతురతతో సన్నాహాలు జరుగుతున్నాయని ప్రకటించటం. ప్రజల్లో బలం పెంచుకొని ఎన్నికల అధికారం ద్వారా సాధించే పని ఎవరైనా చేయవచ్చు. కానీ చతురమైన సర్జికల్ స్ట్రయిక్స్, రాజకీయ అణ్వాస్త్ర ప్రయోగాలు, మహారాష్ట్ర తరహా ఎత్తుగడలన్నవి ఆమోదనీయమైనవేనా? అధికార వాంఛతో రగిలిపోతూ, పలు ఇతర రాష్ట్రాల్లో వలె అడ్డదారులు వెతుకుతున్నవారికి ఇది ఆమోదనీయంగానే తోచవచ్చు. కానీ ప్రజలకు కాదు. తెలంగాణ ప్రజలకు అంతకన్న కాదు. బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి అధికారం లభించటం లభించకపోవటం తర్వాత విషయం. వారు కనీసం తమ గౌరవనీయతను కాపాడుకోలేరా?

# ఠాక్రే ముందు పలు సవాళ్లు

మహారాష్ట్ర రాజకీయాల్లో ఠాక్రే కుటుంబం ముఖ్యమంత్రి పదవీ చేపట్టడం ఒక విశేష పరిణామం. బాల్ ఠాక్రే ఏనాడూ స్వయంగా అధికార పదవులు చేపట్టలేదు. కానీ ఉద్ధవ్ ఠాక్రే ఆదిత్య ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. దీంతో ఠాక్రే కుటుంబం ప్రత్యక్ష రాజకీయాల వైపు పయనించడం మొదలైంది. ఇప్పుడు పరిపాలనలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ఉద్ధవ్ ఠాక్రే జవాబుదారీతనం వహించక తప్పదు. బాల్ ఠాక్రే 1966లో శివసేనను స్థాపించారు. కానీ తాను స్వయంగా ఏనాడూ ఎన్నికల్లో పాల్గొనలేదు. తాను నేరుగా అధికారం చేపట్టకుండా రిమోట్ కంట్రోల్‌గా చెప్పుకునేవారు. 1995లో పార్టీ అధికారానికి వచ్చినప్పుడు మనోహర్ జోషి ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల రాజకీయాల చికాకులంటే ఇష్టపడనప్పటికీ బాల్ ఠాక్రే అధికారాన్ని ఎప్పుడు తన గుప్పిట్లో పెట్టుకునేవారు. ఆయన అధికారంలో ఉన్నా, లేకున్నా.. ముంబైలోని ప్రముఖులు ఆయన మెప్పు కోసం పాట్లు పడేవారు. ముంబై నగరం ఆయన గుప్పిట్లో ఉండేది.

మొదట్లో శివసేన మరాఠీ భూమి పుత్రుల కోసం పోరాటం చేసింది. 1970 దశకంలో రాజకీయ పార్టీగా రూపాంతరం చెందింది. అనతికాలంలోనే దేశంలోనే అత్యంత సంపన్నమైన పురపాలక సంస్థ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగా వేసింది. శివసేన అంటేనే హింసాత్మక వర్గంగా గుర్తింపు తెచ్చుకున్నది. ఏ సమస్య ముందుకువచ్చినా సేన పద్ధతిలో పరిష్కారం అయ్యేది. 1992-93లలో బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో ముంబైలో అల్లర్లు జరిగాయి. ఈ క్రమంలో శివసేన హిందుత్వ పార్టీగా పరిణామం చెందింది. ఆ తర్వాత ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టగలిగింది. ఆ తర్వాత కాలంలో శివసేనకు బీజేపీ నుంచి సవాళ్లు ఎదురయ్యాయి. 2014లో కేంద్రంలో మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత ఆ పార్టీకి మహారాష్ట్రను చేజిక్కించుకోవాలనే ఆలోచన వచ్చింది. విడిగా పోటీచేసిన శివసే 63 సీట్లు తెచ్చుకొని కొంతకాలం ప్రతిపక్షంలో కూర్చుండి, ఆ తర్వాత బీజేపీ చేతులు కలిపింది.

ఈ పదవీ కాలమంతా రెండు పార్టీలు అధికారం పంచుకున్నప్పటికీ వాటి మధ్య పిల్లి-ఎలుక సంబంధం కొనసాగింది. కేంద్ర నాయకుల మద్దతుతో ముఖ్యమంత్రి పదవిలో ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ శివసేనను దెబ్బకొట్టడానికి ప్రయత్నాలు చేశాయి. శివసేన తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం సాగించింది.

2019 ఎన్నికల్లో బీజేపీ-శివసేన కలిసి పోటీచేశాయి. శివసేన బలహీనపడుతున్నదని బీజేపీ నాయకులు భావించారు. మోదీ నాయకత్వంలో తాము మెజార్టీ స్థానాలు సాధిస్తామని కూడా అనుకున్నారు. బీజేపీ 105 స్థానాలు తెచ్చుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ శివసేన మద్దతు ఇస్తేనే అధికారం చేపట్టగలదు. ఎన్నికల ముందు జరిగిన 50-50 ఒప్పందాన్ని అమలుచేయమని శివసేన పట్టుబట్టడంతో బీజేపీ వెనుకకుపోయింది. సీఎం పీఠం తమదేనంటూ కఠినవైఖరి ప్రదర్శించింది. బీజేపీ ఆశించినదానికి భిన్నంగా శివసేన తన పునాదులను కాపాడుకోవడం విశేషం. ఇందుకు ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఎన్నికల ముందునుంచే తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఎన్నికల తర్వాత కూడా ఉద్ధవ్ ఠాక్రే స్వయంగా ముఖ్యమంత్రి పదవి చేపట్టాలని ఆయన షరతు విధించి ఒప్పించారు. కాంగ్రెస్‌ను పొత్తుకు ఒప్పించడంలో కూడా కీలక పాత్ర పవార్‌దే. ఠాక్రే కుటుంబానికి స్వయంగా అధికారం చేపట్టిన అనుభవం లేదు. అందువల్ల ఉద్ధవ్ ముఖ్యమంత్రిగా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది.

శివసేన నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకాగానే మొదట అనుకూలమైన వార్తాకథనాలు వెలువడినాయి. కానీ ఠాక్రే ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న క్లిష్ట పరిస్థితులను అర్థం చేసుకొని వ్యవహరించాల్సి ఉన్నది. రాష్ట్రం ఆర్థికంగా కుదేలైపోయి ఉన్నది. గ్రామీణ ప్రాంతం సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నది. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు గ్రామీణ రంగంలోకి భారీగా పెట్టుబడును ప్రవేశపెట్టవలసి ఉన్నది. గత ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. రైతులు ఎన్నోసార్లు ఆందోళన బాట పట్టారు. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించకపోతే రైతులు ఆగ్రహానికి గురికావలసి ఉంటుంది. నగరప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా కనిపిస్తున్నది. నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ సమస్యలపై తక్షణం దృష్టిసారించవలసిన అవసరం ఉన్నది. గత బీజేపీ ప్రభుత్వం పలు భారీ పథకాలను అట్టహాసంగా ప్రకటించింది. తీర ప్రాంత రహదారి, ముంబై-నాగ్‌పూర్ హైవే ఇందుకు ఉదాహరణ. ఈ రెండు ప్రాజెక్టులను ఉద్ధవ్ ఠాక్రే గతంలో వ్యతిరేకించాడు. బుల్లెట్ ట్రైన్ కూడా ఠాక్రే వ్యతిరేకించారు. కానీ, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు. రాష్ట్ర ప్రభుత్వం చేయవలసిందల్లా భూమిని సేకరించడమే. మెట్రో ప్రాజెక్టును కూడా ఠాక్రే వ్యతిరేకించారు. ఇప్పుడు అధికారం చేపట్టిన ఠాక్రే ఈ పథకాల పట్ల ఏ విధంగా వ్యవహరిస్తారనేది గమనార్హం. భీమా-కోరెగావ్ కేసులో బీజేపీ ప్రభుత్వం అనేకమందిని కేసులు పెట్టి వేధించింది. ఠాక్రే ఈ విషయంలో మెతకగా వ్యవహరిస్తే ప్రజల మద్దతు పొందవచ్చు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలో అధికారం చేపట్టిన శివసేన మెరుగైన పాలనను అందించలేకపోయింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని సరిగ్గా నడిపించకపోతే ప్రజల్లో అప్రతిష్ఠపాలు కావల్సి ఉంటుంది.

**సంకీర్ణంలో మూడు భాగస్వామ్య పక్షాలున్నాయి. ఎవరి తోవ వారిది. ఉద్ధవ్ ఠాక్రే అన్నివర్గాలను సంతృప్తిపరుస్తూ పరిపాలన సాగించవలసి ఉన్నది. శివసేన ఏమాత్రం హిందుత్వ బాటలో పయనించిన మిగితా పక్షాలు దూరమవుతాయి. శివసేనకు వీధి పోరాటాలు జరుపడం అలవాటు. ఠాక్రే కుటుంబానికి చెందిన వారెవ్వరూ అధికారంలో లేకపోవడం వల్ల గతంలో ఈ విధానం చెల్లుబాటయింది. కానీ ఇప్పుడు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి గనుక ఒక పరిపాలకుడిగా ఎంతో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుంది. కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని అనుసరిస్తూనే ఠాక్రే తనదైన ముద్రను కనబరుచవలసి ఉంటుంది.**

సంకీర్ణంలో మూడు భాగస్వామ్య పక్షాలున్నాయి. ఎవరి తోవ వారిది. ఉద్ధవ్ ఠాక్రే అన్నివర్గాలను సంతృప్తిపరుస్తూ పరిపాలన సాగించవలసి ఉన్నది. శివసేన ఏమాత్రం హిందుత్వ బాటలో పయనించిన మిగితా పక్షాలు దూరమవుతాయి. శివసేనకు వీధి పోరాటాలు జరుపడం అలవాటు. ఠాక్రే కుటుంబానికి చెందిన వారెవ్వరూ అధికారంలో లేకపోవడం వల్ల గతంలో ఈ విధానం చెల్లుబాటయింది. కానీ ఇప్పుడు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి గనుక ఒక పరిపాలకుడిగా ఎంతో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుంది. కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని అనుసరిస్తూనే ఠాక్రే తనదైన ముద్రను కనబరుచవలసి ఉంటుంది.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం తనదేనని భావించిన బీజేపీ ఈ ప్రయత్నంలో భాగంగా తీవ్ర అవమానాల పాలయింది. మిగతా మూడు పార్టీలు ఏకతాటిపైకి వచ్చి తమను ప్రతిపక్షంలోకి నెట్టివేయడాన్ని బీజేపీ జీర్ణించుకోలేదు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నదనే విషయాన్ని మరిచిపోకూడదు. శివసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని దెబ్బకొట్టడం కోసం బీజేపీ కాచుకొని ఉంటుంది. ఉద్ధవ్ ఠాక్రే కుటుంబం ప్రత్యక్ష రాజకీయాల్లో రాణించాలన్నా, శివసేనను కాపాడుకోవాలన్నా ఈ ఐదేండ్లు ప్రభుత్వాన్ని కాపాడుకొని ఏ విధంగా పరిపాలిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

**('ది వైర్' విశ్లేషణ..)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# నాసా కాదు.. ఇస్రోనే!

- విక్రమ్ జాడను ఆర్బిటార్ ఎన్నడో గుర్తించింది
- ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడి

**చెన్నై:** చంద్రుడిపై దిగే క్రమంలో ఆచూకీ లేకుండా పోయిన చంద్రయాన్-2లోని 'విక్రమ్' ల్యాండర్ జాడను తాము గుర్తించినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చేసిన ప్రకటనను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ కే. శివన్ తోసిపుచ్చారు. విక్రమ్ జాడను తాము ఎన్నడో గుర్తించామన్నారు. 'విక్రమ్ జాడను మా ఆర్బిటార్ ఇదివరకే గుర్తించింది. ఈ విషయం మా వెబ్‌సైట్‌లోనూ పొందుపరిచాం. కావాలంటే మీరు చూసుకోవచ్చు' అని ఆయన స్పష్టంచేశారు. జాబిల్లిపై 'విక్రమ్' ఢీకొన్న ప్రాంతాన్ని, దాని శకలాలు విస్తరించిన ప్రదేశాన్ని గుర్తిస్తూ నాసా మంగళవారం పలు ఫొటోలను విడుదలచేస్తూ.. విక్రమ్ జాడను గుర్తించడంలో చెన్నై ఇంజనీర్ సుబ్రమణియన్ కీలకపాత్ర పోషించారని ప్రకటించిన విషయం తెలిసిందే. నాసా చిత్రాలను అణువణువు జల్లెడ పట్టిన సుబ్రమణియన్.. విక్రమ్ తొలి శకలాన్ని గుర్తించారని, ఆయనిచ్చిన ఆధారాలతో తమ బృందం ఇతర శకలాలను గుర్తించినట్లు తెలిపింది. విక్రమ్ క్రాష్‌ల్యాండింగ్ అయిన మూడు రోజుల తర్వాత ఇస్రో ట్వీట్ చేస్తూ.. 'విక్రమ్ ల్యాండర్ ప్రదేశాన్ని చంద్రయాన్-2 ఆర్బిటార్ గుర్తించింది. దానితో సంబంధాల పునరుద్ధరణకు అన్ని ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన చంద్రయాన్-2ను జూలై 22న జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా ప్రయోగించిన విషయం తెలిసిందే.



భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా బుధవారం దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ముంబైలో నౌకాదళ సిబ్బంది తుపాకులతో నిర్వహించిన విన్యాసం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'నేవీ డే' సందర్భంగా నౌకాదళ సిబ్బందికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వారి త్యాగాల వల్లే దేశ సముద్ర సరిహద్దులు భద్రంగా ఉన్నాయని కొనియాడారు.






# ముస్లిమేతర శరణార్థులకు
# దేశ పౌరసత్వం!

పౌరసత్వ సవరణ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం.. రెండ్రోజుల్లో పార్లమెంట్‌కు
బిల్లు రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు ధ్వజం
చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పదేండ్లు పొడిగింపు
వ్యక్తిగత సమాచార భద్రత బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.15 కోట్ల వరకు జరిమానా, మూడేండ్ల జైలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:**

వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. వచ్చే రెండు రోజుల్లో దీన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. అలాగే చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను పదేండ్లకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు, సామాజిక భద్రతా స్మృతి బిల్లులకు ఆమోదం తెలిపింది. మతపరమైన హింస కారణంగా పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ఆరు సామాజిక వర్గాలకు (హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బుద్ధులు, పార్శీలు) చెందిన వారికి భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ బిల్లు. అయితే ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ) ఏరియాలను, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో పొందుపరిచిన ప్రాంతాలను బిల్లు పరిధి నుంచి కేంద్రం తప్పించినట్లు అధికారులు తెలిపారు. బెంగాల్ ఈస్టర్న్ ఫ్రాంటియర్ రెగ్యులేషన్స్-1873 లోని సెక్షన్ 2 ప్రకారం.. అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఐఎల్‌పీ వ్యవస్థ ఉన్నది. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ పర్యటించాలంటే ముందస్తు అనుమతితప్ప నిసరి.



ఎంపీ శశిథరూర్

### తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం తదితర విపక్షాలు పౌరసత్వ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పౌరసత్వానికి మతం ప్రాతిపదిక కాకూడదన్న దేశ మౌలిక భావనను ఈ బిల్లు ఉల్లంఘిస్తున్నదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మండిపడ్డారు. ఈ బిల్లు విచ్ఛిన్నకరమని, రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ సీనియర్ నేత, అసోం మాజీ సీఎం తరుణ్ గొగోయ్ మండిపడ్డారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. మరోవైపు, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. కేంద్రం నిర్ణయం మహమ్మద్ అలీ జిన్నా ద్వి-జాతి సిద్ధాంతానికి మళ్లీ జీవం పోయడమే అని విమర్శించారు. 'పౌరసత్వ బిల్లును తీసుకురావడం మన స్వాతంత్ర్య సమరయోధులను అగౌరవపరచడమే. ఎందుకంటే మీరు ద్వి-జాతి సిద్ధాంతానికి పునరుజ్జీవనం పోస్తున్నారు. భారతీయ ముస్లింగా, జిన్నా సిద్ధాంతాన్ని నేను వ్యతిరేకించా. కానీ ప్రస్తుతం మీరు దేశానికి మళ్లీ ద్వి-జాతి సిద్ధాంతాన్ని గుర్తుకు తెస్తున్నారు' అని విమర్శించారు.



పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసోంలోని గువాహటిలో దిష్టిబొమ్మను తగులబెడుతున్న ఆల్ అసోం స్టూడెంట్ యూనియన్ సభ్యులు

### అందరి ప్రయోజనాలు పరిరక్షిస్తాం

విపక్షాల ఆందోళనలను కేంద్ర తోసిపుచ్చింది. ప్రతి ఒక్కరి ప్రయోజనాలను, జాతి ప్రయోజనాలను పరిరక్షిస్తామని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల్లో పౌరసత్వ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండడంపై విలేకరులు ప్రశ్నించగా.. ఇది దేశ ప్రయోజనాలకు ఉద్దేశించిన బిల్లు అని, ప్రజలు దీన్ని స్వాగతిస్తారని బదులిచ్చారు. మరోవైపు, బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. అక్రమ వలసదారుల ఓటుబ్యాంకు కోసం విపక్షాలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి, తమ ప్రభుత్వ ఇండియా ఫస్ట్ నినాదానికి అనుగుణంగా ఈ బిల్లును తెచ్చినట్లు చెప్పారు. గతేడాది కేంద్రం పౌరసత్వ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. లోక్‌సభలో ఆమోదం పొందినా రాజ్యసభలో గట్టెక్కలేకపోయింది.

### సీనియర్ సిటిజన్ల సంక్షేమ బిల్లుకు ఆమోదం

సీనియర్ సిటిజన్లకు కనీస అవసరాలు, రక్షణ, భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన మెయింటెనెన్స్, వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ (అమెండ్‌మెంట్) బిల్లు-2019కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం.. సీనియర్ సిటిజన్ల సంరక్షణ గృహాలు, హోం కేర్ సర్వీసెస్ ఏజెన్సీలు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు కనీస ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. మరోవైపు, కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాల బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

### వ్యక్తిగత సమాచార భద్రత బిల్లుకు ఓకే

వ్యక్తిగత సమాచార భద్రత బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.15 కోట్ల వరకు జరిమానా, మూడేండ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. అలాగే ఇంటర్నెట్ సంస్థలు తమ వినియోగదారులకు చెందిన కీలక సమాచారాన్ని దేశంలోనే భద్రపరిచేలా ప్రతిపాదనలు ఉన్నాయి. సున్నితమైన సమాచారాన్ని విదేశాలకు పంపించాలంటే ముందుగా ఆ డేటా యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధన విధించినట్లు సమాచారం. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని 2017లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది.

### సామాజిక భద్రత కోడ్ బిల్లుకు ఆమోదం

సామాజిక భద్రతా కోడ్ బిల్లు-2019కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇది నాలుగో లేబర్ కోడ్. కార్మికుల సామాజిక భద్రతకు సంబంధించిన చట్టాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ, ఎనిమిది కేంద్ర చట్టాలను విలీనం చేస్తూ ఈ బిల్లును తీసుకొచ్చారు. గత నెలలో ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ బిల్లుకు (మూడోది) క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వేతన కోడ్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం పొందింది. ఆక్యుపేషనల్ సేఫ్టీ,హెల్త్, వర్కింగ్ కండీషన్స్ కోడ్ బిల్లు (రెండోది)ను లోక్‌సభలో ప్రవేశపెట్టగా, దానిని స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపారు.

### 2030 వరకు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పొడిగింపు

లోక్‌సభతోపాటు ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను మరో పదేండ్లు పొడిగించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అయితే ఆంగ్లో ఇండియన్ల కోటాను మాత్రం నిలిపివేయనున్నట్లు తెలిసింది. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఈ క్యాటగిరీల రిజర్వేషన్ల గడువు వచ్చే ఏడాది జనవరి 25తో ముగియనుంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లను 2030 జనవరి 25వరకు పొడిగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

# ఏమిటీ పౌరసత్వ బిల్లు?

1. మతపరమైన హింస వల్ల పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వలస వచ్చిన ముస్లిమేతరులకు (ఆరు వర్గాలు- హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులు) భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ బిల్లు. ఇందుకు 2014 డిసెంబర్ 31వతేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ఇందుకనుగుణంగా, పౌరసత్వ చట్టం-1955కి సవరణలు చేయనున్నారు.
2. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం మాట్లాడుతూ.. ఈ బిల్లుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదన్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుకు ఎంత ప్రాధాన్యం ఉందో దీనికి అంతే ప్రాధాన్యం ఉందని, ఎంపీలందరూ తప్పక పార్లమెంట్‌కు హాజరుకావాలన్నారు. నిరంతర మత హింసకు గురై పొరుగుదేశాల నుంచి భారత్‌కు శరణు వచ్చిన వారికి 'సర్వ ధర్మ సంభవ్' స్ఫూర్తితో అక్కున చేర్చుకునేందుకు మోదీ సర్కార్ నిర్ణయించిందని చెప్పారు.
3. ముస్లింలను పౌరసత్వం నుంచి మినహాయించడంపై విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. మత విశ్వాసాలతో పౌరులను విభజించవద్దన్న రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి ఇది విరుద్ధమని మండిపడుతున్నాయి.
4. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, వామపక్షాలు, బీజేడీ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. బీజేపీ మిత్రపక్షం అసోం గణపరిషత్ (ఏజీపీ) సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నది. అకాలీదళ్, జేడీయూ నుంచి బీజేపీకి మద్దతు లభించవచ్చు. అన్నాడీఎంకే ఆచి తూచి వ్యవహరిస్తున్నది.
5. లోక్‌సభలో బీజేపీకి ఆధిక్యం ఉన్నందున బిల్లుకు సులభంగా ఆమోదం లభించవచ్చు. తగిన సంఖ్యాబలం లేని రాజ్యసభలో జేడీయూ, అకాలీదళ్ వంటి పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది. బీజేపీ మిత్రపక్షాలు సైతం బిల్లు పట్ల సుముఖంగా లేవని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.
6. పౌరసత్వ బిల్లుకు ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎక్కువగా ప్రతిఘటన ఎదురవుతున్నది. ఇక్కడ అధికంగా నివసిస్తున్న విదేశీయులకు పౌరసత్వం కల్పిస్తే అది తమ ప్రయోజనాలను దెబ్బతీస్తుందని స్థానిక తెగల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై కేంద్రం దృష్టిసారించినట్లు సమాచారం. పౌరసత్వం అనేది నివాస హోదా కాదని నిబంధనల్లో చేర్చనున్నట్లు తెలిసింది.
7. గతేడాది జనవరిలో పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపడాన్ని నిరసిస్తూ బీజేపీ మిత్రపక్షం ఏజీపీ.. ఎన్డీయే నుంచి బయటకొచ్చింది. ఆ బిల్లు మురిగిపోవడంతో తిరిగి ఎన్డీయే గూటికి చేరింది. ప్రతిపాదిత బిల్లుపై యూటర్న్ తీసుకున్నట్లు ఏజీపీ సంకేతాలు ఇచ్చింది. 'వాస్తవ దృక్పథంతో మనం ముందుకు సాగాలి. లక్షల మంది అక్రమ వలసదారులను మనం గుర్తించలేం. వారిని బంగ్లాదేశ్ వెనక్కి తీసుకోదు. గతంలో రెండుసార్లు మా ప్రభుత్వం ఏర్పడినా అక్రమ వలసదారులను గుర్తించలేకపోయాం. దురదృష్టవశాత్తు, అసోం ఒప్పందం 34 ఏండ్లుగా దుమ్ముపట్టిపోయింది' అని ఏజీపీ సభ్యుడు అతుల్ బోరా అన్నారు.

## నిర్మల నా సోదరితో సమానం

'నిర్బల' వ్యాఖ్యపై అధిర్ క్షమాపణ



**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను 'నిర్బల' అని విమర్శించినందుకు లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి బుధవారం క్షమాపణ చెప్పారు. నిర్మలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాల్సిందేనని అధికార బీజేపీ సభ్యులు పట్టుబట్టడంతో ఆయన స్పందించారు. 'సభలో చర్చ సందర్భంగా మన ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను ఉద్దేశించి ఆమె 'నిర్బల' అని సంబోధించాను. నిర్మలా జీ నాకు సోదరి వంటి వారు. నేను ఆమెకు సోదరుడి వంటి వాడిని. ఒకవేళ నా వ్యాఖ్యలు ఆమె మనస్సును గాయపరిస్తే క్షమాపణ చెబుతున్నాను' అని పేర్కొన్నారు.




## 'నిర్భయ' దోషులను ఉరితీస్తా!

- రాష్ట్రపతికి లేఖ రాసిన వ్యక్తి

**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో దోషులను ఉరితీయడానికి తనను తాత్కాలిక తలారీగా నియమించాలని కోరుతూ హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాకు చెందిన రవికుమార్ అనే వ్యక్తి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. దోషులను ఉరితీయడానికి తీహార్ జైలు అధికారులు సన్నద్ధమవుతున్నారని, తలారీ లేడనే విషయాన్ని రవికుమార్ మీడియా ద్వారా తెలుసుకున్నారు. తనను తాత్కాలిక తలారీగా నియమించాలని రాష్ట్రపతిని కోరారు. దోషులను ఉరితీయడం వల్ల నిర్భయ ఆత్మకు శాంతి కలుగుతుందని పేర్కొన్నారు. భారత్‌లో అరుదుగా ఉరితీస్తుండటంతో తలారీలనుని యమించడంలే దు.

# 2000 నోటును నిలిపివేయం!

స్పష్టంచేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** చెలామణిలో ఉన్న రూ.2000 నోటును దశల వారీగా నిలిపివేయబోమని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రస్తుతం చెలామణిలో ఉన్న నగదులో రూ. 2000 విలువైన నోట్లు 31.18 శాతం ఉంటాయన్నారు. బుధవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో 'దశలవారీగా రూ.2000 నోటును నిలిపేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదా?' అన్న ఓ ఎంపీ ప్రశ్నకు అనురాగ్ ఠాకూర్ పై విధంగా సమాధానం చ్చారు. ఆర్బీఐ వార్షిక నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి మొత్తం రూ.21,10,900 కోట్ల విలువ గల వివిధ నోట్లలో రూ.6,58,200 కోట్ల విలువైన రూ.2000 నోట్లు (31.18 శాతం) చలామణిలో ఉన్నాయన్నారు.

**ఐపీసీ, సీఆర్పీసీ నిబంధనల సవరణలపై కమిటీ**

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ)లలో తప్పనిసరి సవరణలు తీసుకువచ్చేందుకు సూచనలు కోరుతూ కమిటీని ఏర్పాటు చేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బుధవారం రాజ్యసభ క్వశ్చన్ అవర్‌లో మూకదాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలన్న విషయమై పలువురు సభ్యులు వేసిన ప్రశ్నలకు అమిత్‌షా సమాధానం ఇచ్చారు. ఐపీసీ, సీఆర్పీసీల్లో తప్పనిసరిగా తేవాల్సిన సవరణలపై తమకు సిఫారసులు పంపాలని అన్ని రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లకు లేఖలు రాసినట్లు చెప్పారు. కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసులు అందిన తర్వాత ఐపీసీ, సీఆర్పీసీలలో సవరణలపై తగు చర్యలు తీసుకుంటామని అమిత్‌షా అన్నారు. ఐపీసీ, సీఆర్పీసీలలో మార్పులు తేవాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని కమిటీని ఏర్పాటు చేశామన్నారు.



**పోర్నోగ్రఫీ నియంత్రణపై ఫోకస్**

ఇంటర్నెట్‌లో బాలలకు అశ్లీల సాహిత్యం, వీడియోలు (పోర్నోగ్రఫీ) అందుబాటులోకి రాకుండా నియంత్రించే విషయమై రాజ్యసభ సభ్యుల బృందం దృష్టి సారించనున్నది. ఈ బృందం వివిధ దర్యాప్తు సంస్థలు, భారతీయ టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్), సామాజిక మాధ్యమ వేదికలైన వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించాలని నిర్ణయించింది. పది రాజకీయ పార్టీలకు చెందిన 14 మంది రాజ్యసభ సభ్యులతో చైర్మన్ వెంకయ్యానాయుడు ఈ గ్రూప్‌ను ఏర్పాటుచేశారు. రెండు రోజుల కిందట తొలిసారి ఈ గ్రూప్ సభ్యులు సమావేశమై ఈ అంశంపై ప్రాథమికంగా చర్చించారు. పౌర సమాజ సంస్థలు, నిపుణులు, తల్లిదండ్రులు, దర్యాప్తు సంస్థలు, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించాలని నిర్ణయించినట్లు సమాచారం.

## ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు

- కేంద్ర మంత్రి నిర్మల వెల్లడి
- టర్కీ నుంచి మరో నాలుగువేల టన్నుల దిగుమతికి ఆదేశం



**న్యూఢిల్లీ:** 'ఉల్లి' ధరల నియంత్రణకు అవసరమైన చర్యలన్నీ తీసుకున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో 'తొలి విడుత అనుబంధ డిమాండ్లు- పద్దులు'పై జరిగిన చర్చకు ఆమె సమాధానమిచ్చారు. ఉల్లి నిల్వలకు సంబంధించి పలు సంస్థాగత సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఎగుమతులపై నిషేధం, నిల్వలపై పరిమితులు, దిగుమతి చేసుకున్న ఉల్లిని కొరత ఉన్న ప్రాంతాలకు రవాణా చేయడం వంటి చర్యలను చేపట్టామని నిర్మలా సీతారామన్ తెలిపారు. కొరత కారణంగా దేశంలోని కొన్ని చోట్ల కిలో ఉల్లిగడ్డ రూ.100 దాటిపోయింది. మరోవైపు దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరింత ఉల్లి అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎంటీసీ.. టర్కీ నుంచి మరో నాలుగు వేల టన్నుల ఉల్లి దిగుమతికి ఆదేశాలు జారీచేసిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే నెల వినియోగదారులకు ఇది అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇప్పటికే టర్కీ నుంచి 11 వేల టన్నులు, ఈజిప్ట్ నుంచి 6,090 టన్నుల ఉల్లిని దిగుమతి చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఇదిలా ఉంటే రోజువారీగా పెరుగుతున్న ధరలను అరికట్టేందుకు అఫ్ఘనిస్థాన్ నుంచి అట్టారీ- వాఘా సరిహద్దు మీదుగా పంజాబ్, ఢిల్లీల వ్యాపారులు ప్రతిరోజూ ఉల్లిగడ్డలు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రతి రోజూ 10 నుంచి 15 ట్రక్కుల్లో ఉల్లిగడ్డ దిగుమతి అవుతున్నది. ఒక్కో ట్రక్కులో 35 మెట్రిక్ టన్నుల ఉల్లి గడ్డ ఉంటుంది.



## మంచుచరియలు విరిగిపడి నలుగురు జవాన్ల దుర్మరణం

**శ్రీనగర్:** ఉత్తర కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో రెండుచోట్ల మంచుచరియలు విరిగిపడి నలుగురు జవాన్లు దుర్మరణం చెందారు. అధికారుల సమాచారం మేరకు.. కుప్వారా జిల్లాలోని తాంగ్‌ధర్ ప్రాంత ఆర్మీ పోస్ట్‌పై మంగళవారం మధ్యాహ్నం మంచు చరియలు విరిగిపడగా నలుగురు జవాన్లు చిక్కుకుపోయారు. వారిలో ఒక జవాన్‌ను ప్రాణాలతో కాపాడగా, మిగతా ముగ్గురి మృతదేహాలను బుధవారం వెలికితీశారు. మరో ఘటన బందీపోరా జిల్లాలో జరిగింది. గురెజ్ సెక్టార్‌లోని దావర్ ప్రాంతంలో పహారా కాస్తున్న ఇద్దరు జవాన్లపై మంచుచరియలు విరిగిపడ్డాయి. వెంటనే గాలింపు చర్యలు చేపట్టి ఒక జవాన్ ప్రాణాలు కాపాడామని, మరొకరి మృతదేహాన్ని వెలికితీశామని అధికారులు తెలిపారు.

## యూపీలో సామూహిక లైంగికదాడులు

ఫిరోజాబాద్‌లో యువతిపై..
మీర్జాపూర్‌లో బాలికపై అఘాయిత్యం

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై లైంగికదాడులు కొనసాగుతున్నాయి.తాజాగా మీర్జాపూర్, ఫిరోజాబాద్‌లో ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. మీర్జాపూర్‌కు చెందిన మాజీ జైలర్ కొడుకు జై ప్రకాశ్ మౌర్య.. సోమవారం హలియాలోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. అప్పటికే పరిచయం ఉన్న పదో తరగతి చదువుతున్న బాలికకు ఫోన్ చేసి.. గ్రామ శివారుకు రావాలని చెప్పాడు. బాలిక అక్కడికి వెళ్లగానే జై ప్రకాశ్‌తోపాటు అతడి ముగ్గురు స్నేహితులు ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించుకున్నారు. నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేశారు. అనంతరం దుండగులు బాలికతోపాటు హలియాకు తిరిగి వస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఓ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. నిందితుల కారుపై పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన లోగో అతికించి ఉన్నది.

**మాయమాటలు చెప్పి..**

ఫిరోజాబాద్‌లో నలుగురు వ్యక్తులు ఓ యువతికి మాయమాటలు చెప్పి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఓ యువతి కోచింగ్ సెంటర్‌కు వెళ్తుండగా నలుగురు వ్యక్తులు కారులో ఆమె వద్దకు వచ్చారు. 'మీ సోదరుడికి యాక్సిడెంట్ అయ్యింది. మాతో వస్తే తీసుకెళ్తాం' అని మాయమాటలు చెప్పారు. వారిలో ముగ్గురు తెలిసినవారే కావడంతో ఆమె వారిని నమ్మింది. వారు ఆమెను నిర్మానుష ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. తర్వాత గాలిబ్ గ్రామ సమీపంలో కారులోనుంచి తోసేసి పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

## 'ఫోన్ చేస్తే ఇంటి వద్ద దింపుతాం'

మహిళల భద్రత కోసం పంజాబ్ సర్కార్ కొత్త విధానం

**చండీగఢ్:** మహిళల భద్రత కోసం పంజాబ్ ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య మహిళలెవరైనా ఇంటికి దూరంగా ఉన్నానని, ఇంటికి వెళ్లడానికి సాయం చేయాలని ఫోన్ చేస్తే పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుంటారు. ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చుతారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లే పోలీసుల్లో ఒక మహిళా పోలీసు కూడా ఉంటారు. ఆపదలో లేదా అభద్రత భావంతో ఉన్న మహిళలు 100, 112, 181 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందాలని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.

# 'నిత్య' కైలాసం

హల్‌చల్ చేస్తున్న నిత్యానంద రాజ్యం 'కైలాస'
సొంతంగా ప్రభుత్వం, పాస్‌పోర్ట్, వీసా.. విరాళం ఇస్తే పౌరసత్వం
గుర్తింపు కోసం ఐరాసకు దరఖాస్తు చేస్తానని వెబ్‌సైట్‌లో వెల్లడి
అది అంత సులభం కాదంటున్న విదేశాంగశాఖ అధికారులు

**బెంగళూరు:** ఆధ్యాత్మికత పేరుతో దేశ, విదేశాల్లో సామ్రాజ్యాన్ని నిర్మించుకొని.. భక్తి మాటున అకృత్యాలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన నిత్యానంద ఇప్పుడు మళ్లీ హాట్ టాపిక్‌గా మారాడు. భారత్‌లో అడుగుపెడితే కటకటాల్లోకి వెళ్లక తప్పదని తెలిసి.. ఈక్వెడార్ సమీపంలో సొంతంగా ఓ ద్వీపాన్ని కొనుక్కున్నాడు. సెంట్రల్ అమెరికాలోని ఈక్వెడార్‌కు సమీపంలో ఉన్న ద్వీపానికి అతడు 'కైలాస' అని పేరు పెట్టాడు. కైలాస పేరిట ఉన్న వెబ్‌సైట్‌లో అనేక వివరాలు వెల్లడించాడు. ప్రపంచంలో హిందువులకు ప్రత్యేకంగా దేశం లేదని, అందుకే తనది ప్రత్యేకంగా హిందూ దేశమని నిత్యానంద ప్రకటించుకున్నాడు. విరాళం ఇచ్చే హిందువులకు తన దేశంలో పౌరసత్వం ఇస్తానని చెప్తున్నాడు. అంతేకాదు.. హింసకు గురవుతున్న హిందువులను 'కైలాస'కు రావాల్సిందిగా పిలుపునిస్తున్నాడు. అక్కడికి వెళ్లి చేయాల్సిందల్లా నిత్యం స్వామిని సేవించడమే. అయితే ఒక దేశాన్ని సృష్టించడం అంత సులభం కాదని, ఇది ఉట్టి హడావుడి మాత్రమేనని విదేశాంగశాఖ అధికారులు అంటున్నారు.

**అధికారిక మతం:** సనాతన హిందూ ధర్మం
**జాతీయ జంతువు:** నంది
**జాతీయ పక్షి:** శరభం
**జాతీయ పుష్పం:** కమలం
**జాతీయ వృక్షం:** మర్రిచెట్టు

**జెండా.. ఎజెండా**

కైలాసకు సొంతంగా దాదాపు 550 పేజీల రాజ్యాంగం ఉన్నది. ఇక్కడికి వచ్చే ప్రజలు ఎలా ఉండాలో ఇందులో పేర్కొన్నారు. ఆలయ ఆధారిత పర్యావరణ వ్యవస్థ, మూడో కన్ను వెనుక సైన్స్, యోగా, ధ్యానం, గురుకుల విద్య తదితర అంశాలను ప్రస్తావించారు. కైలాసకు సొంతంగా 'వృషభ ధ్వజ' అని పేరుతో జెండా కూడా ఉన్నది.సింధూరం రంగులో ఉండే ఈ జెండాపై 'విశ్వరూప' నిత్యానంద బొమ్మ, నంది బొమ్మను ఉంచారు. ఇక్కడ ఇంగ్లిష్, సంస్కృతం, తమిళం అధికారిక భాషలు. కైలాసలోని ప్రజలందరికీ ఉచితంగా విద్య వైద్యం, ఆలయాల్లో నిత్యాన్నదానం.. ఇలా నిత్యానంద అనేక ఆఫర్లు ప్రకటించాడు.

**సొంతగా ప్రభుత్వం**

కైలాసలో నిత్యానంద సొంతగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తున్నాడు. తనను తాను సర్వాధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. తన సన్నిహితుడైన 'మా' అనే వ్యక్తిని ప్రధానిగా నియమించాడు. మరికొందరితో మంత్రి మండలి ఏర్పాటుచేశారు. తాను రోజూ క్యాబినెట్ సమావేశం జరుపుతున్నానంటూ నిత్యానంద ప్రకటించడం విశేషం. అంతేకాదు.. పది ప్రభుత్వ విభాగాలనూ ప్రకటించారు. వీటన్నింటికీ 'పరమపూజ్య శ్రీ నిత్యానంద పరమశివమ్' (హెచ్‌డీహెచ్) అనే విభాగం నేతృత్వం వహిస్తుంది. దీంతోపాటు హోం, రక్షణ, ఆర్థిక, వాణిజ్య, గృహనిర్మాణ, మానవసేవ, విద్య, వైద్యారోగ్య, నాగరికత, సాంకేతిక మంత్రిత్వ శాఖలు ఉన్నాయి.

**అంత సులభం కాదు**

కైలాసకు దేశం హోదా ఇవ్వాలని కోరుతూ త్వరలో ఐక్యరాజ్యసమితికి దరఖాస్తు చేయనున్నట్టు సమాచారం. విదేశాంగ శాఖ అధికారులు మాత్రం ఇది అంత తేలిక కాదని చెప్తున్నారు. ఒక దేశం నుంచి కొనుగోలు చేసిన చిన్న ద్వీపాన్ని, లేదా భూభాగాన్ని దేశంగా ప్రకటించడం సాధ్యం కాదన్నారు. ఐరాసలోని మిగతా దేశాలు కూడా ఇందుకు అంగీకరించాల్సి ఉంటుందన్నారు. కాబట్టి నిత్యానంద చేస్తున్న హడావుడిని పెద్దగా పట్టించుకోమని అధికారులు అంటున్నారు. కైలాస వెబ్‌సైట్‌ను 2018లో సృష్టించారని, కొన్ని నెలల కిందట అప్‌డేట్ చేసినట్టు చెప్తున్నారు. దీనిని అమెరికాలోని డల్లాస్, టెక్సాస్ నుంచి నిర్వహిస్తున్నట్టు గుర్తించారు.




**పైసలిస్తే పాస్‌పోర్ట్**

కైలాస ప్రజలకు బంగారు, ఎరుపు రంగుల్లో రెండు రకాల పాస్‌పోర్ట్‌లు ఉంటాయట. ఇచ్చే విరాళాల మొత్తాన్ని బట్టి రంగు, హంగు మారుతుందన్న మాట. ఆ విరాళాలను విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగిస్తానని చెప్తున్నాడు. తమకు 110 దేశాలతో సత్సంబంధాలు ఉన్నాయని అంటున్నాడు.

**'నిత్య' పూజలు**

వెబ్‌సైట్‌లో నిత్యానందను 'పరమ పూజ్య భగవంతుడు శ్రీ నిత్యానంద పరమశివమ్' అని సంబోధించారు. అంటే ఆ ద్వీప ప్రజలకు ఆయనే ప్రత్యక్ష దైవమన్నమాట. ఆయన్ను నిత్యం పూజించాల్సి ఉంటుంది. ఇక్కడ హిందూ సంప్రదాయం ప్రకారం మాత్రమే జీవించాల్సి ఉంటుందట.

## జిల్లా కోర్టుల్లో ఐసీజేఎస్, ఎన్ఎస్‌టీఈపీ

- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్


జిల్లా కోర్టుల్లో ఐసీజేఎస్, ఎన్ఎస్‌టీఈపీలను ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్ని జిల్లా కోర్టుల్లో ఇంటర్‌ఆపెరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్), నేషనల్ సర్వీస్ అండ్ ట్రాకింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ప్రాసెసెస్ (ఎన్ఎస్‌టీఈపీ) ప్రాజెక్టును హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ బుధవారం హైకోర్టులో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా సంబంధిత విభాగాల మధ్య డాటా మార్పిడి సులభతరం కానున్నది. ఒకేరకమైన డాటాను పలు మార్లు వివిధ విభాగాల్లో నమోదుచేయాల్సిన అవసరం లేకుండా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ మహేందర్‌రెడ్డి, రిజిస్ట్రార్ జనరల్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పల్ స్టేడియంలో మొక్కలు నాటుతున్న అజారుద్దీన్, ఎమ్మెల్యే భేతి సుభాశ్‌రెడ్డి


మెట్‌పల్లిలో మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


హైదరాబాద్‌లో మొక్కనాటుతున్న వాటర్‌వర్క్స్ ఎండీ దాన కిశోర్

## ముమ్మరంగా గ్రీన్‌చాలెంజ్

- మొక్కలు నాటిన ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, సుభాశ్‌రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు అజారుద్దీన్

**ఉప్పల్, నమస్తే తెలంగాణ/ మెట్‌పల్లి టౌన్:** రాజ్యసభ సభ్యు డు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌కు అపూర్వస్పందన లభిస్తున్నది. ప్రముఖులు ముమ్మ రంగా మొక్క లు నాటుతూ ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మెట్‌పల్లిలోని వెల్లుల్ల రోడ్డులో మొక్కలు నాటారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అజారుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే భేతి సుభాశ్‌రెడ్డి మొక్కలు నాటారు. ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్ మంచి కార్యక్రమమని అజారుద్దీన్ అభినందించారు. అనంతరం ఐటీశాఖ మంత్రి కేటీఆర్, బీసీసీఐ ప్రెసిడెంట్ గంగూలీ, భారత జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్‌కు గ్రీన్‌చాలెంజ్ విసిరారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట కార్పొరేషన్ (టీయూఎఫ్ ఐడీసీ) చైర్మన్ విప్లవ్‌కుమార్, వాటర్ వర్క్స్ ఎండీ దాన కిశోర్ కూడా మొక్కలు నాటారు.


బుధవారం రాత్రి సూర్యాపేటలోని సఖి కేంద్రం వద్ద జస్టిస్ ఫర్ దిశకు కొవ్వొత్తుల నివాళి


నిజామాబాద్ నగరంలోని ధర్నా చౌక్‌లో ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న పలు సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు

# నలు 'దిశ'లా నిరసనలు

- దిశ నిందితులను శిక్షించాలంటూ కొవ్వొత్తుల ర్యాలీలు
- సోషల్‌మీడియాలో అసభ్య వ్యాఖ్యలు చేసిన ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్ సిటీబ్యూరో/చార్మినార్, నమస్తే తెలంగాణ:**

దిశ విషాదాంతానికి కారకులైన నిందితులకు కఠినంగా శిక్షించాలని, ఆడపిల్లలను రక్షించుకొని సృష్టిని కాపాడుకోవాలని నినదిస్తూ నిజామాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మెప్మా సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దిశ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. నిజామాబాద్‌లో బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, ఉమెన్స్ కళాశాల, వివిధ ప్రైవేట్ పాఠశాలలు, లేడీస్ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్, వాసవి క్లబ్, మార్వాడీ మంచ్, మార్వాడీ యువమంచ్, వివిధ కళాశాలల విద్యార్థులు, ఐఎంఏ సభ్యులు, గృహిణులు ర్యాలీలునిర్వహించి నివాళులర్పించారు.


అనిల్‌కుమార్, సాయినాథ్

### ఇద్దరు యువకుల అరెస్ట్

దిశ ఘటనపై సోషల్‌మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్‌చేశారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంకు చెందిన ఓ వైద్యురాలి ఫేస్‌బుక్ ఖాతాలో ఒక పేరొందిన మహిళ పోస్ట్‌పై అనిల్‌కుమార్ అంబాల అనే యువకుడు అసభ్యంగా కామెంట్‌ను పెట్టాడు. ఇది మహిళ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉండటంతో వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అనిల్‌కుమార్‌ను నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో అరెస్టుచేసి, నగరంలోని 9వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఇదే విషయంలో ఏపీలోని గుంటూరుకు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్‌చేశారు. ఫేస్‌బుక్‌లో సిమ్లీ నానీ పేరుతో ఖాతా నిర్వహిస్తున్న గుంటూరుకు చెందిన కనుగుళ్ల సాయినాథ్.. తరచూ మహిళల గూర్చి అసభ్యకర పోస్టింగ్‌లు పెడుతున్నాడు. ఇదేక్రమంలో దిశపై అఘాయిత్యం జరుగడంతో తప్పులేదన్నట్టు పోస్ట్ పెట్టాడు. ఈ పోస్టింగ్‌లకు ముగ్గురు నలుగురు అనుకూల కామెంట్లుచేయగా, మరికొందరు భగ్గుమన్నారు. ఈ పోస్టింగ్‌పై సైబర్‌క్రైం పోలీసులు సుమోటోగా కేసు నమోదుచేశారు.




### సోషల్‌మీడియాపై కన్ను

అరచేతిలో స్మార్ట్‌ఫోన్.. ఆపై అపరిమిత డాటా ఉన్నదని 'హద్దు' దాటితే చిక్కులు తప్పవు. సున్నితమైన అంశాలు, వ్యక్తిగతంగా ఇతరులను కించపర్చేలా, అగౌరవ పరిచేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసేవారిపై పోలీస్‌లు సీరియస్‌గా దృష్టిపెట్టారు. 'దిశ' హత్యోదంతంపై ఇటీవల నీచమైన వ్యాఖ్యలు చేసినవారు కటకటాల పాలవుతున్న విషయాన్ని పోలీసులు గుర్తుచేస్తున్నారు. అడ్డగోలు వ్యాఖ్యలతో చేటు కొనితెచ్చుకోవద్దని సూచిస్తున్నారు. సోషల్‌మీడియా వేదికగా తప్పుడు అభిప్రాయాలు వ్యక్తంచేస్తూ అనవసర గందరగోళం సృష్టించేవారిపై సైబర్ క్రైం పోలీసులు ఓ కన్నేసి ఉంచుతున్నారు.

### ఎమ్మెల్యే అనుచిత వాఖ్యలపై ఫిర్యాదు

దిశ ఘటనలో ఓ వర్గానికి చెందిన నిందితునిపై అనుచిత వాఖ్యలుచేస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదుచేశాయి. దీనిపై బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దిశ ఘటనలో పోలీసు కస్టడీలో ఉన్న ఓ వ్యక్తిపై ఎమ్మెల్యే రాజాసింగ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆ వర్గం మొత్తం నేర స్వభావం కలిగి ఉంటుందనేలా వ్యాఖ్యానించారంటూ పలువురు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

### కఠినంగా శిక్షించాలి

- చిలుకూరు అర్చకులు సౌందరరాజన్

**శంషాబాద్:** దిశ నిందితులకు వెంటనే కఠినశిక్షలు అమలుచేయాలని హైకోర్టు, సుప్రీంకోర్టును చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు సౌందరరాజన్ కోరారు. బుధవారం ఆయన శంషాబాద్‌లో దిశ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి దురాగతాలకు అంగచ్ఛేదన సరైన శిక్ష అన్నారు. ట్రయల్ కోర్టు విధించే శిక్షలను అత్యున్నత న్యాయస్థానాలు పరిగణలోకి తీసుకొని అమలుచేయాలని కోరారు.



### దక్షిణాఫ్రికాలో నివాళి

దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ ఆధ్వర్యంలో జస్టిస్ ఫర్ దిశ పేరిట బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విక్రమ్ పెట్లూరి, వెంకట్ మాగంటి, మనోజా రాజావరపు, బొడ్డుపల్లి, కీర్తికా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భద్రతా కమిషన్‌ను ఏర్పాటుచేయండి

- హోంశాఖ కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర భద్రతా కమిషన్, రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో పోలీసు ఫిర్యాదుల అథారిటీలను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. గతంలోనే వీటి ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చినా అమలుకాకపోవడంపై సూమోటోగా స్వీకరించిన హైకోర్టు.. పై రెండు సంస్థలను ఈ నెల 27లోగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆలోపు నియమించకపోతే ఈ నెల 30వ తేదీన హోంశాఖ ముఖ్యకార్యదర్శి వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరుకావాలని స్పష్టంచేసింది. హెచ్చార్సీ చైర్మన్, సభ్యులు, లోకాయుక్త, ఉపలోకాయుక్త నియామకాలు కూడా చేపట్టలేదని విచారణ సందర్భంగా పేర్కొన్నది.

## డాటా ఆఫ్ ఉన్నా ఎస్వోఎస్ నొక్కొచ్చు

- హాక్‌ఐ యాప్‌లో కొత్త ఫీచర్
- జతచేసిన తెలంగాణ పోలీసులు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏదైనా ఆపదలో ఉన్నారా? మీ మొబైల్‌లో ఇంటర్నెట్ డాటా ఆఫ్‌లో ఉన్నదా? అయినా ఫర్వాలేదు. మొబైల్ డాటా ఆఫ్‌లో ఉన్నా ఇకపై పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చేందుకు మీ మొబైల్‌లోని హాక్‌ఐ యాప్‌లో ఎస్వోఎస్ (సేవ్ అవర్ సోల్) బటన్ నొక్కొచ్చు. సమాచారం క్షణాల్లో పోలీసులకు వెళ్తుంది.. మిమ్మల్ని ఆపద నుంచి కాపాడుతారు. ఈ మేరకు హాక్ ఐ యాప్‌లో అదనపు ఫీచర్‌ను తెలంగాణ పోలీసులు జతచేశారు. మొబైల్ డాటా ఆఫ్ ఉన్నప్పుడు ఎస్వోఎస్ బటన్ నొక్కినా నేరుగా డయల్ 100కు ఫోన్ వెళ్లేలా యాప్‌లో మార్పులు చేసినట్టు డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి ట్విట్టర్‌లో వెల్లడించారు.

## డయల్ 100పై రవాణాశాఖ విస్తృత ప్రచారం

- ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దిశ వంటి ఘటనలు పునరావృతంకాకుండా నగర రవాణాశాఖ తన వంతు ప్రయత్నం చేస్తున్నది. నగరంలోని అన్ని రకాల వాహనాలపై డయల్ 100 పేరుతో రేడియం స్టిక్కర్లను అతికించే కార్యక్రమానికి హైదరాబాద్ జేటీసీ పాండురంగనాయక్ శ్రీకారం చుట్టారు. ఆటోలు, వ్యాన్లు, స్కూల్ బస్సులు, లారీలు, ట్రాలీలు ఇలా ఏ వాహనానికైనా డయల్ 100 స్టిక్కర్ల ను అధికారులు దగ్గరుండి అతికిస్తున్నారు. అధికారులే సొంత ఖర్చులతో వీటిని రూపొందించి అతికిస్తుండటం విశేషం. ఆపదలో ఉన్న వ్యక్తికి వెంటనే గుర్తుకువచ్చేలా ప్రతి వాహనంపై 100 నంబర్ కనబడాలనేది తమ ఉద్దేశమని జేటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఆర్టీవోలు రాంచందర్, దుర్గప్రసాద్, ఏఎంవీఐలు వాసు, శృతి తదితరులు పాల్గొన్నారు.

## దిశ కేసు సత్వర విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

మొదటిపేజీ తరువాయి...

చిన్నారి హత్య ఘటనపై కూడా ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసింది. సదరు కేసులో 56 రోజుల్లోనే దోషికి శిక్షపడింది. మరోవైపు, జస్టిస్ ఫర్ దిశ కేసులో నిందితులకు షాద్‌నగర్ కోర్టు ఏడు రోజుల కస్టడీ విధించింది. నిందితులను పదిరోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సైబరాబాద్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు.. ఈ మేరకు అనుమతి ఇచ్చింది. జైలులోనే విచారిస్తారా లేదా ఏదైనా రహస్య ప్రాంతానికి తీసుకువెళ్తారా? అనేది పోలీసుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని సమాచారం. కస్టడీ సందర్భంగా పోలీసులు క్రైం సీన్ రీకన్‌స్ట్రక్ట్ చేయడంతోపాటు నిందితులకు డీఎన్ఏ పరీక్షలు చేసే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. అఘాయిత్యానికి సంబంధించిన ఆధారాలు సేకరించనున్నారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యక్ష సాక్షుల ముందు ఐడీ పరేడ్ నిర్వహించే అవకాశం ఉన్నది. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా పోలీసులు క్రైమ్ సీన్ మ్యాపింగ్ చేస్తున్నారు. నిందితులు ఆరిఫ్ అలీ, చెన్నకేశవులు, శివ, నవీన్ ప్రస్తుతం చర్లపల్లి జైలులోని హై సెక్యూరిటీ బ్యారక్‌లలో ఉన్నారు.

### దిశ గుర్తింపు వెల్లడిపై కేంద్ర, రాష్ట్రాలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

దిశ గుర్తింపును వివిధ మీడియా, సామాజిక మాధ్యమాలు బహిరంగంగా వెల్లడించడంపై స్పందన తెలియజేయాలని కేంద్రం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ ప్రభుత్వాలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీచేసింది. లైంగికదాడి బాధితుల గుర్తింపును వెల్లడించడం చట్టప్రకారం నేరమని.. ఈ మేరకు మీడియా, సామాజిక మాధ్యమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీకి చెందిన న్యాయవాది యశ్‌దీప్‌చాహల్ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ డీఎన్ పటేల్, జస్టిస్ హరిశంకర్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రముఖ మీడియా సంస్థలకు, సామాజిక మాధ్యమ వేదికలకు నోటీసులు జారీచేసింది. ఈ కేసు విచారణను ఈ నెల 16కు వాయిదావేసింది.


బుధవారం టీజీవో భవన్‌లో సమావేశమైన సంఘం మహిళావిభాగం సభ్యులు

## దిశ ఘటనను ఖండించిన టీజీవో

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిశ ఘటనను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. బుధవారం టీజీవో భవన్‌లో సమావేశమైన సంఘం మహిళావిభాగం సభ్యులు.. దిశకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలుచేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సును పోలీస్‌శాఖ నిర్వహించాలని, మహిళా ఫీల్డ్ ఆఫీసర్లు సురక్షిత ప్రదేశాల్లో విధులు నిర్వర్తించేందుకు తగిన పరిస్థితులు కల్పించాలని, మహిళా అధికారులపై వేధింపులను అరికట్టేందుకు తక్షణమే ప్రతి కార్యాలయంలో మహిళా అధికారులతో కమిటీ ఏర్పాటుచేయాలని తీర్మానాలుచేశారు. రాష్ట్రంలో అటెండర్ స్థాయినుంచి అధికారిస్థాయి వరకు మహిళలకు ఎప్పుడైనా ఎలాంటి అవసరం వచ్చినా టీజీవో మద్దతు ఉంటుందని ప్రకటించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బోర్డులు, ఫ్లెక్సీలతో షీటీంలు, డయల్ 100, హాక్ ఐ వంటి వాటిని ప్రదర్శించాలని, దీంతో మహిళల్లో ధైర్యం నింపినట్టు అవుతుందన్నారు. సమావేశంలో టీజీవో అధ్యక్షురాలు వీ మమత, సుజాత, స్వర్ణలత, శారద, సునీతజోషి, స్వరూపారాణి, రాధ, రేవతి, కిరణ్మయి, సుజాత, రామలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## లైంగికదాడి, హత్య కేసుల్లో వెంటనే తీర్పురావాలి

- కఠిన చట్టాలు చేసినా నేరాలు తగ్గడంలేదు
- సమాజంలో మార్పుకోసం చర్చ జరుగాలి
- రిటైర్డ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్


మఖ్దూంభవన్‌లో మాట్లాడుతున్న రిటైర్డ్ జస్టిస్ జాస్తి చలమేశ్వర్. చిత్రంలో సీపీఐ నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చట్టాలను కఠినతరం చేసినా మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి కేసుల్లో సత్వర తీర్పులు రాకపోవడమే దీనికి కారణమన్నారు. నీలం రాజశేఖరరెడ్డి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు రక్షణ–సవాళ్లు (దిశా నిర్దేశం) అనే అంశంపై బుధవారం మఖ్దూంభవన్‌లో సదస్సు నిర్వహించారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జస్టిస్ చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాల్లోనే అనేక కేసుల్లో సత్వర తీర్పులు రావడం లేదని చెప్పారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సీ ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ.. నిందితులను చంపడం, ఉరి తీయడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. సమాజంలో మార్పులు రావాలని అభిప్రాయపడ్డారు. సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి జరుగకుండా ఏం చేయగలమో ఆలోచించాల్సిన అవసరం ఉన్నదన్నారు. దేశంలో నిమిషానికి 15 నుం చి 30 మందిపై లైంగికదాడి జరుగుతున్నదని రచయిత్రి ఓల్గా ఆందోళన వ్యక్తంచేశారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

## వైద్యవిభాగాల పనితీరుకు ప్రోత్సాహకాలు

- ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సర్కారు చర్యలు
- జిల్లాలకు పథకాలవారీగా మార్కుల కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సర్కారువైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరువచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలుజరిగేలా జిల్లాలవారీగా ఆయా వైద్య విభాగాల పనితీరుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నెలవారీగా మార్కులు నిర్ణయించి ఆయా జిల్లాలు సమర్థవంతంగా పనిచేసేలా వైద్యశాఖ దృష్టిసారించింది. టాప్ ర్యాంకుల్లో నిలిచిన జిల్లాలకు అవార్డులు ఇస్తూ.. వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువచేసేలా చర్యలు చేపడుతున్నది. అక్టోబర్‌లో ఆయా జిల్లాల పనితీరు, పురోగతిపై వైద్యశాఖ అధికారులు నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. హెల్త్ ప్రొఫైల్, కేసీఆర్ కిట్, జీవనశైలి వ్యాధులు, అంటువ్యాధులు, నిధుల ఖర్చులను ఆధారంగా చేసుకొని మార్కులను కేటాయించారు. 100 మార్కులకుగాను కరీంనగర్ జిల్లా 83.01 మార్కులతో మొదటిస్థానంలో నిలిచింది. 79.75 మార్కులతో జగిత్యాల రెండో స్థానం, 78.29 మార్కులతో హైదరాబాద్ మూడోస్థానంలో నిలువగా, 56.37 మార్కులతో భూపాలపల్లి జిల్లా రాష్ట్రంలోనే చివరిస్థానంలో ఉన్నది.

## ఎక్స్‌షోరూం ధర వివాదానికి తెర

- వాహన లైఫ్‌ట్యాక్స్ వసూలు బాధ్యత డీలర్లదే
- హైకోర్టు ఆదేశాలతో ఉత్తర్వులు జారీచేసిన రవాణాశాఖ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తలనొప్పిగా మారిన వాహన ఎక్స్‌షోరూం ధర వివాదానికి రవాణాశాఖ చెక్‌పెట్టింది. లైఫ్‌ట్యాక్స్ వసూళ్లలో ఏర్పడుతున్న వివాదాలు రవాణాశాఖ అధికారులకు ఇబ్బందిగా మారాయి. వాహన డీలర్లే బాధ్యత వహించాలంటూ ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో ఇకపై డీలర్లే వినియోగదారుల నుంచి వాహన లైఫ్‌ట్యాక్స్ వసూలుచేయాలని రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. లైఫ్‌ట్యాక్స్ విషయంలో తరచూ డీలర్లుచేస్తున్న మోసం వల్ల రవాణాశాఖ అధికారులు బద్నాం అవుతున్నారు. ఎక్స్‌షోరూం ధర, ఆఫర్ల పేరుతో వినియోగదారులకు వాహన విలువను తగ్గించినట్టు చెప్తూ తక్కువ డబ్బులు తీసుకొనేవారు. దీనివల్ల వాహనం అసలు ధరకు తేడా వస్తున్నది. అసలు ధర ప్రకారం పన్ను చెల్లించాలని అధికారులు వాహనదారులపై ఒత్తిడి తేవడంతోపాటు ప్రభుత్వానికి రావాల్సిన పన్ను చెల్లించకుంటే రిజిస్ట్రేషన్ వీలుకాదంటుండటంతో యజమానులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో ఈ వివాదంలో కొంతమంది రవాణాశాఖ అధికారులు ఇరుక్కొని ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని గతంలో ఇన్వాయిస్ ప్రకారం పన్ను వసూలుచేయాలని ఆదేశించినప్పటికీ కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. కొద్దిరోజుల క్రితం హైకోర్టు.. ఇన్వాయిస్ ఆధారంగా లైఫ్‌ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశాలు జారీచేసింది.

### ఓయూ లా కోర్సుల ఫలితాలు విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదలచేసినట్టు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, మూడేండ్ల ఎల్ఎల్బీ, మూడేండ్ల ఎల్ఎల్బీ హానర్స్, ఐదేండ్ల బీఏఎల్ఎల్బీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను www.osmania.ac.inలోఉంచినట్టు చెప్పారు.

### హైదరాబాద్‌లో 144 సెక్షన్!

- నేటి సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు..
- సీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** డిసెంబర్ 6న బాబ్రీ ఘటన నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రశాంతతకు భంగం కలుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం (ఈ నెల 5) సాయంత్రం 6 నుంచి శనివారం (ఈ నెల7) ఉదయం 6 గంటల వరకు నగరవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, సభలు, సమావేశాలు, వ్యక్తిగతంగా ప్రసంగాలు, చిహ్నాలు, ప్లకార్డులు, జెం డాల ప్రదర్శనలు చేయవద్దని పేర్కొన్నారు. అనుమతిచ్చిన వ్యక్తులు, గ్రూపులతోపాటు వ్యక్తుల అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఉంటుందన్నారు.

## ఎఫ్ఆర్‌బీఎంను 4 శాతానికి పెంచాలి

- లోక్‌సభలో ఎంపీ రంజిత్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఆర్థిక సంక్షోభం కారణంగా తెలంగాణ రాష్ట్రానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3.5% నుంచి 4 శాతానికి పెంచాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీలో పన్ను రేట్లను హేతుబద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం కార్పొరేట్ ట్యాక్స్‌తోపాటు జీఎస్టీ వస్తు సేవలరేట్లను కూడా తగ్గించడంవల్ల రాష్ట్రాల ఆదాయం తగ్గుతున్నదని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఆర్థిక వ్యవస్థ క్షీణించి వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధిని మెరుగుపర్చడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు తొమ్మిది లక్షలు కావాలని కోరగా, కేంద్రం 3.5 లక్షల కనెక్షన్లను మాత్రమే ఇచ్చిందన్నారు. మిగతా కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. నిత్యావసర సరుకులకు, విలాసవంతమైన కార్లకు ఒకేవిధంగా పన్ను విధించొద్దని సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను ప్రత్యేక నియామకపు ప్రక్రియలో భర్తీచేయాలని ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. బుధవారం లోక్‌సభ జీరోఅవర్‌లో ఆయన మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలోని ఉర్దూ వర్సిటీలో మొత్తం 47 ప్రొఫెసర్ల పోస్టులు కాగా, అందులో 23 ఖాళీగా ఉన్నాయని, 95 అసోసియేట్ ప్రొఫెసర్లు , 266 అసిస్టెంట్ ప్రొఫెసర్లలో దాదాపు 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

### దిశ ప్రతినిధులతో టీఆర్ఎస్ ఎంపీల భేటీ

పార్లమెంట్ నియోజకవర్గాల్లో కేంద్రప్రభుత్వ పథకాల అమలుపై బుధవారం ఢిల్లీలో జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ (దిశ) ప్రతినిధులతో టీఆర్ఎస్ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దిశ ప్రాజెక్టులోఉన్న 42 పథకాల్లో తెలంగాణలో 10 పథకాలను సమర్థవంతంగా అమలుచేయవచ్చన్నారు. తెలంగాణకు వివిధ పథకాల కింద రూ.4 లక్షల కోట్ల నిధులు రావాల్సి ఉన్నదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో గ్రామీణాభివృద్ధి పథకాలు అమలయ్యేలా చూస్తామని ఎంపీ వెంకటేశ్ నేతకాని తెలిపారు. సమావేశంలో టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, ఎంపీలు బీబీ పాటిల్, పీ రాములు, బండా ప్రకాశ్, బడుగుల లింగయ్యాయాదవ్, రంజిత్‌రెడ్డి, దిశ ప్రాజెక్టు తెలంగాణ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, గ్రామీణాభివృద్ధిశాఖ ఆర్థిక సలహాదారు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## సచివాలయ నెట్‌వర్క్ తరలింపు ప్రారంభం

- 14 నాటికి పూర్తికానున్న ప్రక్రియ
- సెక్యూరిటీ సిస్టమ్ ఏర్పాటు కోసం ఆలస్యమైన ప్రక్రియ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయ నెట్‌వర్క్‌ను బీఆర్కేభవన్‌కు తరలించే ప్రక్రియను ఐటీ అధికారులు ప్రారంభించారు. స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్(స్వాన్), సెక్రటేరియట్ క్యాంపస్ నెట్‌వర్క్(స్కాన్), వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడానికి వీలుగా కమాండ్ కంట్రోల్ సెంటర్లు ప్రస్తుతం పాత సచివాలయంలోనే ఉన్నాయి. వీటిని ఈ నెల 14వ తేదీనాటికి బీఆర్కేభవన్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతానికి బీఆర్కే భవన్‌లో బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ ద్వారా మంత్రులు, సీఎస్, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శుల ఇంటర్నెట్‌సేవలకు అంతరాయం లేకుండాచూస్తున్నారు. సచివాలయం ఇంటర్నెట్ సేవలకు హ్యాకింగ్, సైబర్‌దాడుల నుంచి పూర్తిగా భద్రత కల్పించడానికి ఐటీ అధికారులు దాదాపు రూ.70 లక్షలతో అత్యాధునిక సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటుచేశారు. దీంతో తరలింపు ప్రక్రియను వేగవంతంచేశారు. వాస్తవానికి సర్వర్లను బీఆర్కేభవన్‌కు తరలించినా ముఖ్యమైన కంట్రోల్ యూనిట్లు పాత సచివాలయంలోని డీబ్లాక్‌లోనే ఉన్నాయి. అక్కడినుంచి నెట్‌వర్క్ కంట్రోల్ యూనిట్ల తరలింపు ప్రక్రియ పూర్తయితే అధికారులు, ఉద్యోగులందరికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుంది. అత్యంత భద్రతతో ఏర్పాటుచేస్తున్న వ్యవస్థలో వీడియో కాన్ఫరెన్స్ కమాండ్ కంట్రోల్‌ను కనీసం ఇద్దరు నిపుణులు ఎల్లప్పుడూ మానిటరింగ్‌చేయాల్సి ఉంటుందని, ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నట్టు ఐటీ అధికారి ఒకరు తెలిపారు. ఐటీ నెట్‌వర్క్‌ను నవంబర్ 9లోగా తరలించాలని భావించినా సెక్యూరిటీ ఏర్పాట్లలో సాంకేతిక ఇబ్బందుల కారణంగా గడువు తీసుకున్నారు.

### సిరిసిల్ల సెస్‌లో ఏఈ పోస్టులకు నోటిఫికేషన్

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సిరిసిల్ల సెస్) 13 ఏఈ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపింది. వివరాలకు www.tscess2019.com ను సంప్రదించవచ్చు.

### కొత్త సహకార సంఘాలు

- జీవో జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. ప్రతి మండలానికి కనీసం రెండు సంఘాలు ఉండేలా బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జీవో విడుదలపై సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డికి తెలంగాణ సహకార గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏ జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి డీ భీంరాజ్.. కృతజ్ఞతలు తెలిపారు.

### వంట ఏజెన్సీలకు వెంటనే నిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వంట ఏజెన్సీలకు, వంట సహాయకుల కోసం ప్రభుత్వం నిధులు విడుదలచేసిందని, వాటిని వారికి సకాలంలో చెల్లించాలని పాఠశాల విద్యా కమిషనర్ టీ విజయ్‌కుమార్ ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులకు సూచించారు. రాష్ట్రంలోని 27,406 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంకోసం 1 నుంచి 8 తరగతుల వరకు రూ.74.67 కోట్లు, 9,10 తరగతులకు రూ.6.29 కోట్లు విడుదలచేసినట్టు పేర్కొన్నారు.



ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే లావుడ్య రాములునాయక్ బుధవారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ జీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పీజీ స్పెల్ -1 పరీక్ష రాశారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదువుతున్నారు. - ఖమ్మం ఎడ్యుకేషన్

# కాల్వల పనులు వేగవంతం చేయండి

- అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం
- రంగనాయకసాగర్ పంప్‌హౌస్ పరిశీలన

**చిన్నకోడూరు:** 'త్వరలోనే గోదావరి జలాలు రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు రానున్నాయి. చెరువులు నింపడానికి కాల్వలపనులు త్వరితగతిన పూర్తిచేయాలి. త్వరలోనే కాల్వల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తా' అని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్– పెద్దకోడూరు గ్రామాల శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ కట్ట, సొరంగం, పంపుహౌస్, ప్రధానకాల్వలను బుధవారం రాత్రి ఈఎన్సీ హరిరామ్‌తోకలిసి మంత్రి పరిశీలించారు. కట్ట పొడవునా తిరిగి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్‌స్టేషన్ పనులపై ఆరా తీశారు. గోదావరి జలాలు రిజర్వాయర్‌కు రాగానే చూడటానికి ప్రజలు పెద్దఎత్తున రానున్న నేపథ్యంలో భద్రతాచర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి వెంట కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఈ ఆనంద్, ఈఈ రవీందర్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ తదితరులు ఉన్నారు.



బుధవారం రాత్రి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని రంగనాయకసాగర్ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు



సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బుధవారం వికారాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీని బతికించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలందరూ ఆర్టీసీలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. - వికారాబాద్ రూరల్







విక్రం సారాభాయ్ జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ నిట్‌లో ఇస్రో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, ఇన్‌సెట్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఇస్రో పూర్వ డైరెక్టర్ జయరామన్, నిట్ డైరెక్టర్ రమణారావు

## అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో అగ్రగామి

ఇస్రో పూర్వ డైరెక్టర్ జయరామన్
నిట్‌లో ఘనంగా విక్రం సారాభాయ్ జయంతి ఉత్సవాలు

**నిట్‌క్యాంపస్ (వరంగల్):** అంతరిక్ష పరిశోధనల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అగ్రగామిగా నిలిచి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచదేశాలతో పోటీపడుతున్నదని ఇస్రో పూర్వ డైరెక్టర్ జయరామన్ పేర్కొన్నారు. శాటిలైట్ల రూపకల్పనకు కృషి చేసిన విక్రం సారాభాయ్ లాంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విక్రం సారాభాయ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఇస్రో ఆధ్వర్యంలో వరంగల్‌లోని నిట్‌లో బుధ, గురువారాల్లో స్పేస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో బుధవారం జయరామన్ జ్యోతి ప్రజ్వలనచేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇస్రో, నిట్‌తో పాటు వరంగల్ అర్బన్ జిల్లా, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, వరంగల్ సంయుక్తంగా విక్రం సారాభాయ్ శతజయంతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 1957లో రష్యా స్పుత్నిక్‌ను ప్రయోగించినపుడు, రాకెట్ల ఉపయోగాన్ని అప్పటి ప్రధాని నెహ్రూకు వివరించి విక్రం సారాభాయ్ అంతరిక్ష పరిశోధనల్లో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, వరంగల్ అర్బన్ స్పెషల్ కలెక్టర్ మనుచౌదరి, విద్యాశాఖాధికారి నారాయణరెడ్డి, నిట్ స్టూడెంట్ డీన్ యల్ఆర్‌జీ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిండి ప్రాజెక్టును ఎండనివ్వం

రైతుల గౌరవాన్ని పెంచిన ఏకైక సీఎం కేసీఆర్
డిండి విత్తనోత్పత్తి క్షేత్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం
వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్/కల్వకుర్తి, నమస్తే తెలంగాణ/డిండి:** ఎట్టి పరిస్థితుల్లో డిండి ప్రాజెక్టును ఎండనివ్వమని, డిండి కళకళలాడాలన్నదే సీఎం కేసీఆర్ కల అని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు. బుధవారం నల్లగొండ జిల్లా డిండి సమీపంలోని వ్యవసాయ శాఖ విత్తన క్షేత్రాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిండి ప్రాజెక్టులో ఏడాది పొడవునా నిండుగా నీళ్లుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలోని 176 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని ఆధునిక వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. 30 ఎకరాల్లో విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తామని తెలిపారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రంలో 92.5 శాతం భూమి సన్న, చిన్నకారు రైతుల వద్ద ఉండగా, 22,500 మంది రైతుల వద్ద మిగిలిన భూమి ఉన్నదని వివరించారు. ఏడెకరాలలోపు భూమి ఉన్న రైతులు పింఛన్‌కు అర్హులని, అధికశాతం మంది రైతులకు ఆసరా పింఛన్ వస్తున్నదని చెప్పారు. దేశంలో రైతులకు సాయంచేసిన వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. విత్తన క్షేత్రంలోని వేరుశనగలో కలుపుపై నిర్లక్ష్యం ప్రదర్శించిన ఏవోపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అతడికి మెమో జారీచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు అన్ని రకాల పంటలు పండించాలని పిలుపునిచ్చారు. సమీప పట్టణాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ అధికారులు రైతులు పంటలు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. మోతాదుకు మించి రైతులు పురుగు మందులు, ఎరువులు వాడొద్దని చెప్పారు. ఆర్గానిక్ వ్యవసాయానికి, ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని, మన నాటుకోడి గుడ్డును సూపర్ మార్కెట్లలో రూ.15కు అమ్ముతున్నారని తెలిపారు.



నల్లగొండ జిల్లా డిండిలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సమీపంలో బోజిరెడ్డి అనే రైతు సాగు చేసిన బ్రీడర్ వేరుశనగ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి

**కల్వకుర్తిలో వేరుశనగ సాగు క్షేత్రం పరిశీలన**

డిండికి వెళ్తున్న క్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జోజిరెడ్డి వేరుశనగ బ్రీడర్ సీడ్ సాగు క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక వేరుశనగ ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే సాగవుతున్నదని చెప్పారు. ఇందులో వనపర్తి జిల్లా అగ్రస్థానంలో ఉన్నదన్నారు. పాలమూరులో వేరుశనగ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి ఉన్న వేరుశనగను 25 నుంచి 30 క్వింటాళ్లకు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. మంత్రి వెంట దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రనాయక్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డైరెక్టర్ కేశవులు, నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంచందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.



ఖమ్మంలో రోడ్డు ప్రమాద బాధితులకు సహాయక చర్యలు చేపడుతున్న మంత్రి అజయ్‌కుమార్

## పల్లె ప్రగతికి బృహత్తర ప్రణాళికలు

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**మామిళ్లగూడెం:** పల్లెప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలు రచించి 30 రోజుల్లోనే గ్రామాలను అభివృద్ధి చేసిందని రవాణాశాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఖమ్మంలో గ్రామాల సర్పంచులకు 56 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ప్రగతి ప్రణాళికలో భాగంగానే శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డుల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్ల పంపిణీ చేస్తున్నామన్నా పడుతుందన్నారు.

**మానవత్వం చాటుకున్న మంత్రి**

**ఖమ్మం రూరల్ :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తన ఎస్కార్ట్ వాహనంలో చికిత్సకు తరలించి మంత్రి పువ్వాడ మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన బిక్షమయ్య భార్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. అదే సమయంలో హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి ఆగి తన ఎస్కార్ట్ వాహనంలో క్షతగాత్రులను జిల్లాకేంద్రంలోని మమత దవాఖానకు తరలించారు.



సిద్దిపేట జిల్లా కొండపాకలోని వేద స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను తిలకిస్తున్న మంత్రి హరీశ్‌రావు



భువనగిరిలో విద్యార్థుల ప్రదర్శనలను చూస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి తదితరులు

# స్వచ్ఛతెలంగాణ దిశగా సాగుదాం

విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించాలి: మంత్రి హరీశ్‌రావు

**కొండపాక :** ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటుచేసి స్వచ్ఛ తెలంగాణ దిశగా ముందుకు సాగుదామని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వేద ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలను కాపాడేందుకు నేటి నుంచే పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని అన్నారు. పాఠశాలస్థాయి నుంచే గుణాత్మకమైన విద్యతో విద్యార్థుల్లో మంచి లక్షణాలను పెంపొందించాలని సూచించారు. విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు మంచి వేదికగా మారాయని అన్నారు. మగపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి వచ్చేంతవరకు వారు చేసే కార్యకలాపాలపై తల్లితండ్రులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.

**సైన్స్ ఫలాలు అందరికి చేరాలి:మంత్రి జగదీశ్‌రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సైన్స్ ఇచ్చిన అద్భుత ఫలాలు అందరికి చేరవేసే విధంగా విద్యార్థులు ఎదగాలని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం భువనగిరి మదర్‌థెరిస్సా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు మూఢ నమ్మకాలను దూరం చేసుకుని శాస్త్రీయతను అలవర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇష్టమైన రంగాలను గుర్తించి, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, డీఈవో చైతన్యజైని పాల్గొన్నారు.

**నేటి నుంచి ఇచ్చోడలో రాష్ట్రస్థాయి గిరిజన విద్య, వైజ్ఞానిక సదస్సు**

**ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో గురువారం నుంచి రాష్ట్రస్థాయి గిరిజన విద్య, వైజ్ఞానిక సదస్సును నిర్వహిస్తున్నట్టు గిరిజన గురుకులాల సంస్థ ఓఎస్డీ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని 133 గిరిజన గురుకులాల పాఠశాలల నుంచి సుమారు 1,100 మంది విద్యార్థులుఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

## తప్పిన పెను ప్రమాదం

- పూర్తిగా కాలిబూడిదైన టాటా ఏస్ వాహనం...
- డ్రైవర్ అప్రమత్తతతో అందరు సురక్షితం.



కాలిపోతున్న టాటా ఏస్ వాహనం

**సిర్పూర్(టి):** సిర్పూర్(టి) మండలంలోని వెంపల్లి గ్రామ సమీపంలో ఓ టాటా ఏస్ వాహనంలో మంటలు చెలరేగగా, తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే, బుధవారం రాత్రి సమయంలో ఆసిఫాబాద్ మండలంలోని కొండపల్లి గ్రామం నుంచి కౌటాల మండలం లోడ్‌పల్లికి 12 మంది ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం సిర్పూర్(టి) మండలం వెంపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ గాట్ల సురేశ్ వెంటనే వాహనాన్ని ఆపి, ప్రయాణికులను దించేశాడు. నిమిషాల వ్యవధిలోనే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ఎస్ఐ సెగ్యం వెంకటేశ్ దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అక్కడికి చేరుకొని, విచారం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు ధైర్యం చెప్పి, వారి స్వస్థలానికి పంపించారు.





ములుగులో లఘుచిత్రం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## 'మేడారం'పై లఘు చిత్రాల పోటీ

**ములుగు జిల్లాప్రతినిధి/నమస్తే తెలంగాణ:** ప్లాస్టిక్‌ఫ్రీ మేడారం జాతరపై లఘు చిత్రాల పోటీలను నిర్వహిస్తున్నట్టు ములుగు కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీలకు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా సినీ దర్శకుడు వీర శంకర్, సభ్యులుగా సినీనటుడు శ్రీకాంత్, దర్శకుడు హరీశ్‌శంకర్, సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు వ్యవహరిస్తారని చెప్పారు. మొదటి బహుమతిగా రూ.75 వేలు, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ. 25 వేల నగదు అందజేస్తున్నట్టు ప్రకటించారు. ఔత్సాహికులు www.innovativeads.co.in, pfmshortfilm@gmail.com, youtube.com /innovativeness అడ్రస్‌లకు జనవరి 5లోగా లఘు చిత్రాలను పంపించాలని కలెక్టర్ కోరారు.

## పురుగుల మందు తాగించి భార్యను చంపిన భర్త

**వెంకటాపురం (ఎన్)(ములుగు):** భార్యకు పురుగుల మందు తాగించి హత్య చేసిన ఘటన ములుగు జిల్లా వెంకటాపూరంలో బుధవారం చోటుచేసుకున్నది. బీసీ మర్రిగూడెం గ్రామానికి చెందిన తోట రమేశ్‌కు తొమ్మిదేండ్ల క్రితం సుబ్బలక్ష్మి(25)తో వివాహమైంది. రమేశ్ మద్యానికి బానిసవ్వడంతో సుబ్బలక్ష్మి తన తల్లిగారి ఊరు చొక్కాలలో ఉంటుంది. మంగళవారం రమేశ్ తన బంధువుల పెండ్లి ఉందని భార్యకు మాయమాటలు చెప్పి వెంకటాపురం తీసుకొచ్చాడు. సాయంత్రం మండలకేంద్రంలోని ఇటుకల బట్టీల సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి సుబ్బలక్ష్మికి బలవంతంగా పురుగుల మందు తాగించి హత్య చేశాడు.

## మొసలి దాడిలో వ్యక్తి గల్లంతు

**మాగనూర్:** మొసలి దాడిలో వ్యక్తి గల్లంతైన ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం మందిపల్లి సమీపంలోని కృష్ణానదిలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మందిపల్లి గ్రామానికి చెందిన మక్తల్ పెద్ద బుగ్గప్ప (65) కృష్ణానది అవతలి ఒడ్డున పశువులను మేపుకొని నది దాటుతున్న సమయంలో నీటిలో ఉన్న మొసలి అతడిపై దాడి చేసింది. పక్కనే ఉన్న అతని బంధువు, బుగ్గప్పను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అతను నది నీటిలో గల్లంతయ్యాడు. గ్రామస్థులకు విషయం తెలియడంతో గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు బగ్గప్ప ఆచూకీ లభించలేదు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించి లక్ష్మి(కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో బుధవారం నాలుగు మోటర్లు నీటిని ఎత్తిపోస్తున్నాయి. పంప్‌హౌస్‌లోని 3, 4, 5, 7వ నంబర్ మోటర్లు నిరంతరంగా నడుస్తున్నాయి. ఈ మేరకు రోజుకు 8,480 క్యూసెక్కుల నీటిని అన్నారం బరాజ్‌కు ఎత్తిపోస్తున్నాయి. బుధవారం సాయంత్రం వరకు సరస్వతి(అన్నారం) బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.
- కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి)

## టీఆర్ఎస్‌ది సెక్యులర్ ప్రభుత్వం

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్

**మహబూబ్‌నగర్ టౌన్ :** టీఆర్ఎస్‌ది సెక్యులర్ ప్రభుత్వమని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్ అన్నారు. నవాబ్ మీర్ మహబూబ్‌అలీ ఖాన్ బహద్దూర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్ 129వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఆయా మతాల ప్రతినిధులు పాల్గొన్నారు. నిజాం చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి వేడుకలను సర్వమత ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఖమ్రుద్దీన్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో గంగాజమున తహ్‌జిబ్‌లా హిందు ముస్లింలు కలిసి మెలిసి ఉంటారని చెప్పారు. పాలమూరు అంటే ప్రేమ, ఆప్యాయతలకు నిలయమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నాదని తెలిపారు. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి 5 ఏండ్లల్లో జరిగిందన్నారు.జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మహమూద్‌అలీ, వీహెచ్‌పీ సెక్రటరీ లక్ష్మారెడ్డి, షాషాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, రెవరెండ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ ఖమ్రుద్దీన్

## పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. కానీ రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణస్థాయిలో ఉంటున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీలవరకు తగ్గాయి. మరో మూడురోజుల పాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. మొన్నటివరకు ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావం తొలిగిపోవడంతో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరిగే అవకాశమున్నదని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 3.5 డిగ్రీలు తగ్గుతుండగా, రాత్రి మాత్రం సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నది. బుధవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 20.6 డిగ్రీలు, గరిష్ఠం 27.5 డిగ్రీలుగా నమోదైంది.

### చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 15.0 | 30.0 |
| మహబూబాబాద్ | 15.0 | 30.0 |
| ఆదిలాబాద్ | 15.6 | 30.3 |
| నిర్మల్ | 16.0 | 27.0 |
| రంగారెడ్డి | 16.0 | 28.0 |
| వికారాబాద్ | 18.2 | 29.8 |
| కామారెడ్డి | 17.0 | 28.0 |
| ములుగు | 17.0 | 29.0 |
| జగిత్యాల | 17.0 | 30.0 |
| మంచిర్యాల | 17.2 | 32.7 |
| మెదక్ | 17.7 | 30.8 |
| నాగర్‌కర్నూల్ | 18.0 | 27.0 |
| సిద్దిపేట | 18.0 | 28.0 |
| నల్లగొండ | 18.0 | 28.2 |
| పెద్దపల్లి | 18.0 | 29.0 |
| వరంగల్ రూరల్ | 18.0 | 29.0 |
| జనగామ | 18.1 | 27.0 |
| కరీంనగర్ | 18.4 | 32.7 |
| సంగారెడ్డి | 18.5 | 28.7 |
| యాదాద్రి భువనగిరి | 19.0 | 22.0 |
| రాజన్నసిరిసిల్ల | 19.0 | 28.0 |
| సూర్యాపేట | 19.0 | 28.0 |
| వరంగల్ అర్బన్ | 19.0 | 29.5 |
| జయశంకర్ భూపాలపల్లి | 19.0 | 30.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 19.0 | 31.0 |
| జోగుళాంబ గద్వాల | 19.2 | 31.0 |
| ఖమ్మం | 20.0 | 31.0 |
| నిజామాబాద్ | 20.2 | 30.3 |
| హైదరాబాద్ | 20.6 | 27.5 |
| మేడ్చల్ | 20.6 | 27.5 |
| మహబూబ్‌నగర్ | 20.6 | 28.0 |
| నారాయణపేట | 20.6 | 28.0 |
| వనపర్తి | 24.0 | 32.6 |



# ఎవరి బలం ఎంత?

ఉప్పల్‌లో చెమటోడ్చిన భారత్, వెస్టిండీస్

విరాట్ వికెట్ కీలకమంటున్న విండీస్ కోచ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరిగే తొలి టీ20 కోసం భారత్, వెస్టిండీస్ ఇప్పటికే నగరానికి చేరుకున్నాయి. వెస్టిండీస్ జట్టు మంగళవారమే ఉప్పల్‌లో ప్రాక్టీస్ చేస్తే.. కోహ్లీ సేన బుధవారం కసరత్తులు ప్రారంభించింది. విధ్వంసక ఆటగాళ్ల గైర్హాజరీలో విండీస్ కాస్త డీలాపడ్డట్లు కనిపిస్తున్నా.. 'అండర్ డాగ్స్‌గా బరిలో దిగుతున్నాం. మాపై అంచనాలు లేకపోవడం మంచిదే. ఎలాంటి ఫలితమైనా రావొచ్చు'అని కరీబియన్ కెప్టెన్ పొలార్డ్ అంటున్నాడు. మరోవైపు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ ఈ మ్యాచ్ నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాడు. రెండేండ్ల క్రితం ఉప్పల్‌లో ఆస్ట్రేలియాతో టీ20 మ్యాచ్ రద్దైన నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా అన్నీ తానే దగ్గరుండి చూసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇరుజట్ల బలాబలాలపై ఓ కన్నేస్తే..!



### టీమ్ఇండియా

**బలాలు**

ఇటీవలి కాలంలో భారత బౌలింగ్ మెరుగుపడ్డా.. పొట్టి ఫార్మాట్‌లో విరాట్ సేన ప్రధానాయుధం బ్యాటింగే. టాపార్డర్ రాణిస్తే టీమ్ఇండియాకు తిరుగుండదు. శిఖర్ ధవన్ గాయంతో జట్టుకు దూరమవడంతో అతడి స్థానంలో లోకేశ్ రాహుల్ ఓపెనింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రోహిత్ గురించి కొత్తగా చెప్పేదేముంది. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, మనీశ్ పాండే తమదైన ముద్ర వేసేందుకు తహతహలాడుతుంటే.. సంజూ శాంసన్ జట్టులో చోటు దక్కితే చేలరేగిపోవాలని చూస్తున్నాడు. గత సిరీస్‌లో అరంగేట్రం చేసిన హార్డ్ హిట్టర్ శివం దూబె ఈసారైనా మెరుపులు మెరిపించాలని భావిస్తున్నాడు. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడంతో చాలాకాలం తర్వాత పొట్టి ఫార్మాట్‌లో మహమ్మద్ షమీ ఆడనున్నాడు.

**బలహీనతలు**

పేపర్‌పైన బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తున్నా.. సీనియర్లు విఫలమైతే మిడిలార్డర్‌లో జట్టును ముందుకు నడిపించే ఆటగాళ్లు కరువయ్యారు. ఇటీవల నిలకడగా రాణిస్తున్న అయ్యర్ నాలుగో స్థానాన్ని తన పేరిట రాసుకోవాలని చూస్తుంటే.. ఒక్క చాన్స్ అంటూ సంజూ శాంసన్ వేచి ఉన్నాడు. రిషబ్ పంత్ పేలవ ఫామ్ కొనసాగిస్తుంటే.. శివం దూబేకు పెద్దగా అనుభవం లేదు. జడేజాకు తుది జట్టులో చోటు దక్కుతుందో లేదో తెలియదు. ఇక కృనాల్ పాండ్యా స్థానంలో చోటు దక్కించుకున్న చైనామన్ కుల్దీప్ యాదవ్ తన జాదూ కనబర్చగలడా అనేది సందేహమే.

### వెస్టిండీస్

**బలాలు**

ఈ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ అయిన వెస్టిండీస్ జట్టుపై ఓ అంచనాకు రావడం కష్టమే. ఎప్పుడు ఎలా ఆడుతుందో తెలియని విండీస్ ఇటీవల తమ కంటే ఎంతో బలహీనమైన ఆఫ్ఘన్ జట్టు చేతిలో సిరీస్ కోల్పోయింది. పెద్ద జట్లను సైతం అలవోకగా ఓడించేలా కనిపించే కరీబియన్లు.. మరుక్షణంలోనే చేతులెత్తేసి చిన్న జట్ల చేతిలోనూ చతికిలపడటం పరిపాటి. అయితే అంచనాలు లేకుండా అండర్‌డాగ్స్‌గా బరిలో దిగనుండటం కలసొస్తుందని ఆ జట్టు కెప్టెన్ పొలార్డ్ అంటున్నాడు. హెట్‌మైర్, లూయిస్, సిమన్స్, పూరన్, రామ్‌దిన్, రూథర్‌ఫోర్డ్, పొలార్డ్, హోల్డర్ రూపంలో ఆ జట్టులో విధ్వంసకారులకు కొదవలేదు. బౌలింగ్‌లో కాట్రెల్, కీమోపాల్, కాస్రిక్, హోల్డర్ కీలకం కానున్నారు. ఆల్ రౌండర్లకు కొదవలేని విండీస్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

**బలహీనతలు**

విండీస్ ప్రధాన బలహీనత అనిశ్చితి. ఎప్పుడెలా ఆడుతారో వారికే తెలియదు. లీగ్‌ల కారణంగా హీరోలుగా మారిన కరీబియన్లు.. జట్టుగా ఆడితే వారిని ఓడించడం కష్టమే. అయితే ఎవరికి వారే యమునా తీరే చందంగా దూసుకుపోయే వారిని ఏకతాటిపైకి తీసుకురావడమే అసలు సమస్య. పొట్టి ఫార్మాట్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న పొలార్డ్‌కు నాయకత్వం కొత్త. టీమ్ఇండియా లాంటి బలమైన జట్టుతో మ్యాచ్‌లో అతడు విండీస్‌ను ఎలా నడిపిస్తాడనేది చూడాలి. ఇక స్పిన్ విషయంలోనూ భారత్‌తో కరీబియన్లకు ఏమాత్రం పోలిక లేదు.

### ఇరు జట్లు బిజీబిజీ..

మూడు రోజుల ముందుగానే నగరానికి చేరుకున్న విండీస్ బుధవారం ఉదయం పూట ఉప్పల్‌లో ప్రాక్టీస్ చేసింది. మధ్యాహ్నం టీమ్ఇండియా కసరత్తులు కొనసాగించింది. భారత స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు నెట్స్‌లో కరీబియన్లు చెమటోడ్చారు. నలుగురు లెగ్ స్పిన్నర్ల బౌలింగ్‌లో ప్రాక్టీస్ చేశారు. మరోవైపు టీమ్ఇండియా



వామప్‌తో మొదలెట్టి ఆ తర్వాత క్యాచ్‌లు, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసింది. అయితే గత కొంతకాలంగా ఫిట్‌నెస్‌పై ప్రధానంగా దృష్టిపెట్టిన టీమ్ఇండియా బుధవారం కొత్త విధానంతో అబ్బురపరిచింది. ఆటగాళ్లను రెండు వరుసలుగా విభజించి ముందున్న వరుస ప్లేయర్లకు రుమాళ్లు ఇచ్చి రెండో వరుస వాళ్లు వాటిని అందుకునే విధంగా ప్రాక్టీస్ చేసింది. జట్టు స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ నిక్ వెబ్ పర్యవేక్షణలో మనవాళ్లు దీన్ని కొనసాగించారు. ఈ వీడియోను బీసీసీఐ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. 'వెంటాడేటప్పుడు ఓ వ్యక్తి వేగం అతడికి తెలియకుండానే పెరిగిపోతుంది. అందుకే ఈ పద్ధతిని అమలు చేస్తున్నాం' అని వెబ్ అన్నాడు.

> హార్దిక్ పాండ్యా స్థానాన్ని భర్తీ చేసేందుకు నేను జట్టులోకి వచ్చానని అనుకోవడం లేదు. టీమ్ఇండియా తరఫున దక్కిన చాన్స్‌కు పూర్తి న్యాయం చేయాలనుకుంటున్నా. కెప్టెన్ కోహ్లీకి నాపై నమ్మకముంది. అలాగే టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. ఆల్‌రౌండర్లకు ఫిట్‌నెస్ కాపాడుకోవడం కఠిన పరీక్ష. బంతితో బ్యాట్‌తో రాణించాల్సిన అవసరం ఉంటుంది. పొట్టి ఫార్మాట్‌లో నా బౌలింగ్‌పై నమ్మకముంది. టీ20ల్లో విండీస్ ప్రమాదకర జట్టు. అయితే ప్రస్తుతం ప్రపంచంలో ఏ జట్టునైనా ఓడించే సత్తా టీమ్ఇండియాకు ఉంది.
>
> **- శివం దూబే,**
> **టీమ్ఇండియా ఆల్‌రౌండర్**



సిమన్స్

## కోహ్లీ వికెటే ముఖ్యం

టీమ్ఇండియాను ఓడించాలంటే ముందు కెప్టెన్ విరాట్ కోహ్లీ వికెట్ పడగొట్టాలని వెస్టిండీస్ కోచ్ సిమన్స్ పేర్కొన్నాడు. కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బౌలర్లు అతి జాగ్రత్తకు వెళ్లాల్సిన అవసరం లేదని.. ఎలాంటి జంకు లేకుండా బంతులు సంధించాలని అతడు సూచించాడు. 'విరాట్ వికెట్ పడగొట్టడం చాలా ముఖ్యం. అయితే అదంత సులభం కాదు. కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బౌలర్లు మరీ భయపడిపోవాల్సిన అవసరం లేదు. అతడిని పెవిలియన్ పంపేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలున్నాయి. వాటిని అమలు చేస్తే చాలు'అని సిమన్స్ పేర్కొన్నాడు.

## వెస్టిండీస్ బ్యాటింగ్ కోచ్‌గా మాంటీ



టీమ్ఇండియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు ముందు వెస్టిండీస్ జట్టు మాంటీ దేశాయ్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ లయన్స్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్, నేపాల్, కెనడా జట్లకు కోచ్‌గా పనిచేసిన దేశాయ్.. రెండేండ్ల పాటు విండీస్ బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అతడు గురువారం జట్టుతో చేరుతాడని విండీస్ క్రికెట్ బోర్డు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

## కోహ్లీ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి

**దుబాయ్:** టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానానికి చేరాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో తొలి డే అండ్ నైట్ టెస్టులో శతక్కొట్టిన కోహ్లీ గత వారమే 928 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. తాజాగా పాకిస్థాన్‌తో సిరీస్‌లో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ పెద్దగా పరుగులు చేయకపోవడంతో ఎనిమిది రేటింగ్ పాయింట్లు కోల్పోయాడు. దీంతో స్మిత్ (923) కంటే ఐదు పాయింట్లు ఎక్కువ ఉన్న కింగ్ కోహ్లీ నంబర్‌వన్ అయ్యాడు. చతేశ్వర్ పుజారా 4వ స్థానంలో కొనసాగుతుండగా.. అజింక్యా రహానే ఓ ర్యాంక్ కోల్పోయి 6వ స్థానంలో నిలిచాడు. బౌలింగ్ విభాగంలో బుమ్రా ఐదో స్థానంలో ఉంటే.. అశ్విన్ 9వ ప్లేస్‌లో నిలిచాడు. పాక్‌పై ట్రిపుల్ సెంచరీతో విరుచుకుపడిన డేవిడ్ వార్నర్ ఏకంగా 12 స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 110వ స్థానంతో ఈ ఏడాది ప్రారంభించిన లబుషేన్ (8) టాప్-10లో నిలువడం విశేషం. న్యూజిలాండ్‌పై డబుల్ సెంచరీ చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ ఏడో ర్యాంక్‌కు చేరాడు.

## రాయుడు లేని రంజీ జట్టు

హైదరాబాద్ కెప్టెన్‌గా తన్మయ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** రానున్న రంజీ ట్రోఫీ కోసం హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) బుధవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. కెప్టెన్‌గా తన్మయ్ అగర్వాల్, వైస్ కెప్టెన్‌గా సందీప్‌ను ఎంపిక చేసింది. ఈ నెల 9వ తేదీన మొదలయ్యే తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్‌తో హైదరాబాద్ తలపడుతుంది. ఇటీవల హెచ్‌సీఏపై అవినీతి ఆరోపణలు చేసిన సీనియర్ క్రికెటర్ అంబటి రాయుడుకు జట్టులో చోటు దక్కలేదు.

**జట్టు వివరాలు:**
తన్మయ్ అగర్వాల్ (కెప్టెన్), సందీప్ (వైస్ కెప్టెన్), అక్షత్ రెడ్డి, రోహిత్ రాయుడు, హిమలయ్ అగర్వాల్, సుమంత్, హసన్, సాయిరామ్, రవి కిరణ్, సిరాజ్, మిలింద్, త్యాగరాజన్, శశిధర్ రెడ్డి, యుధ్‌వీర్, మల్లికార్జున్.

## అదరగొడుతున్న భార్గవ్ రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన యువ బాక్సర్ అనుముల సాయి భార్గవ్‌రెడ్డి అదరగొడుతున్నాడు. టోర్నీ ఏదైనా, ప్రత్యర్థి ఎవరైనా పతకమే లక్ష్యంగా దూసుకెళుతున్నాడు. నాలుగేండ్ల ప్రాయంలోనే బాక్సింగ్‌ను ఎంచుకున్న భార్గవ్ అంచలంచెలుగా ఎదిగాడు. కోచ్ ఆనంద్ భాస్కర్ శిక్షణలో మరింత రాటుదేలాడు. 2017లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో కాంస్య పతకం సాధించాడు. అదే జోరులో రాష్ట్రస్థాయి టోర్నీలో స్వర్ణం సాధించి హర్యానాలో జాతీయస్థాయి టోర్నీకి ఎంపికయ్యాడు. గత నెల హర్యానాలో జరిగిన టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భార్గవ్ జనవరిలో నేషనల్ ఓపెన్ టోర్నీకి అర్హత సాధించాడు. ప్రస్తుతం



క్యాంపులో శిక్షణ పొందుతున్న భార్గవ్ మరిన్ని పతకాలు సాధించి ఆర్మీలో చేరి దేశ సేవ చేయడమే లక్ష్యమంటున్నాడు.

## భారత్ శుభారంభం

**కాన్‌బెర్రా (ఆస్ట్రేలియా):** మూడు దేశాల హాకీ టోర్నీలో భారత బాలికల జట్టు శుభారంభం చేసింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-0తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. భారత్ తరఫున లాల్‌రిండికి (15వ ని.లో), ప్రభ్‌లీన్ కౌర్ (60వ ని.లో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన భారత్‌కు మూడో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ దక్కినా.. దాన్ని మనవాళ్లు వినియోగించుకోలేకపోయారు.

# భారత్ ఆధిపత్యం

దక్షిణాసియా గేమ్స్‌లో మరో 29 పతకాలు.. అథ్లెటిక్స్‌లో ఐదు స్వర్ణాలు

**కాఠ్మాండు (నేపాల్):** దక్షిణాసియా గేమ్స్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగుతున్నది. బుధవారం ఒక్కరోజే మొత్తం 29 పతకాలు భారత ప్లేయర్లు దక్కించుకున్నారు. అథ్లెటిక్స్‌లో 10 (5 స్వర్ణాలు, 3 రజతాలు, 2 కాంస్యాలు), టేబుల్ టెన్నిస్ (3స., 3ర.), తైక్వాండో (3స., 2ర., 1కా.)ల్లో చెరో ఆరు, ట్రైయథ్లాన్‌లో ఐదు (2స., 2ర., 1కా.), ఖోఖోలో (2 స్వర్ణాలు) రెండు పతకాలు వచ్చాయి. తొలి రోజు అథ్లెటిక్స్‌లో 10 పతకాలతో రెచ్చిపోయిన భారత అథ్లెట్లు.. మరోసారి సత్తాచాటారు. మహిళల 200 మీటర్ల విభాగంలో భారత స్ప్రింటర్ అర్చనా సుసీంద్రన్ (23.67 సెకన్లు) గేమ్స్‌లో రెండో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంటే.. ఏ చంద్రలేఖ (24.37 సెకన్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. 10 వేల మీటర్ల పురుషుల రేస్‌లో సురేశ్ కుమార్ (29 నిమిషాల 32 సెకన్లు) స్వర్ణాన్ని సాధిస్తే.. లాంగ్ జంప్‌లో లోకేశ్ సత్యనాథన్ (7.87 మీటర్లు), స్వామినాథన్ (7.77మీ.) వరుసగా బంగారు, రజత పతకాలను గెలిచారు. ఇక పురుషుల డిస్కస్ త్రోలో కృపాల్ సింగ్ (57.88మీ.), గగన్‌దీప్ సింగ్ (53.57మీ.) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. మహిళల డిస్కస్‌త్రోలో నవ్‌జీత్ కౌర్ ధిల్లాన్ (49.87మీ.) స్వర్ణం సాధిస్తే.. సుర్వీ బిస్వా (47.47మీ.) వెండి పతకాన్ని గెలిచింది. మహిళల లాంగ్‌జంప్‌లో సంద్రా (6.02 మీటర్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. ఖోఖో పురుషుల ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 16-9తో బంగ్లాదేశ్‌ను, మహిళల జట్టు 17-5తో నేపాల్‌ను చిత్తుచేసి స్వర్ణ పతకాలు సాధించాయి. మొత్తంగా 71 పతకాలతో పట్టికలో భారత్ అగ్రస్థానానికి దూసుకొచ్చింది.







## బెంగళూరు గెలుపు

**పుణె:** ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) ఆరో సీజన్‌లో బెంగళూరు ఎఫ్‌సీ తన అజేయ యాత్రను కొనసాగించింది. బుధవారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 1-0తో ఒడిశా ఎఫ్‌సీపై విజయం సాధించింది. మ్యాచ్ 36వ నిమిషంలో జువానన్ ఏకైక గోల్ చేసి ఛేత్రిసేనను గెలిపించాడు. మ్యాచ్ 15వ నిమిషంలో ఒడిశా ప్లేయర్ నందకుమార్ శేఖర్ గోల్‌పోస్ట్ వైపు బలమైన షాట్ కొట్టగా బెంగళూరు గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు డైవ్ చేసి అద్భుతంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా ఓ గోల్ సాధించిన బెంగళూరు మ్యాచ్ గెలిచింది.

## మరో చాన్స్ వస్తుంది: వార్నర్

**అడిలైడ్:** టెస్టుల్లో విండీస్ దిగ్గజం బ్రియాన్ లారా చేసిన 400 పరుగుల రికార్డును అధిగమించేందుకు తనకు మరో అవకాశం తప్పకుండా వస్తుందని ఆసీస్ విధ్వంసకర ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇటీవలే పాకిస్థాన్‌పై రెండో టెస్ట్‌లో వార్నర్ 335 పరుగులతో అజేయంగా ఉన్న సమయంలో కెప్టెన్ టిమ్ పైన్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. త్రిశతకం బాదిన అనంతరం లారాను వార్నర్ కలిశాడు. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న అతడు 'దిగ్గజాన్ని కలవడం అద్భుతంగా అనిపించింది. 400 పరుగుల రికార్డును చెరిపేసేందుకు నాకు మరో అవకాశం తప్పకుండా వస్తుంది' అని పోస్ట్ చేశాడు. బ్రియాన్ కూడా ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేసి '735 నాటౌట్' అని రాశాడు.





రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న భారత మహిళల వన్డే జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్

## మహిళలకు తుపాకీ లైసెన్స్ ఇవ్వండి

కేంద్ర హోం మంత్రికి షూటర్ హీనా సిద్ధు విన్నపం

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రతి మహిళ తుపాకీ వాడేందుకు లైసెన్స్ ఇవ్వాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను స్టార్ షూటర్ హీనా సిద్ధు కోరింది. హైదరాబాద్‌లో జరిగిన దిశ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె బుధవారం ట్వీట్లు చేసింది. 'లైసెన్స్‌డ్ ఆయుధాలను తగ్గించేందుకు ఆయుధ చట్టాన్ని సవరించే కన్నా.. ఈ దేశంలో ప్రతి మహిళకు లైసెన్స్ ఉండే తుపాకీని తప్పనిసరి చేయాలని అమిత్‌షాను కోరుతున్నా. భద్రంగా తిరగాలి, పనులకు వెళ్లి సురక్షితంగా తిరిగిరావాలని మేం కోరుకుంటున్నాం. పోలీసులు సరైన భద్రత కల్పించలేకున్నందున దాడులను స్వయంగా ఎదుర్కోవాలని భావిస్తున్నాం. ఓ గ్యాంగ్ దాడి చేసినప్పుడు ఒంటరిగా ఉన్న మహిళకు ప్రతిఘటించేందుకు తుపాకీ ఆప్షన్‌గా ఉంటుంది' అని హీనా ట్వీట్ చేసింది.



| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,850 | 12,043 |
| ↗ 175 | ↗ 49 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 63.29 డాలర్లు

## ఈటీఎఫ్ బాండ్లు వచ్చేస్తున్నాయి..

ఈ నెలలోనే మార్కెట్లోకి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** ఈక్విటీల కోసం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లను జారీ చేసిన కేంద్రం తాజాగా..బాండ్ల కోసం ఈటీఎఫ్‌లను జారీ చేయడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమై అనుమతినిచ్చింది కూడా. ఈ బాండ్ల ఈటీఎఫ్‌లను జారీ చేయడం ద్వారా ప్రభుత్వరంగ సంస్థలు, ఆధీనంలో నడుస్తున్న ఆర్థిక సంస్థలకు అదనంగా నిధుల సమకూరే అవకాశాలు ఉన్నాయి. ఎన్ఎఫ్‌వో ఈ నెలలోనే ఆరంభించే అవకాశాలున్నాయి. భారత్ బాండ్ ఈటీఎఫ్ పేరుతో విడుదల చేయనున్న తొలి కార్పొరేట్ బాండ్ ఈటీఎఫ్‌లు కానున్నాయి. యునిట్ సైజ్‌ను రూ.1,000గా నిర్ణయించిన కేంద్రం..చిన్న స్థాయి పెట్టుబడిదారులు కూడా ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉన్నది. ఈ ఈటీఎఫ్‌లు మూడేండ్లు, పదేండ్లలో మెచ్యూరిటీ పొందనున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. బాండ్ ఈటీఎఫ్‌లకు తగిన భద్రత కల్పించనున్నట్లు, లిక్విడిటీ, వీటిపై పన్ను రాయితీ కల్పించే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు.

# రూ.39 వేలపైకి మళ్లీ పసిడి

రూ.332 పెరిగిన తులం ధర



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** గత కొన్ని రోజులుగా దిగువముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అతి విలువైన లోహాలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో దేశవ్యాప్తంగా కూడా మరింత పెరిగాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.332 అందుకొని రూ.39,299కి చేరుకున్నది. గత కొన్ని రోజులుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతున్న బంగారం మళ్లీ రూ.39 వేల మార్క్‌ను దాటినట్లు అయింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో కిలో వెండి ధర ఏకంగా రూ.676 అధికమై రూ.46,672 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్‌తోపాటు డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో మరిం ప్రియమయ్యాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ విశ్లేషకులు తపన్ పటేల్ తెలిపారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,483 డాలర్లకు చేరుకోగా, వెండి 17.27 డాలర్ల వద్ద ఉన్నది. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశాలు లేవని, నవంబర్ 2020 ఎన్నికల తర్వాతనే వచ్చే అవకాశం ఉన్నదని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఆందోళను పెంచింది. దీంతో తమ ఇన్వెస్ట్‌మెంట్లను పసిడి వైపు మళ్లించినట్లు పటేల్ చెప్పారు. ప్రస్తుత సంవత్సరంలో పసిడి ధరల్లో వృద్ధి 13 శాతంగా ఉన్నది.

## టాటా వాహనాలు మరింత ప్రియం!



**జైసల్మార్(రాజస్థాన్), డిసెంబర్ 4:** వాహన ధరలు పెంచడానికి టాటా మోటర్స్ కూడా సిద్ధమైంది. వచ్చే నెల నుంచి అన్ని రకాల ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచబోతున్నట్లు కంపెనీ వర్గాలు బుధవారం ప్రకటించాయి. బీఎస్-6 ప్రమాణాలకు లోబడి వాహనాలను తయారు చేయడానికి అయ్యే ఉత్పత్తి వ్యయం అధికమవుతున్నదని, సంస్థపై పడుతున్న ఈ అదనపు భారాన్ని వినియోగదారులకు మళ్లించడంలో భాగంగా వాహన ధరలను పెంచకతప్పడం లేదని టాటా మోటర్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరేఖ్ తెలిపారు. ధరలను ఎంతపెంచుతున్నదో తెలుపడానికి ఆయన నిరాకరించారు. ఇందుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, సహజంగా వాహన ధరలు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెరుగుతాయని ఆయన సంకేతాలిచ్చారు. ఏప్రిల్ 1, 2020 నుంచి ప్రతి వాహనం బీఎస్-6 ప్రమాణాలకు లోబడి ఉండాలని గతంలో కేంద్రం ఆదేశించింది. ప్రస్తుతం సంస్థ రూ.4.39 లక్షల మొదలుకొని రూ.16.85 లక్షల లోపు ధర కలిగిన పలు మోడళ్లను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నది. ఇదివరకే మారుతి సుజుకీ, టయోటా, మహీంద్రా అండ్ మహీంద్రా, మెర్సిడెజ్ బెంజ్‌లు వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి.

# జీఎస్టీ నష్టపరిహారం ఏది?

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో
బీజేపీయేతర పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు భేటీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నష్టపరిహారం చెల్లింపుల్లో ఆలస్యంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను బుధవారం ఇక్కడ బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా చెల్లింపుల జాప్యంపై ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడుతున్నదన్నారు. ఢిల్లీ, పంజాబ్, పుదుచ్చెరి, మధ్యప్రదేశ్ ఆర్థిక మంత్రులు, కేరళ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ ప్రతినిధులు.. నిర్మలా సీతారామన్‌తో సమావేశమైనవారిలో ఉన్నారు. సమావేశం అనంతరం పంజాబ్ ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ బకాయిలు రావాల్సి ఉందని, చెల్లింపులకు ప్రభుత్వం అభ్యంతరాలు పెడుతున్నదన్నారు. అక్టోబర్, నవంబర్ బకాయిల చెల్లింపులపైనా అనుమానమేనని తెలిపారు. నష్టపరిహారం వీలైనంత త్వరలోనే వస్తుందని హామీ ఇస్తున్న నిర్మలా సీతారామన్.. ఎప్పట్లోగా అది అందుతుందన్న సమాచారం మాత్రం ఇవ్వలేకపోతున్నారని బాదల్ అన్నారు. మరోవైపు నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ 'కొన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు నన్ను కలిశారు. ఆయా రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన జీఎస్టీ నష్ట పరిహార బకాయిలను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అందరూ వారివారి రాష్ట్రాల ప్రయోజనాల కోసమే అడిగారు' అన్నారు. ఇక జీఎస్టీ కింద నష్టపరిహారం పొందడం రాష్ట్రాలకున్న హక్కు అని, దాన్ని కేంద్రం గౌరవిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. జూలై 1, 2017 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర, రాష్ర్టాల పన్నులను కలిపి తెచ్చిన జీఎస్టీతో రాష్ర్టాలకు ఆదాయం దూరమవుతున్నది. దీంతో రాష్ర్టాలకు నష్టపరిహారం చెల్లించేందుకు కేంద్రం అంగీకరించింది. రెండు నెలలకోసారి ఈ నష్టపరిహారాన్ని కేంద్రం విడుదల చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) ఏప్రిల్-జూలైకిగాను జీఎస్టీ నష్టపరిహారంగా రాష్ర్టాలకు కేంద్రం రూ.45,744 కోట్లను చెల్లించింది. ఆగస్టు-సెప్టెంబర్ నెలలకు రూ.18,784 కోట్లను ఇవ్వాల్సి ఉన్నది.

### మీ చుట్టు రోజూ తిరుగలేం

జీఎస్టీ నష్టపరిహారాల చెల్లింపుల్లో ఆలస్యంపై రాష్ర్టాల ఆర్థిక మంత్రులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బకాయిల కోసం రోజూ మేము ఢిల్లీకి రాలేమన్నారు. 'ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతున్నది. మేము అర్హులకు పెన్షన్లను చెల్లించాల్సి ఉన్నది. రోజూ ఢిల్లీ చుట్టూ తిరుగలేం. ఈ పద్ధతేం బాగాలేదు. మాకు బాధగా ఉన్నది' అని పంజాబ్ ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సైతం నష్టపరిహార నిధిలో తగినంత నగదు లేదని కేంద్రం చెబుతుండటం సరికాదన్నారు.

### మళ్లీ పన్నుల మోత

జీఎస్టీ వసూళ్లు నిరాశాజనకంగా ఉండటంతో పన్ను మినహాయింపులపై కేంద్రం పునరాలోచనలో పడింది. దీంతో జీఎస్టీ నుంచి తొలగించిన వస్తువులను తిరిగి పన్ను పరిధిలోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 18న జీఎస్టీ మండలి సమావేశం జరుగనుండగా, ఆ తర్వాత కొన్ని వస్తు, సేవలకు మళ్లీ జీఎస్టీ పడనుందని సమాచారం. ఆర్థిక మందగమనం, రాష్ర్టాలకు నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం నేపథ్యంలో జీఎస్టీ ఆదాయం పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనే రాబోయే మండలి సమావేశం ప్రధానంగా దృష్టి పెట్టనుందని కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నది.

### జీఎస్టీ విఫలమేనా?

జీఎస్టీ.. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ నినాదంతో దాదాపు రెండున్నరేండ్ల క్రితం మోదీ సర్కారు తెచ్చిన చారిత్రాత్మక సంస్కరణ. అటు కేంద్రంలో, ఇటు రాష్ర్టాల్లో ఉన్న డజనుకుపైగా పన్నులను ఏకం చేసి పరిచయం చేసిన జీఎస్టీ పరిధిలో 500లకుపైగా సేవలు, 1,300లకుపైగా వస్తువులున్నాయి. 0, 5, 12, 18, 28 శాతాల్లో ఆయా వస్తు, సేవలపై పన్నులను విధించారు. బంగారంపై ప్రత్యేకంగా 3 శాతం పన్ను వేయగా, విలువైన ముడి రత్నాలు, రాళ్లపై కనిష్ఠంగా 0.25 శాతం పన్ను నిర్ణయించారు. ఇక పెట్రో ఉత్పత్తులను జీఎస్టీలో చేర్చని కేంద్రం.. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితరాలకు ఈ పన్ను నుంచి మినహాయింపునిచ్చింది. అయితే ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ విఫలమైందా? అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. జీఎస్టీకి ముందుతో పోల్చితే పన్నుల ఆదాయం పడిపోయిందన్న ఆందోళన ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నది మరి. రాష్ర్టాలకు జీఎస్టీ నష్టపరిహారాన్ని కేంద్రం చెల్లించలేకపోతుండటం ఈ అనుమానాలను మరింత ధ్రువపరుస్తున్నది. తగ్గిన ఆదాయం కారణంగానే నష్టపరిహారం ఇవ్వలేకపోతున్నామని రాష్ర్టాలకు కేంద్రం లిఖితపూర్వకంగా వివరిస్తున్నది. నిజానికి పన్ను వసూళ్లకు సంబంధించి ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాలన్నీ దాదాపు విఫలమవుతూనే ఉన్నాయి. ప్రజలు, వ్యాపార, పారిశ్రామిక రంగాల విన్నపాలతో గరిష్ఠ శ్లాబులోని వస్తు, సేవలను కేంద్రం.. దిగువ శ్రేణి శ్లాబుల్లోకి మార్చుతూ వస్తుండటం వసూళ్లను ప్రభావితం చేస్తున్నది. దీంతో ఆదాయం పడిపోగా, రాష్ర్టాలకు నష్టపరిహారం పెను భారంగా మారుతున్నది. ఫలితంగా జీఎస్టీ.. మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకే గుదిబండగా మారిందా? అన్న భయాలు వ్యక్తమవుతున్నాయి.

## కోలుకున్న సేవల రంగం

నవంబర్‌లో 52.7గా నమోదు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** వరుసగా రెండు నెలలుగా ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్న సేవల రంగం తిరిగి కోలుకున్నది. నూతన బిజినెస్ ఆర్డర్లు పుంజుకోవడం, ఉద్యోగ కల్పన జోరందుకోవడం, వ్యాపార వర్గాల్లో నమ్మకం మరింత బలపడటంతో నవంబర్ నెలకుగాను సేవల రంగ పనితీరులో వృద్ధి నమోదైంది. గత నెలకుగాను సేవల రంగం 52.7 పనితీరు కనబరిచింది. గడిచిన నాలుగు నెలల్లో ఇదే అత్యధికమని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఇండియా సర్వీసెస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ వెల్లడించింది. అక్టోబర్‌లో ఇది 49.2 శాతంగా ఉన్నది. మాంద్యం కోరల్లో చిక్కుకున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది భారీ ఊరటనిచ్చే అంశమని, ప్రస్తుత నెలలోనూ ఇదే స్థాయిలో పనితీరు కనబరిస్తే ఆర్థిక మాంద్యం చాయలు పోయినట్లు సంకేతాలని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ప్రధాన ఆర్థికవేత్త పొల్లయన్న తెలిపారు. అయినప్పటికీ దీర్ఘకాలికంగా 54.2గా కొనసాగిన పనితీరు గత ఆరు నెలలుగా 50 అటు ఇటుగా నమోదవుతున్నది. సరాసరిగా గత నెలలో సరాసరి ఉత్పత్తి వ్యయం అధికమైందని, ధరలకు సంబంధించి ద్రవ్యోల్బణం 13 నెలల గరిష్ఠాన్ని తాకిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను భారత వృద్ధి ఆరేండ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం రిజర్వ్ బ్యాంక్ ప్రకటించనున్న పరపతి సమీక్షలో వడ్డీరేట్లను మరోమారు తగ్గించే అవకాశాలున్నాయని బ్యాంకర్లు, ఎగుమతిదారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## సెబీతో తేల్చుకోండి

కార్వీ కేసులో స్పష్టం చేసిన శాట్ -రుణదాతలకు ఎదురుదెబ్బ

**ముంబై, డిసెంబర్ 4:** కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ అక్రమాల కేసులో ఆ సంస్థకు రుణాలిచ్చిన బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లకు ఎదురుదెబ్బ తగిలింది. రుణాల కోసం కార్వీ తాకట్టు పెట్టిన క్లయింట్ల సెక్యూరిటీల బదిలీ అంశాన్ని మార్కెట్ రెగ్యులేటర్ సెబీతోనే తేల్చుకోవాలని సెక్యూరిటీస్ అప్పీలెట్ ట్రిబ్యునల్ (శాట్) బుధవారం తీర్పు చెప్పింది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ సంస్థలు క్లయింట్ల సెక్యూరిటీలను తనఖా పెట్టుకుని కార్వీకి రుణాలిచ్చిన విషయం తెలిసిందే. 95 వేలకుపైగా క్లయింట్లకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన సెక్యూరిటీలను కార్వీ తాకట్టు పెట్టింది. అయితే ఇది మార్కెట్ నిబంధనలకు విరుద్ధం కావడంతో కార్వీ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను తిరిగి క్లయింట్లకు అందించాలని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)కు సూచించింది. దీంతో దాదాపు 83 వేలకుపైగా క్లయింట్లకు వారి సెక్యూరిటీలు తిరిగి వచ్చేశాయి. దీంతో బజాజ్ ఫైనాన్స్ దాఖలు చేసిన పిటిషన్ ద్వారా రుణదాతలంతా శాట్‌ను ఆశ్రయించారు. తమ నిధులకు రక్షణగా సెక్యూరిటీలను తిరిగి తెప్పించడం లేదా ఎస్క్రో ఖాతాలో ఉంచడమో చేయాలని కోరారు. అయితే ఈ విషయంలో తాము ఏమీ చేయలేమని, సెబీ వద్దకు వెళ్లాలని జస్టిస్ ఎంటీ జోషి, జస్టిస్ సీకేజీ నాయర్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారంలోగా సెబీని సంప్రదించాలనీ సూచించింది.

తెలంగాణ ప్రభుత్వము
అటవీ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. 01/2019-20/M4 తేది: 03-12-2019
పనుల సంఖ్య: (4), పని పేరు: దిగువ సంతకందారు పరిధిలో అర్బన్ ఫారెస్ట్ బ్లాక్ చుట్టూ సీ త్రూ వాల్/చైన్ లింక్ మెష్ ఏర్పాటు చేయుట, రెసిడెన్షియల్ క్వార్టర్ నిర్మాణం, 3.30 కి.మీ.ల పొడవు గల చైన్ లింక్ స్థాపన మరియు ఇతర సివిల్ పనులు. మొత్తం ECV: రూ. 1.68 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్: 09-12-2019న సా. 5.00 గం. నుండి. టెండరు దాఖలు కొరకు చివరి తేది: 22-12-2019న మ. 3.00 గం. సాంకేతిక బిడ్ తెరుచుట: 23-12-2019న మ. 3.30 గం. ధర బిడ్ తెరుచుట: 23-12-2019న సా. 4.00 గం. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్/CF, మహబూబ్‌నగర్ సర్కిల్, మహబూబ్‌నగర్
DIPR R.O.No. 1856 DP/CL/Advt/1/2019-20 తేది: 04-12-2019

తెలంగాణ ప్రభుత్వం
కార్మిక శాఖ, హైదరాబాద్
టెండరు ప్రకటన
LET & F యొక్క G.O.Ms.No. 36, Dated: 03-12-2019 ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ మరియు నాన్ ట్రాన్స్‌పోర్ట్ ఆటో డ్రైవర్స్, హోమ్ గార్డ్స్ మరియు వర్కింగ్ జర్నలిస్ట్‌లకు యాక్సిడెంటల్ డెత్ ఇన్సూరెన్స్ స్కీం కొనసాగించాలని భావిస్తోంది. జారీ చేయబడి, అమలవుతున్న ఈ టెండరు ప్రకటనకు రాష్ట్ర ప్రభుత్వంచే గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం నుండి రూ. 5.00 లక్షలు చెల్లిస్తుంది. (ట్రాన్స్‌పోర్ట్ మరియు నాన్ ట్రాన్స్‌పోర్ట్ ఆటో డ్రైవర్స్, హోమ్ గార్డ్స్, వర్కింగ్ జర్నలిస్ట్ మొత్తం: 12,90,243 మంది). సీల్డ్ టెండర్ల దాఖలుకు ఆఖరి తేది: 16-12-2019న మధ్యాహ్నం 3.00 గం.వరకు. తదుపరిగా టెండర్లు అదే రోజున సాయంత్రం 4.00 గం.కు తెరువబడును. టెండరు వివరాలను జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్, కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం, తెలంగాణ, హైదరాబాద్ వారి నుండి ఉదయం 10.30 గంటలు మరియు సాయంత్రం 5.00 గం. మధ్య పొందవచ్చును. (ఫోన్ నెం. 9492555355)
DIPR R.O.No. 1853-DP/CL/Advt/1/2019-20 తేది: 04-12-2019 సం/- అహ్మద్ నదీమ్, కమిషనర్ ఆఫ్ లేబర్

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: 6-3-655/1/A, సివిల్ సప్లయ్స్ భవన్, సోమాజిగూడ, హైదరాబాద్-82
No.Mktg/M2/3899/2019-20 ఇ-టెండరు ప్రకటన తేది: 04.12.2019
PDS మరియు మధ్యాహ్న భోజనం/వసతి గృహాలు/సంక్షేమ సంస్థల పథకం క్రింద పంపిణీ కొరకు తెలంగాణ రాష్ట్రం యొక్క నిర్దేశించబడిన బఫర్ గోడౌన్ల వద్ద పంపిణీ మరియు రేట్ కాంట్రాక్టుపై స్పెసిఫికేషన్స్ ప్రకారం 50Kgల కొత్త జ్యూట్ బ్యాగుల నందు ప్యాక్ చెయ్యబడి 31-03-2020లోగా పంపిణీ కొరకు ఖరీఫ్ 2019-20 ధాన్యం నుండి FAQ స్పెసిఫికేషన్స్ (టెండరు ప్రకటన నం. MKTG/M2/3899/SPR/2019-20 తేది: 04-12-2019)ను ధృవీకరించే 6,00,000 MTల ముడి బియ్యం మరియు 37,500 MTల స్టీమ్డ్ రూపంలో 1,50,000 MTల సన్న బియ్యం మరియు 1,12,500 MTల ముడి బియ్యం (టెండరు ప్రకటన నం. MKTG/M2/3887/SB/2019-20, తేది:04-12-2019) యొక్క సరఫరా కొరకు తెలంగాణ రాష్ట్రంలోని రైస్ మిల్లర్లను కోరుతూ ఇ-టెండర్ల కొరకు ప్రకటన. ఇ-టెండరు ప్రకటనలను https://tender.telangana.gov.in మరియు www.tscscl.telangana.gov.in లపై చూడవచ్చు. ఇ-టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 05-12-2019న మ. 2.00 గంటల తరువాత. ఇ-టెండరు డాక్యుమెంట్ల యొక్క ఆన్‌లైన్ ఫైలింగ్ కొరకు ముగింపు తేది మరియు సమయం: 16-12-2019న ఉ. 10.30 గం.వరకు.
సం/- పి. సత్యనారాయణ రెడ్డి, IAS (రిటైర్డ్) VC & మేనేజింగ్ డైరెక్టర్

# పిచాయ్‌కే పట్టం

అల్ఫాబెట్ సీఈవోగా నియామకం • గూగుల్ సారథిగానూ కొనసాగనున్న భారత బిడ్డ



'చాలా ఆనందంగా ఉంది. లర్రీ, సర్గేలకు నా కృతజ్ఞతలు. టెక్నాలజీ ద్వారా పెను సవాళ్లను ఎదుర్కోవడంపై అల్ఫాబెట్ సుదీర్ఘ లక్ష్యాల సాధనకు కృషి చేస్తా. అందరి సహకారంతో సంస్థ బలోపేతానికి నా వంతు బాధ్యతల్ని నేను నిర్వర్తిస్తా'
- సుందర్ పిచాయ్, అల్ఫాబెట్/గూగుల్ సీఈవో

**వాషింగ్టన్, డిసెంబర్ 4:** గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్.. అల్ఫాబెట్ సీఈవోగా నియమితులైయ్యారు. ఇకపై గూగుల్‌తోపాటు దాని మాతృ సంస్థ అల్ఫాబెట్‌కూ పిచాయ్ సారథ్యం వహించనున్నారు. ఈ ఇంటర్నెట్ దిగ్గజం వ్యవస్థాపకులు లర్రీ పేజ్, సర్గే బ్రిన్ వైదొలుగడంతో భారత సంతతికి చెందిన పిచాయ్‌కి ఇరు సంస్థల నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు మంగళవారం అల్ఫాబెట్ అధికారికంగా ప్రకటించింది. 47 ఏండ్ల పిచాయ్.. ప్రస్తుతం గూగుల్ సీఈవోగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యవస్థాపకులు తప్పుకున్న వేళ.. సంస్థలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న పిచాయ్‌కే పట్టం కట్టాలని యాజమాన్యం నిర్ణయించింది.



లర్రీ పేజ్ సర్గే బ్రిన్

### పిచాయ్‌పైనే నమ్మకం

2004 ఏప్రిల్ 1 నుంచి గూగుల్‌లో పిచాయ్ పనిచేస్తున్నారు. అంతకుముందు మెకిన్సీ అండ్ కో వద్ద కన్సల్టెంట్‌గా పనిచేశారు. కాగా, పిచాయ్ చేరిన రోజే గూగుల్.. జీమెయిల్‌ను ప్రారంభించడం గమనార్హం. గూగుల్ ఇంటర్నెట్ వ్యాపారంలో ప్రోడక్ట్, ఇంజినీరింగ్ ఇంచార్జిగా పనిచేసిన పిచాయ్.. గూగుల్ క్రోమ్ ఆవిష్కరణలో కీలక పాత్ర పోషించారు. నూతన టెక్నాలజీలను పరిచయం చేయడంలో ఎప్పుడూ ముందుండే పిచాయ్‌కి ఆండ్రాయిడ్ వ్యాపారం పగ్గాలనూ గూగుల్ అందించింది. 2015లో గూగుల్ సీఈవోగా పిచాయ్ నియమితులయ్యారు.

### ఓ శకం ముగిసింది

లర్రీ పేజ్, సర్గే బ్రిన్.. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు. రెండు దశాబ్దాల క్రితం 1997లో స్కాట్ హసన్ అనే మరొకరితో కలిసి గూగుల్‌ను వీరిరువురు స్థాపించారు. ఇంటర్నెట్‌కు మరోపేరుగా గూగుల్‌ను తీర్చిదిద్దడంలో పేజ్, బ్రిన్‌ల పాత్రే కీలకం. నాలుగేండ్ల క్రితం 2015లో అల్ఫాబెట్ సంస్థను సృష్టించగా, గూగుల్‌ను అందులో భాగం చేశారు. అప్పట్నుంచి మాతృ సంస్థకు ఈ ఇద్దరు నేతృత్వం వహిస్తున్నారు. పేజ్ అల్ఫాబెట్ సీఈవోగా, బ్రిన్ అధ్యక్షుడిగా సేవలందించారు.

## హైదరాబాద్-కొచ్చిల మధ్య గోఎయిర్ విమానం



**హైదరాబాద్, డిసెంబర్ 4:** విమాన సేవలు అందించే గోఎయిర్..దేశవ్యాప్తంగా మరో 22 నూతన రూట్లకు సర్వీసులు ఆరంభించబోతున్నది. ఈ నెల 20 నుంచి హైదరాబాద్ నుంచి నేరుగా కొచ్చికి విమాన సర్వీసును నడుపబోతున్నది. కొచ్చిలో సాయంత్రం 7.35 గంటలకు బయలు దేరనున్న జీ8 505 సర్వీసు హైదరాబాద్‌కు రాత్రి 9.10 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో 9.45 గంటలకు బయలుదేరి కొచ్చికి రాత్రి 11.15 గంటలకు చేరుకోనున్నది. వీటితోపాటు బెంగళూరు-కొచ్చి, ఢిల్లీ-వారణాసి, అహ్మదాబాద్-వారణాసి, ఢిల్లీ-ఇండోర్, అహ్మదాబాద్-ఇండోర్‌లతోపాటు ఢిల్లీ-గోవాల మధ్య మరో సర్వీసును ప్రారంభించబోతున్నది.



## కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి జాతీయ స్వచ్ఛత అవార్డు

**హైదరాబాద్, డిసెంబర్ 4:** జాతీయ స్థాయి స్వచ్ఛత ర్యాంకింగ్‌లో కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం అగ్ర స్థానాన్ని దక్కించుకున్నది. పరిశుభ్రత, వ్యర్థాల వినియోగంలో అధునాతన పద్ధతుల అమలుతో స్వచ్ఛత అవార్డును సాధించామని బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి విలేకరులకు తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోక్రియాల్ చేతులమీదుగా కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కార్యదర్శి కోనేరు శివ కాంచన లత అవార్డును అందుకున్నారని చెప్పారు. క్యాంపస్ ప్రాంగణంలో వ్యర్థాల పునర్వినియోగంతోపాటు విద్యార్థుల వసతి గృహాల్లోని వంటశాలల్లో పాటిస్తున్న పరిశుభ్రత, నీటి స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ చర్యలు తమకు ఈ అవార్డును తెచ్చి పెట్టాయన్నారు.

## ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ నష్టం రూ.22,527 కోట్లు

**ముంబై, డిసెంబర్ 4:** నగదు కొరతతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్(ఐఎల్అండ్ఎఫ్ఎస్) భారీ నష్టాలను మూటగట్టుకున్నది. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీకి రూ.22,527 కోట్ల నష్టం సంభవించింది. క్రితం ఏడాది కూడా రూ.333 కోట్లు నష్టపోయింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్రముఖ ఇన్‌ఫ్రా సంస్థకు రూ.824 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గతేడాది ఇది రూ.1,734 కోట్లుగా నమోదైంది. గతేడాది అక్టోబర్‌లో కంపెనీ బోర్డును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ఆర్థిక ఫలితాలను విడుదల చేయడం ఇదే తొలిసారి. మార్చి 31, 2019 నాటికి కంపెనీ వద్ద రూ.4,148 కోట్ల ఆస్తులు ఉండగా, లయబిలిటీలు రూ.18,276 కోట్ల నుంచి రూ.21,083 కోట్లకు పెరిగాయి.

## హాల్‌మార్కింగ్‌తో లాభం

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ అహ్మద్

**హైదరాబాద్, డిసెంబర్ 4:** బంగారు ఆభరణాలపై చట్టబద్ధమైన హాల్‌మార్కింగ్‌తో వినియోగదారులకు లాభాలు చేకూరుతాయని ప్రముఖ నగల వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చైర్మన్ ఎంపీ అహ్మద్ అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా బంగారు నగలకు బీఐఎస్ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడాన్ని ఆయన స్వాగతించారు. ప్రభుత్వ ఆమోదిత ప్రమాణాలను అనుసరించడం వల్ల కొనుగోలుదారుల్లో నమ్మకం పెరుగుతుందని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో అన్నారు. దీనివల్ల అమ్మకాలు కూడా పెరుగుతాయని చెప్పారు. కాగా, ఎలాంటి మోసాలకు తావులేకుండా బంగారు ఆభరణాలపై బార్‌కోడ్‌లు తప్పనిసరి చేయాలని ఈ సందర్భంగా ఆయన కేంద్రానికి సూచించారు.

# జియో కూడా..!

39 శాతం వరకు చార్జీలు పెంచిన సంస్థ • శుక్రవారం నుంచి అమల్లోకి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కూడా ప్రీపెయిడ్ మొబైల్ కాల్, డాటా చార్జీలను 39 శాతం వరకు పెంచింది. ఈ నెల 6 నుంచి అమలులోకి రానున్న కొత్త చార్జీలు ఇతర టెలికం సంస్థలు వసూలు చేస్తున్నదాని కంటే 15 శాతం నుంచి 25 శాతం వరకు తక్కువని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నూతన టారిఫ్‌ల ప్రకారం 84 రోజుల కాలపరిమితి, రోజుకు 1.5 జీబీ డాటా కలిగిన ప్లాన్‌కు రూ.555 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో చెల్లించిన రూ.399తో పోలిస్తే 39 శాతం వరకు అధికం. వీటితోపాటు రూ.153 ప్లాన్‌ను రూ.199కి పెంచిన సంస్థ..రూ.198 ప్లాన్‌ను రూ.249కి, రూ.299ని రూ.349కి, రూ.349ని రూ.399కి, రూ.448ని రూ.599కి, రూ.1,699 ప్లాన్‌ను రూ.2,199కి సవరించింది. అలాగే రూ.98 ప్లాన్‌ను రూ.129కి పెంచింది. 'ఆల్-ఇన్-వన్ పేరుతో ప్రకటించిన ప్లాన్లలో కనీసంగా రోజుకు 1.5 జీబీల డాటా లభించనున్నది. ఈ నెల 1న మొబైల్ ప్లాన్లను 40 శాతం వరకు పెంచనున్నట్లు జియో ప్రకటించిన విషయం తెలిసిందే. వొడాఫోన్-ఐడియా, ఎయిర్‌టెల్‌లు మాత్రం 50 శాతం వరకు చార్జీలను పెంచాయి.

### పోటీ సంస్థల కంటే 25 శాతం చౌక

వొడాఫోన్-ఐడియా, ఎయిర్‌టెల్ అందిస్తున్న ప్లాన్ల కంటే 25 శాతం వరకు తక్కువకే అందిస్తున్నట్లు జియో ప్రకటించింది. నెల కాలపరిమితి కలిగిన పలు ప్లాన్‌పై జియో రూ.199 నుంచి 349 వసూలు చేస్తుండగా, అదే ఎయిర్‌టెల్ రూ.248 నుంచి రూ.398 వరకు, వొడాఫోన్-ఐడియా రూ.249 నుంచి రూ.399 వరకు విధిస్తున్నది. జియో మాత్రం రూ.399, రూ.444 రెండు నెలల ప్లాన్లను కస్టమర్లకు అందిస్తున్నది. అలాగే మూడు నెలల ప్లాన్లపై జియో రూ.555 నుంచి రూ.599 వరకు, ఎయిర్‌టెల్ రూ.598 నుంచి రూ.698 వరకు, వొడాఫోన్ ఐడియా రూ.599 నుంచి రూ.699 వరకు వసూలు చేస్తున్నాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో టెలికం సంస్థలు చార్జీల పెంచడానికి సిద్ధమయ్యాయి.

**జియో నూతన ప్లాన్ల వివరాలు**

| క్యాటగిరీ | ప్లాన్ చార్జి(రూ.లో) | ప్లాన్ల ప్రయోజనాలు: డాటా | వాయిస్ కాల్స్ (నిమిషాలు) | కాలపరిమితి (రోజులు) |
|---|---|---|---|---|
| ఒక నెల | 199 | 1.5జీబీ/రోజుకు | 1000 | 28 |
| | 249 | 2జీబీ/రోజుకు | 1000 | 28 |
| | 349 | 3 జీబీ/రోజుకు | 1000 | 28 |
| రెండు నెలలు | 399 | 1.5జీబీ/రోజుకు | 2000 | 56 |
| | 444 | 2జీబీ/రోజుకు | 2000 | 56 |
| మూడు నెలలు | 555 | 1.5జీబీ/రోజుకు | 3000 | 84 |
| | 599 | 2జీబీ/రోజుకు | 3000 | 84 |
| ఏడాది | 2199 | 1.5జీబీ/రోజుకు | 12000 | 365 |
| చౌక ప్లాన్ల వివరాలు | 129 | 2జీబీ | 1000 | 28 |
| | 329 | 6జీబీ | 3000 | 84 |
| | 1299 | 24జీబీ | 12000 | 365 |

## నేడే ఆర్బీఐ పరపతి సమీక్ష

వడ్డీరేట్లు మరో పావు శాతం తగ్గించే అవకాశం



**ముంబై, డిసెంబర్ 4:** రిజర్వ్ బ్యాంక్ మరోదఫా వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ 26 త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో గురువారం ప్రకటించనున్న పరపతి సమీక్షలో సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను మరో పావు శాతం కోత విధించే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నాయి. ఒకవేళ తగ్గిస్తే ప్రస్తుత సంవత్సరంలో వడ్డీరేట్లును తగ్గించడం ఇది ఆరోసారి కానున్నది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ఆర్బీఐ వడ్డీరేట్లను 135 బేసిస్ పాయింట్లను తగ్గించగా..బ్యాంకులు మాత్రం 29 బేసిస్ పాయింట్లు తగ్గించి చేతులు దులుపుకున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు పెట్టుబడులకు ఉత్సాహాన్ని ఇచ్చాయని, ముఖ్యంగా కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు, ఎఫ్‌డీఐ నిబంధనలు మరింత సరళతరం చేయడం, నిలిచిపోయిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకోసం ప్రత్యేక ప్యాకేజీ వంటి నిర్ణయాలు వృద్ధికి ఊతమివ్వనున్నాయన్నారు.



## మిసెస్ ఇండియా- 2019
# రన్నరప్‌గా హైదరాబాదీ

- పురస్కారాన్ని దిశకు అంకితమిచ్చిన విజేత చైతన్య పోలోజు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మిసెస్ ఇండియా– 2019 పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన శ్రీమతి చైతన్య పోలోజు.. తనకు దక్కిన పురస్కారాన్ని దిశకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. మంగళవారం రాత్రి అమెరికాలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఎన్‌ఆర్‌ఐ మహిళ ఈ కిరీటాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిరీటాన్ని అందుకోవడం ఆనందంగా ఉన్నా.. దిశ ఘటన తన మనసును బాధించిందని చెప్పారు. బంజారా మహిళా ఎన్జీవో, డాక్టర్ ఆనంద్ చేస్తున్న సామాజిక కార్యక్రమాల్లో చైతన్య తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవాభావాన్ని చాటుతున్నారు.

## తెలంగాణ పథకాలపై
# విదేశీ జర్నలిస్టుల అధ్యయనం

- హైదరాబాద్ చేరుకున్న సెంట్రల్ యూరోపియన్ దేశాల బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అధ్యయనం చేసేందుకు సెంట్రల్ యూరోపియన్ దేశాలకు చెందిన జర్నలిస్టులు, ఎడిటర్ల బృందం బుధవారం హైదరాబాద్‌లో పర్యటించింది. పోలాండ్, చెక్, హంగేరి, క్రోయేషియా, రొమేనియా, బల్గేరియాకు చెందిన సీనియర్ జర్నలిస్టులకు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి విజయ్‌గోపాల్, విదేశాంగ కార్యదర్శి ఎఫ్‌ఏ అహ్మద్ స్వాగతం పలికారు. ఈ బృందం రెండు రోజులపాటు హైదరాబాద్‌లో పర్యటిస్తుంది. పథకాల తీరును అధ్యయనం చేయడంతోపాటు బృందం సభ్యులు గోల్కొండ సమాధులు, లైట్ అండ్‌షోను తిలకిస్తారు. గురువారం టీహబ్, జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శిస్తారు.


బుధవారం గోల్కొండ కోటను సందర్శించిన విదేశీ జర్నలిస్టుల బృందం



## షోలాపూర్ మేయర్‌గా తెలంగాణ మహిళ

- ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన యెన్నం కాంచన ఎన్నిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహారాష్ట్రలోని షోలాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా తెలంగాణకు చెందిన మహిళ ఎన్నికయ్యారు. షోలాపూర్ డివిజన్ నుంచి వరుసగా నాలుగుసార్లు గెలిచిన యెన్నం కాంచన (బీజేపీ) బుధవారం షోలాపూర్ మేయర్ పీఠాన్ని అధిరోహించారు. కాంచన స్వగ్రామం ఉమ్మడి మెదక్ జిల్లాలోని సదాశివపేట. చాలా సంవత్సరాల కిందటే వారి కుటుంబం షోలాపూర్‌కు వెళ్లింది. కాంచన భర్త యెన్నం రమేశ్ దుప్పట్ల వ్యాపారం చేస్తుంటారు. కాంచన 2002లో మహారాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశించారు. మహారాష్ట్రలో మేయర్‌గా ఎన్నికైన తొలి తెలంగాణ మహిళ కాంచన కావడంగమ నార్హం.


ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

## విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి

- ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను పెంపొందించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై బుధవారం ఆయన అధికారులతో ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధికి ఎన్నో అవకాశాలున్నాయని, ప్రణాళికాబద్ధ కార్యాచరణతో వాటిని నిరుద్యోగ యువతకు అందించాలని తెలిపారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా, అధికారులు మధుకర్‌బాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ప్రమాద బీమా పథకం ఏడాది పొడిగింపు

కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ: ఆటోడ్రైవర్లు,** హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని రాష్ట్రప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 21 నుంచి సంవత్సరంపాటు కొనసాగుతుంది. ఈ పథకం ప్రకారం ప్రమాదంలో మరణించిన ఆటోడ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా వస్తుందని కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శశాంక్‌గోయల్ బుధవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఐటీశాఖ ముఖ్యకార్యదర్శికి స్వీడన్ అవార్డు

- ఢిల్లీలో అందుకున్న జయేశ్‌రంజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ స్వీడన్ దేశం అందించే ప్రముఖ పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్'ను లభించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుకు 400 ఏండ్ల చరిత్ర ఉన్నది. స్వీడన్‌తో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషిచేసిన విదేశీయులకు దీనిని అందజేస్తారు. తెలంగాణలో స్వీడన్ దేశ పెట్టుబడులు పెట్టడంలో, ఇండియాలోనే మొదటి ఐకియా స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించడంలో కృషిచేసినందుకుగానుజ యేశ్‌రంజన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

## స్పెషల్‌గ్రేడ్ పదోన్నతులు కల్పించండి

- సీఎస్, స్పెషల్ సీఎస్‌కు డిప్యూటీ కలెక్టర్ల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అర్హులైన డిప్యూటీ కలెక్టర్లందరికీ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు విజ్ఞప్తిచేశారు. సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ఉపాధ్యక్షురాలు రమాదేవి నేతృత్వంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లు వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 50 పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఎస్, స్పెషల్ సీఎస్ హామీ ఇచ్చినట్టు తెలిపారు.

## ఏపీ మాజీ మంత్రి నారాయణపై దాడి


అనంతపురంలో నారాయణపై దాడికి పాల్పడుతున్న విద్యార్థి సంఘాల నేతలు

**అనంతపురం:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణపై విద్యార్థి సంఘాల నేతలు దాడిచేశారు. నారాయణ అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. నారాయణ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆయనను నిలదీశారు. ఈ సందర్భంగా నారాయణ అనుచరులకు, విద్యార్థి నాయకులకు మధ్య తోపులాట జరిగింది. నారాయణ అంగీ చిరిగిపోగా, ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. దీంతో ఆయన అనంతపురం పర్యటనను అర్ధాంతరంగా రద్దుచేసుకొని వెనుదిరిగారు.

## బీజేపీకి ఎప్పుడూ దూరం కాలేదు: పవన్ కల్యాణ్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ– జనసేన విలీనం దిశగా రాజకీయ ప్రకటనలు వెలువడుతున్నాయి. పవన్ కల్యాణ్ మూడురోజుల తిరుపతి పర్యటనలో సీఎం జగన్‌పై విమర్శలు ఎక్కుపెట్టి.. బీజేపీని ఆకాశానికెత్తారు. ప్రస్తుత రాజకీయాలకు అమిత్ షా, మోదీ లాంటి వ్యక్తులే కరెక్టు అన్న పవన్.. బీజేపీకి తాను ఎప్పుడూ దూరం కాలేదని, కలిసే ఉన్నానని చెప్పారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమిత్ షా అంటే తనకు చాలా గౌరవమని చెప్పారు. కేంద్రంలో బీజేపీ మంచిపాలన అందిస్తున్నదని కితాబిచ్చారు. బీజేపీలో జనసేన విలీనంపై అడగగా ఇప్పుడే చెప్పలేనని సమాధానమిచ్చారు. మరోవైపు ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తుంటే.. మంత్రులు ఆయనపై మూకుమ్మడిగా దాడిచేయడం సరికాదని హితవుపలికారు.

## విడిది రాజధాని నిర్మించాలి: టీజీ వెంకటేశ

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కొనసాగించాలా లేదా అన్నది జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, అప్పటివరకు కశ్మీర్ తరహాలో రాయలసీమలో విడిది రాజధానినైనా (శీతాకాల లేక వేసవి) నిర్మించాలని రాజ్యసభసభ్యుడు, బీజేపీనేత టీజీ వెంకటేశ్ డిమాండ్‌చేశారు. బుధవారం ఢిల్లీలో మాట్లాడుతూ.. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుచేసి తీరాలన్నారు.

## విశాఖలో మహిళపై యాసిడ్ దాడి

**విశాఖపట్నం:** ఏపీలోని విశాఖపట్నంలో ఓ వివాహితపై యాసిడ్ దాడి జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వివాహిత (26) సమతానగర్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి బుధవారం వచ్చారు. సాయంత్రం ఇద్దరూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి వివాహితపై యాసిడ్ చల్లి పరారయ్యాడు. ఆమె మోచేయి, ఛాతి, నడుము భాగాల్లో గాయాలయ్యాయి. బాధితురాలిని గాజువాకలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితినిల కడగా ఉన్నది. దాడికి కారణాలు తెలియలేదు.

# మూషిక జింకలకు ఊపిరి

- ప్రయోగం విజయవంతంకావడం దేశానికే గర్వకారణం
- కేంద్ర అటవీశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ నాగి ప్రశంసలు


బుధవారం హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్క్‌లో మౌస్ డీర్ బ్రీడింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎంఎస్ నాగి, క్యురేటర్ క్షితిజ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో మూషిక జింకల సంతతిని రక్షించడానికి జరుగుతున్న ప్రయోగం అద్భుతంగా ఉన్నదని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎంఎస్ నాగి ప్రశంసించారు. దేశంలో అంతర్ధాన దశకు చేరుకున్న అత్యంత అరుదైన మూషిక జింకలకు తెలంగాణలో తిరిగి ఊపిరిపోసి అడవుల్లో వదలడం శుభపరిణామమని చెప్పారు. తెలంగాణ అటవీశాఖ, సీసీఎంబీ ల్యాకోన్స్ ఆధ్వర్యంలో జరిగిన మూషిక జింకల సంతానవృద్ధి ప్రయోగం విజయవంతంకావడం దేశానికే గర్వకారణమని ఆయన కితాబిచ్చారు. బుధవారం హైదరాబాద్ నెహ్రూ జులాజికల్ పార్క్‌లో మౌస్ డీర్ బ్రీడింగ్ సెంటర్‌ను, జూపార్క్‌ను నాగి సందర్శించి, నిర్వహణ పద్ధతులను పరిశీలించారు. జంతువులకు కల్పిస్తున్న వసతులు, పరిశుభ్రత, ఆహారభద్రత ఇలా అన్ని అంశాల్లో జూపార్క్ ముందంజలో ఉన్నదని కొనియాడారు. జంతువుల చికిత్సకు అత్యాధునిక పరికరాలను వెంటనే మంజూరుచేస్తామని ఆయన హామీఇచ్చారు. నెహ్రూ జూను దేశంలోనే మోడల్ జూగా అభివృద్ధి పరచడానికి తీసుకుంటున్న చర్యలను, మూషిక జింకల సంతానాన్ని వృద్ధిచేసి వాటిని తిరిగి అడవుల్లో వదిలే ప్రక్రియను క్యూరేటర్ క్షితిజ.. నాగికి వివరించారు. ఇప్పటివరకు 160 వరకు మూషిక జింకలను అడవుల్లో వదిలినట్టు చెప్పారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంట అసిస్టెంట్ క్యురేటర్ జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

# నేవీ అమరులకు ఘన నివాళి


సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద నేవీ అధికారి పుష్పాంజలి.. నేవీ డే సందర్భంగా విశాఖ సముద్రతీరంలో ప్రదర్శన

**కంటోన్మెంట్:** నేవీ డే సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఉన్న అమరవీరుల స్తూపానికి బుధవారం నావికాదళ ఉన్నతాధికారులు, సైనికులు నివాళులర్పించారు. 1971 డిసెంబర్ 4న యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ఏటా ఈ రోజున దేశవ్యాప్తంగా నావికాదళ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా 8న ఐకియాలో నావికాదళ నావల్ బ్యాండ్ కచేరీ, 20 నుంచి 22 వరకు రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్టు రక్షణశాఖ పీఆర్వో ఓ ప్రకటనలో తెలిపారు.

**విశాఖలో ఘనంగా నేవీ డే**

**విశాఖపట్నం:** 1971లో పాకిస్థాన్‌పై యుద్ధంలో గెలుపునకు తూర్పు నావికా దళం కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్‌పై గెలుపునకు ప్రతీకగా ఏటా డిసెంబర్ 4వ తేదీన నేవీ డేను నిర్వహిస్తున్నారు. తూర్పు నావి కా దళం ప్రారంభమై 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఆర్కే బీచ్‌లో నేవీ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# కమ్యూనిటీ రేడియో ప్రజల గొంతుక

- ప్రాంతీయ భాష లక్ష్యంగా పనిచేయాలి
- టీ-సాట్ సెమినార్‌లో నిపుణులు


బుధవారం హైదరాబాద్‌లోని టీ-సాట్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఈవో శైలేశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కమ్యూనిటీ రేడియోలు (సీఆర్) ప్రజల గొంతును ప్రతిబింబించేలా, ప్రాంతీయ భాషలు, భావాలే లక్ష్యంగా పనిచేయాలని పలువురు నిపుణులు, వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని టీ-సాట్ కార్యాలయంలో బుధవారం 'కమ్యూనిటీ రేడియో నిర్వహణ' అంశంపై సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. యునెస్కో కమ్యూనిటీ మీడియా చైర్, ప్రొఫెసర్ వినోద్ పావురాల మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 251 సీఆర్ స్టేషన్లు ఉండగా, మరో 118కి కేంద్రం అనుమతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. ప్రొఫెసర్ కంచన్ మాలిక్ మాట్లాడుతూ.. ప్రాంతీయ భాషల్లో సీఆర్‌కు మంచి ఆదరణ లభించిందని, 'రేడియో బుందేల్ ఖండ్' పేరుతో ప్రారంభమైన సీఆర్ అందుకు ప్రత్యేక ఉదాహరణ అన్నారు. లిపిలేని 'కచ్' భాషలో ప్రారంభించిన సీఆర్ సైతం ఆదర్శమని తెలిపారు. ప్రొఫెసర్ బెల్వాడీ వాసుకీ మాట్లాడుతూ.. లాభాపేక్ష లేకుండా సీఆర్‌ను ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. సీఆర్ సమాచారానికి www.uccommedia.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. శైలేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఆర్‌లో ఉపయోగించే కంటెంట్‌తోపాటు విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పాఠ్యాంశాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు పోలీస్ ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీ ఏ భాస్కర్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సంధ్య, ఎస్సీ కార్పొరేషన్ జీఎం ఆనంద్‌కుమార్, సాంఘిక, గురుకుల, మహిళా, శిశు సంక్షేమ, చేనేత, గొర్రెల పెంపకం, జైళశాఖ అధికారులు పాల్గొన్నారు.

# పుంజుకుంటున్న యాసంగి సాగు

## ఇప్పటివరకు 6.32 లక్షల ఎకరాల్లో మొదలు.. ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి పంటల సాగు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నది. అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 31.95 లక్షల ఎకరాలకు.. ఇప్పటివరకు 6.32 లక్షల ఎకరాల్లో పంటలసాగు మొదలైనట్టు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి బుధవారం నివేదించింది. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 3.25 లక్షల ఎకరాలు కాగా ఇప్పటికి 2.5 లక్షల ఎకరాల్లో సాగైంది. పప్పుధాన్యాల విస్తీర్ణం 2.97 లక్షలకు 1.87 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టగా, వరి విస్తీర్ణం 17.07 లక్షల ఎకరాలకు 17,500 ఎకరాల్లో మాత్రమే నాట్లుపడ్డాయి. ఇప్పుడిప్పుడే వరినాట్లు మొదలయ్యాయని, నెలాఖరుకు పుంజుకుంటాయని అంటున్నారు.

**ఆదిలాబాద్‌లో 103 శాతం సాగు**

యాసంగి పంటలు అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో సాగయ్యాయి. జిల్లాలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54,827 ఎకరాలకు, ఏకంగా 56,307 (103 శాతం) ఎకరాల్లో పంటలసాగు చేపట్టడం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లాలో 87 శాతం, వికారాబాద్ జిల్లాలో 73 శాతం పంటలు సాగైనట్టు నివేదిక తెలిపింది. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో మొదలు పెట్టలేదని వ్యవసాయశాఖ తెలిపింది. పెద్దపల్లి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భువనగిరి యాదాద్రి జిల్లాల్లో ఒక శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండుశాతం, మేడ్చల్ జిల్లాలో ఐదుశాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

# మంత్రి కేటీఆర్ ఔదార్యం

- ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఓ పాప వైద్యానికి సహాయం
- ఖర్చులు భరిస్తామని హామీ

**చింతకాని:** రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.. ట్విట్టర్ వేదికగా ఓ చిన్నారి వైద్య ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన జానీసాహెబ్, సలీమాబేగంల రెండో కూతురు హజీరా తస్నాయ్ పుట్టుకతోనే ఎముకలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నది. ఈ చిన్నారికి గత కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో చికిత్సచేయిస్తున్నారు. పాప చికిత్సకు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. సాంకేతిక కారణాలతో వారికి తెల్ల రేషన్ కార్డు మంజూరుకాకపోవడంతో ఆరోగ్యశ్రీ కూడా వర్తించ లేదు. ఈ పరిస్థితిపై అదే మండలానికి చెందిన రేపల్లెవాడకు చెందిన యువకుడు పోతగాని పుల్లారావు మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ వేదికగా సమస్యను తెలుపడంతో గంటల వ్యవధిలోనే కార్యాలయ సిబ్బంది స్పందించి యువకునికి, తల్లిదండ్రులకు ఫోన్ చేసి వైద్య ఖర్చులు భరిస్తామని హామీఇచ్చారు. మంత్రి కేటీఆర్‌కు పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


బుధవారం డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లు

# బస్సులో బంగారం స్మగ్లింగ్

## చార్మినార్ వద్ద వ్యక్తి నుంచి 1.7 కిలోల బంగారం స్వాధీనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధికారుల కండ్లుగప్పి బంగారం దొంగరవాణాకు స్మగర్లు కొత్తదార్లు ఎంచుకుంటున్నారు. బస్సులో బంగారం తరలిస్తున్న ఓ వ్యక్తి.. డీఆర్‌ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులకు చిక్కాడు. ముందస్తు సమాచారం మేరకు డీఆర్‌ఐ బుధవారం చార్మినార్ వద్ద ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతను చెన్నై నుంచి తిరుపతికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు బంగారాన్ని తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సోదాలు జరుపగా నిందితుడు పట్టుబడ్డాడు. అతని వద్ద రూ. 66,64,000 విలువ చేసే 1.7 కిలోల విదేశీ మార్క్ బంగారు బిస్కెట్లు లభించాయి. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో కస్టమ్స్ చట్టాల కింద అతన్ని అరెస్టు చేసినట్టు డీఆర్‌ఐ జోనల్ అదనపు డీజీ డీపీ నాయుడు తెలిపారు.

# గురుకులాల్లో ఎక్కువ మంది పేదలే

- 'నర్చర్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఎక్కువశాతం పేద విద్యార్థులే చదువుతున్నారని ఎంసీహెచ్చార్డీ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. బుధవారం ఎంసీహెచ్చార్డీలో 'నర్చర్ ది ఫ్యూచర్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఐఎస్‌ఎస్, ఐఈఎస్ ట్రైనీ అధికారులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంసీహెచ్చార్డీలో శిక్షణపొందుతున్న ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్ (ఐఎస్‌ఎస్), ఇండియన్ ఎకనామిక్స్ సర్వీసెస్ (ఐఈఎస్) ట్రైనీ అధికారులు.. నిర్మాణ్ సంస్థ సహకారంతో బోరబండ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మెంటర్‌గా వ్యవహరించడానికి ముందుకొచ్చారు. పదోతరగతి విద్యార్థినులకు పాఠశాల బ్యాగ్, వ్యక్తిత్వవికాసానికి సంబంధించిన పుస్తకాలు, డిక్షనరీ, కాలిక్యులేటర్, పరీక్ష ప్యాడ్, శానిటరీ న్యాప్‌కిన్లు, పెన్నులు ఉన్న కిట్లను అందించారు. ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక మెంటర్ ఉంటారు. వారు నిత్యం విద్యార్థులతో మాట్లాడుతూ సందేహాలు నివృత్తిచేస్తారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి అబ్దుల్‌వాహిద్, నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకురాలు, సీఈవో మయూర్ పాట్నా, సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, విద్య, బోరబండ బాలికల పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి. చిత్రంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారు.

# ఆయిల్‌పాం సాగుకు అనుకూలం

- తెలంగాణలో సాగు విస్తరణకు ప్రణాళికలు
- ఈ నెల 28 నుంచి కేంద్ర కమిటీ పర్యటన
- వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ఆయిల్‌పాం సాగుకు తెలంగాణ అనుకూలమని, రాష్ట్రంలో ప్రస్తుతం ఖమ్మం, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 50వేల ఎకరాల్లో సాగుచేస్తున్నట్టు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. హైదరాబాద్‌లో ఆయిల్‌పాం గెలల ధర నిర్ణయానికి ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. తెలంగాణలో ఆయిల్‌పాం దిగుబడి సగటున హెక్టారుకు 15 టన్నుల వరకు ఉండగా.. అత్యధికంగా 25 టన్నుల వరకు వస్తుందని తెలిపారు. సగటున 16 కిలోల తలసరి నూనె వినియోగంతో, తెలంగాణలోని 4 కోట్ల జనాభాకు 6.4 లక్షల టన్నుల నూనె అవసరమని, రాష్ట్ర అవసరాలకన్నా వంటనూనె ఉత్పత్తి 3 లక్షల టన్నులు తక్కువుందని చెప్పారు. ఇందులో పామాయిల్ వాటా 1.80 లక్షల టన్నుల వరకు ఉండొచ్చని తెలిపారు. ఆయిల్‌పాం సాగు లక్ష ఎకరాలకు విస్తరిస్తే 60 శాతం వరకు దిగుమతులను అధిగమించవచ్చని చెప్పారు. దేశంలోని ఆయిల్‌పాం ఉత్పత్తిలో తెలంగాణ రెండో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 18 జిల్లాల్లోని 206 మండలాల్లో 2.78 లక్షల హెక్టార్లు ఆయిల్‌పాం సాగుకు అనువుగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ మంత్రి ద్వారా ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ కమిటీని ఈ నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించి ఆయిల్‌పాం సాగు అవకాశాలపై ఒక నివేదిక ఇస్తుందన్నారు. 2019–20 సంవత్సరానికి ఆయిల్‌పాం గెలల ధర నిర్ణయానికి రైతుల కోరిక మేరకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న అప్పారావుపేట ఫ్యాక్టరీ సాధించిన క్రూడ్ పామాయిల్ రికవరీ శాతాన్ని పరిగణనలోకి తీసుకుని 18.45 శాతంగా నిర్ణయించామని తెలిపారు. దీంతో రైతులకు అధిక ధర లభిస్తుందన్నారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ నిర్మల, ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామ్‌రెడ్డి, అధికారులు, ఆయిల్‌పాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 5 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

# కరకరలాడే కిచెన్ ఫ్రై!

నాన్‌వెజ్.. ప్రతివారం రొటీన్‌గా తిని బోర్ కొడుతుంటుంది చాలామందికి. ఒకసారైనా వీటితో స్పెషల్ చేయలేమా అనిపిస్తుంది. గ్రేవీలకే పరిమితం అవుతున్న మటన్, చికెన్‌లతో ఈ సారి కొత్తగా ఫ్రై చేసి చూడండి. ఇందులో వెజ్ కూడా ట్రై చేయవచ్చు. అయితే వీటిని ఫ్రై ఎలా చేయాలి అనుకుంటున్నారా? వెజ్, నాన్‌వెజ్ ఫ్రైలలో కొన్నింటిని అందిస్తున్నాం. మీరూ ప్రయత్నించండి.



## మటన్ రోస్ట్

**కావాల్సినవి:**

మటన్ (లేతగాఉండే) : 250 గ్రా.
అల్లం ముక్కలు : 2 టీస్పూన్లు
ఉల్లిగడ్డ : 2 టీస్పూన్లు
పచ్చిమిర్చి : 5
కారం : 2 టీస్పూన్లు
పసుపు : 1 టీస్పూన్
అల్లంవెల్లుల్లి పేస్ట్ : 1 టీస్పూన్
నూనె : సరిపడా
మిరియాల పొడి : 1 టీస్పూన్

**తయారీ:**

కుక్కర్‌లో మటన్, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, పసుపు, కొంచెం నూనె వేసి 5 విజిల్స్ వచ్చేవరకు ఉడికించుకోవాలి. ఉడికించిన మటన్‌ను నూనె పోసిన కడాయిలో రోస్ట్ చేసుకోవాలి. మరొక కడాయిలో నూనె వేడిచేసి అల్లం, కరివేపాకు, కొత్తిమీర, ఉల్లిగడ్డ ముక్కలు వేసి దోరగా వేయించి రోస్ట్ చేసిన మటన్‌ను అందులో వేసుకోవాలి. మిరియాలపొడి, కొత్తిమీరతో గార్నిష్ చేసుకొని సర్వ్ చేసుకుంటే మటన్ రోస్ట్ టేస్ట్ అదిరిపోతుంది.



## పుట్టగొడుగుల వేపుడు

**కావాల్సినవి:**

అల్లంవెల్లుల్లి : 1 టీస్పూన్
పుట్టగొడుగులు: 250 గ్రా.
కారం : 1 టీస్పూన్
మైదాపిండి : 1 టీస్పూన్
శనగపిండి: 1 టీస్పూన్
కార్న్‌ఫ్లవర్: 3 టీస్పూన్
పచ్చిమిర్చి : 5 ముక్కలు
కరివేపాకు, కొత్తిమీర: సరిపడా
నూనె : సరిపడా
ఉప్పు : తగినంత

**తయారీ:**

గిన్నెలో పుట్టగొడుగులు, ఉప్పు వేసి ఉడికించుకోవాలి. ఆ మిశ్రమంలో కారం, ఉప్పు, మైదాపిండి, శనగపిండి, అల్లంవెల్లుల్లి, కార్న్ ఫ్లవర్ వేసి కలుపుకోవాలి. కడాయిలో నూనె పోసి ఈ మిశ్రమాన్ని డీప్‌ఫ్రై చేసుకోవాలి. నూనెలో పచ్చిమిర్చి కరివేపాకు, కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. వేడివేడి పుట్టగొడుగుల వేపుడుని ప్లేట్‌లో సర్వ్ చేసుకొని తింటే కడుపునిండిపోతుంది.



## రొయ్యల బొద్ది

**కావాల్సినవి:**

చిన్న రొయ్యలు : 250 గ్రా.
కారం : 2 టీస్పూన్లు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ : 1 టీస్పూన్,
శనగపిండి: 3 టీస్పూన్
కార్న్‌ఫ్లవర్: 1 టీస్పూన్, నూనె : 1 లీ.
పచ్చిమిర్చి: 5 ముక్కలు
కరివేపాకు, కొత్తిమీర: సరిపడా
ఉప్పు : తగినంత

**తయారీ:**

ఒక గిన్నెలో రొయ్యలుతీ సుకొని అందులో కారం, ఉప్పు, అల్లంవెల్లుల్లిపేస్ట్,శన గపిండి, కార్న్‌ఫ్లవర్ వేసి కలుపుకొని 10 నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. తర్వాత కడాయిలో నూనె పోసిక లిపిన మిశ్రమంను డీప్‌ఫ్రైచే సుకోవాలి. అదే నూనెలోపచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీరనుఫ్రై చే సుకొవాలి. ఈ ఫ్రైను రొయ్యల బొద్దితో కలిపి సర్వ్ చేసుకొని తింటే ఆ రుచే వేరు.



## కోడి చిప్స్

**కావాల్సినవి:**

చికెన్ బ్రెస్ట్‌పీస్: 300 గ్రా.
అల్లంవెల్లుల్లి పేస్ట్ : 1 టీస్పూన్
కార్న్‌ఫ్లవర్: 3 టీస్పూన్లు
మైదాపిండి: 1 టీస్పూన్
శనగపిండి: 1 టీస్పూన్
నిమ్మరసం: పావు టీస్పూన్
చాట్‌మసాలా : 1 టీస్పూన్
కారం : 2 టీస్పూన్లు
పచ్చిమిర్చి: 5 ముక్కలు
కరివేపాకు, కొత్తిమీర: సరిపడా
ఉప్పు : తగినంత

**తయారీ:**

చికెన్ బ్రెస్ట్‌పీస్‌ను శుభ్రం చేసుకొని పలుచగా కట్ చేసుకోవాలి. గిన్నెలో చికెన్ ముక్కలు, అల్లంవెల్లుల్లి పేస్ట్, కార్న్‌ఫ్లవర్, మైదాపిండి, శనగపిండి, నిమ్మరసం, కారం, ఉప్పు వేసి 10 నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసి కలిపిన మిశ్రమాన్ని డీప్‌ఫ్రై చేసుకోవాలి. పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీరను నూనెలో వేయించి చాట్‌మసాలాతో సర్వ్ చేసుకొంటే ఎంతో రుచికరమైన కోడిచిప్స్ రెడీ!



## మొక్కజొన్న, వెల్లుల్లి వేపుడు

**కావాల్సినవి:**

మొక్కజొన్న కంకులు : 250 గ్రా.
వెల్లుల్లి ముక్కలు : 1 టీస్పూన్
కారం : సరిపడా, పచ్చిమిర్చి: 5
కరివేపాకు, కొత్తిమీర: సరిపడా
కాన్‌ఫ్లవర్: 3 టీస్పూన్లు
మైదాపిండి: 1 టేబుల్‌స్పూన్
నూనె : సరిపడా, ఉల్లిగడ్డ : 3
ఉప్పు : తగినంత

**తయారీ:**

ముందుగా గిన్నెలో నీరు పోసి సరిపడా ఉప్పు వేసుకొని మొక్కజొన్న కంకులను ఉడికించుకోవాలి. వాటిని చిన్నముక్కలుగా కట్ చేసుకోవాలి. మరొక గిన్నెలో సరిపడా ఉప్పు, కారం, మిరియాల పొడి, మైదాపిండి, కాన్‌ఫ్లవర్ వేసి బాగా కలుపుకోవాలి. కడాయిలో కొంచెం నూనె పోసి కలిపిన మిశ్రమంను డీప్‌ఫ్రై చేసుకోవాలి. ఈ క్రమంలో మరొక గిన్నె తీసుకొని అందులో 2 టీస్పూన్ల నూనె వేసి పచ్చిమిర్చి, వెల్లుల్లి ముక్కలు, ఉల్లిగడ్డ ముక్కలు, కరివేపాకు వేసి దోరగా వేయించుకోవాలి. దోరగా వేగిన తర్వాత డీప్‌ఫ్రై చేసుకొన్న మిశ్రమం, మొక్కజొన్నముక్కలు కలుపుకొని ఉప్పు, కారం సరిచూసుకోవాలి. తర్వాత కొత్తిమీరతో సర్వ్ చేసుకుంటే ఎంతో రుచికరమైన మొక్కజొన్న ఫ్రై తయారయినట్లే.



**సతీష్**
ఎగ్జిక్యూటివ్ చెఫ్
కృష్ణపట్నం
జూబ్లీహిల్స్, రోడ్ నం. 36
హైదరాబాద్

## వంటింటి చిట్కాలు



- ఇడ్లీ, వడ, దోశ పిండి ఉబ్బుగా రావాలంటే చల్లటి నీళ్లు పోసి మిక్సీ పట్టాలి.
- వంటింట్లో ఈగలు ఎక్కువగా వస్తుంటే ఒక ప్లేట్‌లో పుదీనా ఆకుల్ని పెడితే చాలు.
- ఫ్రిజ్‌లో పెట్టిన వస్తువులు వాసన రావొద్దంటే.. బ్రెడ్‌ను ముక్కలు చేసుకొని మూలల్లో పెడితే చాలు
- చపాతీ పిండిలో గోరువెచ్చని పాలు కలిపితే మెత్తగా వస్తాయి.
- ఫ్రైడ్ రైస్ చేసుకునేటప్పుడు రైస్ పొడి పొడిగా ఉండాలంటే అన్నంఉ డికించేటప్పుడుటీసూ ్పన్ నూనె వేయాలి.
- బియ్యం ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే బోరిక్ పౌడర్ కలపాలి.

## పట్టుబట్టలపైమ రకలా?



- పట్టుబట్టల మీద కాఫీ లేదా టీ మరకలు పడితే కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను పూస్తే మరకలు పోతాయి. అప్పటికీ పోకపోతే వేడి నీటిలో కొద్దిగా హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి ఆ నీటిలో ఉతకాలి. పట్టుబట్టల మీద చాక్లెట్ మరకలు పడితే వేడినీటిలో జాడించి ఉతికితే పోతాయి. పెరుగు, వెన్న వంటి మరకలు పడితే మరకపై ఒక చుక్క కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను ఉపయోగించాలి.
- పట్టుబట్టల మీద ఇంక్ లేదా లిప్‌స్టిక్ మరకలు పడితే ఆ భాగంలో పేపర్ టవల్‌ను ఉంచి వెనుకనుంచి డ్రైక్లీనింగ్ ద్రావణం లేదా ఆల్కహాల్ పూయాలి. మరక పూర్తిగా పోయే వరకు నీటిని వాడరాదు. అదే నెయిల్ పాలిష్ పడితే ఆ భాగం వరకు అసిటోన్‌లో ముంచితే సరిపోతుంది.
- బురద మట్టి మరకలు పడితే పట్టువస్త్రాన్ని ఆరనిచ్చి కార్బన్ టెట్రాక్లోరైడ్‌తో తుడిచి ఉతికితే సరిపోతుంది. షూ పాలిష్ మరకలు పడితే కొద్దిగా లిక్విడ్ డిటర్జెంట్ వేసి రుద్ది ఆ తర్వాత ఆల్కహాల్ పూయాలి.
- పట్టుబట్టలను ప్లాస్టిక్ సంచుల్లో లేదా పేపర్, కాటన్ సంచుల్లోనే ఉంచాలి. పట్టుబట్టలున్న చోట ఎక్కువ గాలి, కాంతి లేకుండా చూడాలి. పట్టుబట్టలను చెక్క లేదా కలపతో చేసిన పెట్టె లేదా బీరువాలో నేరుగా తాకేలా కాకుండా కవరులో పెట్టి పెట్టాలి.
- పట్టుబట్టలను అప్పుడప్పుడు బయటకు తీసి గాలి సోకనీయాలి. లేకుంటే ముడతలు పడిన చోట చిరుగులు పడే అవకాశం ఉంది.

# ఆమెకు 'ధైర్య'ం




**మహిళలకు టూవీలర్, త్రీవీలర్, ఫోర్ వీలర్ నడపడం ఉచితంగా నేర్పిస్తున్నది 'ధైర్య' ఫౌండేషన్. బుధవారం ఆరుగురు మహిళలకు ఎన్టీఆర్ స్టేడియంలో ఆటో డ్రైవింగ్ నేర్పిస్తూ కనిపించారు ధైర్య ఫౌండేషన్ సభ్యులు టింధునిక్కల్, దొమ్మ ప్రసన్న. వారి గురించి 'జిందగీ' తెలుసుకునే ప్రయత్నం చేస్తే.. మహిళల్లో వారు నింపే ధైర్యాన్ని పరిచయం చేశారు.**

అది హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ. బాగా పేరున్న ఓ విల్లా. అక్కడ ఓ ఫ్యామిలీలో ఇద్దరికీ ఉద్యోగం. లక్షల్లో జీతం. భార్య భర్తలు వేర్వేరు కంపెనీల్లో ఉద్యోగస్తులు. ఆఫీస్‌కు వెళ్లేటప్పుడు చెరో కారు వేసుకొని వెళ్తారు. ఇంట్లో పదో తరగతి చదివే ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వారి కోసం ఓ కారు కొన్నారు. ఆ కారు నడిపేందుకు ఓ డ్రైవర్‌ను కూడా నియమించారు. పిల్లలను స్కూల్లో దింపి రావడం. స్కూలుకు తీసుకెళ్లడం. సంగీతం క్లాసుకు తీసుకెళ్లడం. పిల్లలు సరదాగా ఎటైనా వెళ్లాలన్నా తీసుకెళ్లి తీసుకురావడం. ఈ పనంతా డ్రైవర్ చూసుకునేవాడు. ఇదంతా బాగానే ఉంది. కానీ తల్లిదండ్రులకు లోలోపల భయం వేధించసాగేది. 'అతడి స్థానంలో లేడీ డ్రైవర్ ఉంటే బాగుండు' అనుకున్నారు. వెతికారు. ధైర్య ఫౌండేషన్ ద్వారా వారికి ఓ లేడీ డ్రైవర్ దొరికింది.

* * *

రాత్రి పదవుతున్నది. రాణి మెహిదీపట్నం నుంచి ఉప్పల్ వెళ్లాలి. బస్సుల్లేవు. క్యాబ్ బుక్ చేద్దామంటే ఫోన్‌లో చార్జింగ్ లేదు. షేర్ ఆటో వచ్చింది. ఆల్రెడీ వెనకాల కొందరు ఆడవాళ్లే కూర్చున్నారు. డ్రైవర్ రాణిని ముందు కూర్చొమ్మన్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో డ్రైవర్ పక్కన రాణి కూర్చోవాల్సి వచ్చింది. ఆటో కదిలింది. దారి మధ్యలో డ్రైవర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. చాచి చెంపమీద ఒక్కటిచ్చింది రాణి. తోటి ప్రయాణికులు తమ వంతుగా చివాట్లు పెట్టారు. అప్పుడామె 'ఆటో కూడా ఆడవాళ్లే నడిపితే ప్రయాణం సాఫీగా జరిగేదిగా' అనుకుంటూ ఇంటికెళ్లింది. కొద్దిరోజుల్లోనే అదే రూట్‌లో ఓ మహిళా ఆటో నడపడం చూసింది రాణి. ఆ డ్రైవర్‌ను వివరాలు అడగడంతో ధైర్య ఫౌండేషన్ గురించి తెలిసింది.

**జాబ్ వదిలేసి..**

టింధు నిక్కల్, ప్రసన్న ఇద్దరూ స్నేహితులు. వీరు హైదరాబాద్‌లోని ఓ ఎంఎన్‌సీలో ఉద్యోగం చేసేవారు. ఉన్నత చదువులు చదివి హౌస్ కీపింగ్, ఇతర పనుల్లో చేరే ఎందరినో గమనిస్తూ ఉండేవారు. వారితో మాట్లాడి వారికి కౌన్సెలింగ్ ఇస్తుండేవారు. వాళ్లందరిలో టింధు, ప్రసన్న గమనించింది ఒక్కటే. 'ఏ జాబ్ చేయాలో తెలియకపోవడం. ఎవరిని సంప్రదించాలో అవగాహన లేకపోవడం. అందుకే విద్యార్హతతో సంబంధం లేకుండా ఏది దొరికితే ఆ ఉద్యోగం చేయడం.' ఈ సమస్యలన్నింటికీ తామే పరిష్కారం చూపాలనుకున్నారు. ఆ నేపథ్యంలోనే టూ, త్రీ, ఫోర్ వీలర్ డ్రైవింగ్ చేసే మహిళలు లేరని తెలుసుకున్నారు. ఇద్దరూ కలిసి సెప్టెంబర్ 5న తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అదే రోజు 'ధైర్య' ఫౌండేషన్ ప్రారంభించారు. దీని ద్వారా మహిళలకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ , రిటైల్ రంగంలో పనిచేసే మహిళలు, యువతులకు మెళకువలు నేర్పిస్తున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అయ్యే మొత్తం తామే సమకూర్చుకుంటున్నారు. తమ కార్యక్రమాలను నగరంలోని కొన్ని స్వచ్ఛందసంస్థలకు తెలిపారు. వారి ద్వారా అనాథలు, ఒంటరి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి ఉన్న ఎవరికైనా శిక్షణ ఇచ్చేందుకు తాము సిద్ధమే అంటున్నారు.

### ధైర్యం వచ్చింది!



నాకు డ్రైవింగ్ అంటే ఆసక్తి. ఎప్పటి నుంచో నేర్చుకోవాలని, నా కాళ్లపై నేను నిలబడాలనుకునేదాన్ని. ధైర్య వల్ల ఇది సాధ్యమవనుంది. నెల నుంచి మేడమ్ వాళ్లు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు నేను సొంతంగా ఆటో నడుపగలుగుతున్నా. ఇది పూర్తయ్యాక కారు కూడా నేర్చుకోవాలనుకుంటున్నా. ఇప్పుడు జీవితంలో స్థిరపడగలననే ధైర్యం వచ్చింది. థాంక్యూ ధైర్య.

**- వాస నందిని,** సికింద్రాబాద్



### మరింత మందికి నేర్పిస్తాం..

మోటార్ వెహికిల్, రిటైల్ రంగాల్లో మహిళలు రాణించడమే మా లక్ష్యం. సిటీలోని కొన్ని స్వచ్ఛంద సంస్థలతో అనుబంధంగా పనిచేస్తున్నాం. ప్రస్తుతం మేం మా సొంత డబ్బులతో డ్రైవింగ్ నేర్పిస్తున్నాం. దాతలు ప్రోత్సహిస్తే మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. 18 ఏండ్లు నిండి, నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారు డ్రైవింగ్‌లో శిక్షణకోసం ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు. శిక్షణ పొందేందుకు 96038 78866లో సంప్రదించవచ్చు..

**- టింధునిక్కల్, ప్రసన్న ధైర్య** వ్యవస్థాపకులు

**వాహిని..తరుణితో ఆత్మరక్షణ**

'వాహిని' కార్యక్రమంలో భాగంగా ఆసక్తి ఉన్నవారికి బైక్, ఆటో, కారు నడపడం నేర్పిస్తారు. లైసెన్స్ పొందడానికి కావాల్సినట్లుగా శిక్షణ ఇస్తారు. దీంతో పాటు వాహనాలకు సంబంధించిన చిన్న చిన్న రిపేర్లు ఎలా చేయడం, రోడ్డు భద్రత, ఆత్మ రక్షణ వంటివి నేర్పిస్తారు. ఇప్పటి వరకు తొమ్మిది మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ముగ్గురికి నేర్పిస్తున్నారు. తరుణి కార్యక్రమంలో భాగంగా రిటైల్ రంగంలో(సూపర్‌మార్కెట్, షాపింగ్ మాల్స్) వంటి వాటిల్లో పనిచేయడానికి కావాల్సిన మెళకువలు నేర్పిస్తారు. ఉద్యోగ సంబంధిత వస్త్రధారణ, వేషభాషలు, నడవడిక, కస్టమర్లతో, సూపర్‌వైజర్లతో ఎలా వ్యవహరించడం, కార్యరంగంలో ఎలా నడుచుకోవడం, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడమెలా వంటి అంశాలు నేర్పిస్తారు. దీనిలో భాగంగా ఇప్పటివరకు వందకుపైగా మహిళలు, యువతులకు మెళకువలు నేర్పించారు. కొందరికి కొన్ని సంస్థల్లో ఉద్యోగాలు చూపించారు.

**ఎక్కడుంటే అక్కడికే..**

జంటనగరాల్లో డ్రైవింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న మహిళల వద్దకే వెళ్తున్నారు ధైర్య సభ్యులు టింధు, ప్రసన్న. ప్రస్తుతం త్రీవీలర్ డ్రైవింగ్ బ్యాచ్ నడుస్తున్నది. నలుగురు, లేదా ఆపైన ఎంతమంది ఉన్నా వారికి నేర్పించడానికి వెళ్తారు ధైర్య సభ్యులు. వారికి ముందుగా వాహనం పని తీరు గురించి పూర్తి అవగాహన కల్పిస్తారు. ఆ తర్వాత రోడ్డు భద్రత గురించి పాఠాలు బోధిస్తారు. స్వయంగా తయారు చేసిన ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలు ఇస్తారు. ఆ తర్వాత అభ్యర్థులు లెర్నింగ్‌కు అప్లై చేయాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ చేతికి వచ్చాకే రోడ్డుపై వాహనం నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అంబర్‌పేట సమీపంలోని దుర్గానగర్ మహిళలకు ఆటోడ్రైవింగ్‌లో వీరు శిక్షణ ఇస్తున్నారు.

... పడమటింటిర వికుమార్
కోనేటి వెంకట్

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 5 డిసెంబర్ 2019
raithubadi@ntnews.com



## పట్టుపురుగుల పెంపకంలో
# ఊజీ ఈగల నియంత్రణ

**పట్టుపురుగుల పెంపకంలో అవసరమైన సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడం లేదు. దీనివల్ల పట్టు పురుగులకు పాలు కారు రోగం, సున్నపుకట్టు, ప్లాచరీ (సచ్చు రోగం), పెబ్రిన్ మొదలగు వ్యాధుల ద్వారానే కాకుండా ఊజీ ఈగ తాకిడి వల్ల కూడా రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. దీంతో పంట నష్టం సుమారు 15-20 శాతం వరకు ఉంటుంది. ఊజీ తాకిడి వానకాలం, చలికాలంలో ఎక్కువగా ఉంటుంది. ఊజీ ఈగ వల్ల ఏర్పడే నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని దాని నియంత్రణ చర్యలు పాటించాలి.**

ఊజీ ఈగలు తన జీవిత చక్రంలోని లార్వాదశలను పట్టు పురుగులను ఆశించి అందులోని వివిధ కణజాలలను ఆహారంగా తీసుకుంటాయి. దాన్ని చొచ్చుకొని బయటకు వచ్చి కోశస్థ దశలుగా మారి మళ్లా పెద్ద పురుగులుగా మార్పు చెందుతాయి. ఇవి మొట్టమొదటగా మన దేశంలో 1980లో కర్ణాటక రాష్ట్రంలో కనబడినాయి. తర్వాత ఇతర రాష్ట్రాలకు వ్యాపించాయి. దీనివల్ల చాలామంది రైతులు నష్టపోతున్నారు.

### జీవిత చక్రం

సంపర్కం తర్వాత ఈగ 300-1000 గుడ్ల వరకు 9-25 రోజుల కాలంలో పట్టు పురుగులపై (పెద్ద దశ ) ఒక్కో పురుగుపై 1-2 గుడ్లను పెడుతుంది. ఈ గుడ్లను చాలావరకు పురుగు పైభాగంలో ఖండికాల మధ్య పెడుతుంది. ఈ గుడ్లు 2-5 రోజుల వ్యవధిలో పగిలి పట్టుపురుగుల శరీరంలోకి రంధ్రం చేసుకొనిపోతాయి. ఈవిధంగా నల్లని మచ్చలు పట్టుపురుగులపై ఏర్పడుతాయి. కాబట్టి ఊజీ తాకిడికి గుర్రైన పురుగులను గుర్తించవచ్చు. ఈ విధంగా ఊజీ ఈగ పట్టు పురుగు కణజాలం పూర్తిగా తింటాయి. తద్వారా పట్టుపురుగు చనిపోతుంది.

### నియంత్రణ, యాజమాన్య పద్ధతులు

ఊజీ ఈగ తాకిడి నియంత్రణ పద్ధతులను ఉపయోగించి సమగ్ర యాజమాన్యం ద్వారా నిర్మూలించవచ్చు.

### నివారణ పద్ధతులు

- పెంపకపు గదిలోను, పరిసరంలోనూ చిన్న చిన్న రంధ్రాలను సిమెంట్‌తో పూడ్చాలి.
- ఊజీ బారిన పడిన 5వ దశ పట్టుపురుగులు లేదా 2 రోజుల ముందుగానే గూళ్లు అల్లుతాయి. వీటిని ముందుగానే గుర్తించి వేడి నీటిలో వేసి చంపాలి.
- పట్టు పురుగుల పెంపకం గదిలోనూ, పట్టు గూళ్ల విక్రయ కేంద్రంలోనూ, పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రాల్లోనూ కిందపడిన ఊజీ ఈగలను ఎప్పటికప్పుడు ఏరి కాల్చివేయాలి.
- ఊజీ తాకిడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి సేకరించిన విత్తనపు గూళ్లను ఊజీ లేని ఇతర ప్రాంతాలకు తరలించరాదు.



### నియంత్రణ పద్ధతులు

- పట్టు పురుగుల పెంపకం గదికి నైలాన్ వలను అన్నివైపులా అమర్చాలి.
- మల్బరీ ఆకును పెంపకం గదిలోకి వెళ్లే దారిలో ముందు ఒక చిన్న గదిని నైలాన్ వలలో ఏర్పాటు చేయాలి.
- మల్బరీ ఆకులను నేరుగా తోసుకురాకుండా, మొదట ఉండే గదిలో ఈగలు లేని నిర్ధారించుకున్న తర్వాతే తీసుకురావాలి.

### రసాయనాలను వినియోగించడం

**ఊజీ నాశక ద్రావణాన్ని ఉపయోగించడం:** 10 గ్రాముల ఆసిడ్‌ను 125 మి.లీ. అసిటోన్ ద్రావణంలో కరిగించి ఆ తర్వాత 875 మి.లీ. నీటిలో కలిపి మొత్తం 1 లీటరు పిచికారీ ద్రావణాన్ని గాలి చొరపబడని సీసాలలో మూతపెట్టి ఉంచాలి. ఇది ఊజీ ఈగ పట్టు పురుగులపై పెట్టిన గుడ్లలోని పిండాలను చంపుతుంది.

**పిచికారీ చేయాల్సిన ఊజీ ద్రావణ మోతాదు, విధానం:** 1 చదరపు అడుగు పెంపకపు బెడ్ విస్తీర్ణము నందు 5-6 మి.లీ. పిచికారీ చేయడం వల్ల ఊజీ ఈగ పట్టుపురుగుల పైన పెట్టిన గుడ్లను నాశనం చేయవచ్చు. పట్టు పురుగు 2వ జ్వరం నుంచి బయటకు వచ్చిన 24 గంటల తర్వాత రోజు విడిచి రోజు పిచికారీ చేయాలి. పురుగుల జ్వరానికి పోయే దశలో గానీ, జ్వరములో ఉన్నప్పుడు గానీ, జ్వరం నుంచి వెలుపలికి వచ్చిన వెంటనే కానీ ఈ ద్రావణాన్ని పిచికారీ చేయవద్దు. పిచికారీ చేసిన అరగంట వరకు పురుగులకు ఆకు మేతగా వేయవద్దు. మొత్తం 5-6 సార్లు 2వ దశ తర్వాత పురుగులపై పిచికారీ చేయాల్సి ఉంటుంది.

- 1వ సారి 2వ జ్వరం నుంచి బయటకు వచ్చిన 24 గంటల తర్వాత
- 2వసారి 2వ జ్వరం ముగిసిన పురుగులకు 20 గంటల తర్వాత
- 3వ సారి 3వ జ్వరం ముగిసిన పురుగులకు 72 గంటల తర్వాత
- 4వ సారి 4వ జ్వరం ముగిసిన పురుగులకు 24 గంటల తర్వాత
- 5వ సారి 4వ జ్వరం ముగిసిన పురుగులకు 72 గంటల తర్వాత
- 6వ సారి 4వ జ్వరం ముగిసిన పురుగులకు 120 గంటల తర్వాత

### జీవ సంబంధిత కారణాల ద్వారా ఊజీ నివారణ

ఈ పరాన జీవులు ఊజీ కోశస్థ దశలలో మాత్రమే తన జీవిత చక్రాన్ని పూర్తిచేయడం ద్వారా వాటిని చంపుతుంది. ఈ జీవి ఈగలను ఆడ వాటిని 1 లక్షకు 5000 మగ జీవులను 3 దఫాలుగా (ప్రతి 100 గుడ్ల పట్టు పురుగుల పెంపకానికి) వదులాలి.

పైన తెలిపిన విధంగా రైతులు నివారణ, యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల ఊజీ ఈగ బారి నుంచి రక్షించుకోవచ్చు. అధిక గూళ్లను ఉత్పత్తి చేయవచ్చు.

**చీకూరి రాజాగౌడ్**
7396400740 శాస్త్రవేత్త,
(ఎంటమాలజీ విభాగం)
రాష్ట్రఉద్యాన విశ్వవిద్యాలయం



## ఆరోగ్యమైన నారుతోనే
# మంచి దిగుబడి

యాసంగిలో వరి పంట సాగుచేసే రైతులు నారుమడులు చల్లుకునే నాటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు నారుమడులను చల్లుకున్న నాటి నుంచే తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలి. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.



### నారుమడులు చల్లే విధానం

రైతులు నారు మడులను పెంచుకోవడం కోసం ఎకరాకు 25 కేజీల నుంచి 30 కేజీల వరకు విత్తనాలను చల్లుకోవాలి. నారుమడులను చల్లుకోవడం కంటే ముందుగా రైతులు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున కార్బండిజమ్ కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. అదే దుంప నారుమళ్లయితే లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి తరువాత 24 గంటలు మండెకట్టి మొలకలను నారుమడులలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందునీరు చొప్పున 30 కిలోల విత్తనాలు నానబెట్టడానికి 30 కిలోల మందు ద్రావణాన్ని తయారుచేసుకోవాలి.

### నారుమడులు పెంచేవిధానం

- యాసంగిలో నారుమడిని చల్లుకోవడం కంటే ముందుగా పశువుల ఎరువును వేసుకుంటే నారుమడి మంచిగా పెరుగుతుంది.
- పశువుల ఎరువుతో పాటు డీఏపీ లేదా ఎస్ఎస్‌పిని తగిన మోతాదులో చల్లుకోవాలి.
- యాసంగిలో రాత్రి పూట నారుమడుల్లో నీటిని తీసివేసి పగటిపూట మాత్రమే నీటిని పెట్టుకోవాలి.
- చలి బాగా ఉండటం వల్ల నారుమడులపై మంచు బాగా పడుతుంది. మంచు పడితే నారంతా కూడా చలికి ఎర్రగా మారి పెరుగుదల ఆగిపోతుంది. కాబట్టి నారుమడులపై రాత్రి సమయాలలో టార్పెల్స్‌ను కప్పుకోవడం వల్ల నారుమడులను మంచు, చలి నుంచి రక్షించవచ్చు. దీనివల్ల నారుమడులు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి.
- నారంతా ఒత్తుగా కాకుండా పలుచగా బెడ్‌లాగా ఎత్తుగా తయారుచేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. ఒక సెంట్ భూమికి సుమారు 5 కిలోల చొప్పున విత్తనాలను చల్లుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 2 కిలోల డీఏపీ, కేజీన్నర పొటాష్ దుక్కిలో చల్లుకోవాలి. విత్తిన 12 నుంచి 14 రోజులకు 2 కిలోల యూరియా మళ్లీ వేసుకోవాలి.
- నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడి పద్ధతిలో నీటిని ఇచ్చి తరువాత పలుచగా నీరు కట్టాలి.
- విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాములు చొప్పున చల్లుకోవాలి.
- నారుమడిలో ఊద నిర్మూలన కోసం బూటాక్లోరే కలుపుమందును 7.5 మిల్లీ లీటరును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ఎంటీయు 1010 వేసే రైతులు 25 రోజుల నారును నాటు వేసుకోవాలి.
- నారు ముదిరిపోయినా, పిలక కట్టినా దిగుబడి తగ్గిపోతుంది.
- ఎంటీయు 1010 వేసే రైతులు ఒక చదరపు మీటరుకు 44 వరకు కుదుళ్ళు వచ్చేటట్లు చూసుకోవాలి.

**-నగిరి హరీష్,** త్రిపురారం

### రైతుబడికి ఆహ్వానం



**రచనలు**
**పంపవలసిన చిరునామా:**
**8-2-603/1/7,8,9, కృష్ణాపురం,**
**రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.**
raithubadi@ntdaily.news, Fax-040-23291118



# తక్కువ సమయంలో చేతికొచ్చే దోస

**తీగజాతి కాయగూరల్లో మిగిలిన వాటితో పోలిస్తే దోస చాలా తక్కువ సమయంలోనే చేతికి వచ్చే పంట. దీన్ని కాయగూరగా వాడటమే కాకుండా పచ్చిముక్కలు (సలాడ్)గా తీసుకుంటాం. కీరదోసకు ఎండకాలంలో మంచి డిమాండు ఉంటుంది. దోస సాగు గురించి ఉద్యానశాఖ అధికారులు అందించిన వివరాలు.**

**వాతావరణం:** వేడి వాతావరణం అనుకూలం. ఉష్ణోగ్రతలలోని తేడాల వల్ల ఆడ, మగ పూల నిష్పత్తిలో చాలా తేడాలు వస్తాయి.

**కూరదోస రకాలు**

**ఆర్.ఎన్.ఎస్.ఎం.-1:** ఇది నీటి ఎద్దడిని తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చే రకం. వేసవికి కూడాఅ నువైనది.

**ఆర్.ఎన్.ఎస్.ఎం.-3:** నీటి ఎద్దడిని తట్టుకోవడంతో పాటు బూజు, బూడిదతెగుళ్లను కూడా తట్టుకునే రకం. ఇది కూడా వేసవికి అనువైనది.

**పచ్చిదోస రకాలు**

**జపనీస్ లాంగ్ గ్రీన్:** కాయలు 30-40 సెం.మీ. పొడవు. ఆకుపచ్చగా ఉంటాయి. త్వరగా కోతకు వస్తుంది.

**స్రైయిట్ ఎయిట్:** కాయలు మధ్యస్థ పొడవుతో ఉండి స్థూపాకారంలో గుండ్రటి చివరలు కలిగి, మధ్యస్థ ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

**పంటకాలం:** యాసంగిలో డిసెంబర్ రెండవ పక్షం నుంచి మార్చి చివరి వరకు వేసుకోవచ్చు.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ మందు కలిపి విత్తనశుద్ధి చేయాలి. అదే విత్తనానికి 3 గ్రాముల థైరం లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**విత్తే విధానం:** రెండు వరుసల మధ్య 1.5-2.5 మీటర్ల దూరం ఉండేటట్లు 80 సెం.మీ. వెడల్పు గల కాలువలు తయారుచేసుకోవాలి. కాలువలో రెండు పాదుల మధ్య 0.5 (ఎండాకాలం) సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.

**ఎరువులు:** ఆఖరి దుక్కిలో 8-10 టన్నుల పశువుల ఎరువు, 40కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలి. విత్తిన 30 రోజులకు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి. మొక్కలు 2-4 ఆకుల దశలో బోరాక్స్ 3-4 గ్రా/లీ. లేదా ఇథరిల్ 2.5 మి.లీ/10 లీ. నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే ఆడపూలు ఎక్కువగా వస్తాయి.

**నీటియాజమాన్యం:** గింజలు మొలకెత్తే వరకు వెంటనే నీరు పారించాలి. ఆ తర్వాత నేల స్వభావాన్ని, కాలాన్ని బట్టి 7-10 రోజులవ్యవధిలో నీరు ఇవ్వాలి.

**-ఆసరి రాజు**

# హైడ్రోఫోనిక్స్ విధానంలో తాజా ఆకుకూరల సాగు

కాలుష్య ప్రభావితంలేని ప్రాంతాలలో పండిన పంటలకు మార్కెట్‌లో ఎక్కువగా డిమాండు ఉంటుంది. అయితే మన ఇంటి వద్దనే స్వయంగా ఆకుకూరలను పండించుకునే అవకాశం ఉన్నది. ఎక్కువ స్థలం అవసరం లేకుండా మనకు అనుకూలంగా ఉన్న స్థలంలోనే (ఇంట్లోనే) తాజా ఆకుకూరలు, కూయగూరలను పండించుకోవచ్చు. హైడ్రోఫోనిక్స్ విధానం (మట్టిలేకుండానే)లో ఆకుకూరలు పండించుకోవచ్చు. ఈ విధానంలోతక్కువ ఖర్చుతో తాజా ఆకుకూరలు పండించుకోవచ్చు.

### కావాల్సిన పరికరాలు

ఇంట్లో లేదా ఇంటి మేడపై హైడ్రోఫోనిక్స్ విధానంలో సాగు చేయాలనుకునే వారికి అందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు లేదా తయారుచేసుకోవచ్చు. ఈసాగులో ఫైబర్, పీవీసీ, వెదురు బొంగులతో మూడు విధాలుగా చేసుకునే అవకాశం ఉన్నది. ఈ సాగుకోసం మనకు ఉన్న స్థలాన్ని బట్టి ఐదు నుంచి 10 ఫీట్ల పీవీసీ పైపులను తీసుకోవాలి. వాటికి రెండు వైపుల మూతలతో మూసివేయాలి. పైభాగంలో పావు ఫీటు వదిలి రంధ్రాలను చేసుకోవాలి. దీంతో పాటు మార్కెట్‌లో దొరికే జాలి ప్లాస్టిక్ కప్పులు, ఒక బకెట్, నీటి మోటారుతో పాటు మట్టిరాళ్లను సేకరించాలి. అలాగే సాగుకు ప్రధానంగా అవసరమైన మైక్రో, మ్యాక్రో సొల్యూషన్స్ (సూక్ష్మ, స్థూల పోషకాలను ద్రావణాన్ని)సిద్ధంగా ఉంచుకోవాలి. వీటితోపాటు నీటిలోని పీహెచ్ సామర్థ్యం ఎలక్ట్రికల్ కండెక్టివిటీ శాతాన్ని చూపే రెండు చిన్న పరికరాలు కూడా అవసరమవుతాయి. విత్తనాలను మొక్క దశకు తీసుకువచ్చే విధంగా ఒక మినీ సీడ్ ట్రేలను కూడా కొనుగోలు చేయాలి. సాగును పద్ధతి ప్రకారం కొనసాగించే విధంగా వాటిని ఒకదాని కింద ఒకటి ర్యాక్‌లపై ఉంచాలి. అయితే వీటిన్నింటిని కలిపి సిద్ధం చేసుకునేందుకు మార్కెట్‌లో రూ. 12 వరకు ఖర్చు అవుతుంది. కానీ సంగారెడ్డి జిల్లా జైలు అధికారులు తయారుచేసుకోగా వారికి రూ. 4 నుంచి ఖర్చు అయిందని తెలిపారు.

### సాగు విధానం

మొదటగా సీడ్ ట్రాక్‌లో మట్టిలో మనకు కావాల్సిన విత్తనాలను వేసుకుని అవసరమైన నీటిని పోయాలి. పోసిన నీటి ద్వారా సీడ్ ట్రాక్‌లో వారంరోజుల వ్యవధిలో విత్తనం మొక్కగా మారుతుంది. అలా పెరిగిన ఆ మొక్కను అన్నిపరికరాల ద్వారా తయారుచేసుకున్న హైడ్రోఫోనిక్స్ పరికరంలోని పైపుల మధ్య ఏర్పాటుచేసిన జాలి ప్లాస్టిక్ కప్పులలో క్లేబాల్స్ (మట్టిరాళ్లు) వేసి మధ్యలో మొక్కను పెట్టాలి. కింద ఒక బకెట్‌లో నిండా నీరు పోసి అందులో నీటిని పంపించే మోటారును పైపుల ద్వారా అన్నింటికి అనుసంధానంచేస్తూ ఏర్పాటు చేసుకోవాలి. ముఖ్యంగా మొక్కలకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలను నిపుణుల సిఫార్సు మేరకు వేసుకోవాలి. ద్రావణం మోతాదులను కూడా ప్రత్యేక పరికరాల ద్వారా పరిక్షించుకోవాలి. ఉదజని సూచిక 5.5 నుంచి 6.5 వరకు ఉండేలా చూసుకోవాలి. అలాగే ఎలక్ట్రికల్ కండెక్టివిటీ 1500 పీపీఎం కంటే తక్కువగా ఉండాలి. వీటిని సూర్యరష్మి తగులకుండా ఇంట్లో పరిశుభ్రమైన స్థలంలో ఏర్పాటు చేసుకోవాలి. పీవీసీ పైపుల మధ్యభాగంలోని జాలీ కప్పులలో ఉంచిన మొక్కలను మోటారు ద్వారా నిరంతరం నీటిని అందిస్తుండాలి. ముఖ్యంగా ఈ మొక్కలకు రోజుకు కనీసం రెండు గంటలు ఎండా తగిలే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మొక్క పెరిగే ప్రదేశంలో 30 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ఇలా రోజూ చేయడం ద్వారా మొక్కలు పెట్టిన నాటి నుంచి తక్కువ సమయంలోనే మనకు కావాల్సిన తాజా ఆకుకూరలు, కాయగూరలు అందుబాటులోకి వస్తాయి. వేసిన పంట రెండు నుంచి మూడుసార్లు మన చేతికి అందుతుంది. ఈ హైడ్రోఫోనిక్స్ విధానం ద్వారా అరమీటరు పొడువు పెరిగే అన్నిరకాల ఆకుకూరలు, కాయగూరలను ఇంట్లోనే పండించుకోవచ్చు.



### మట్టి అవసరం లేకుండా..

మట్టి అవసరం లేకుండా ఇంట్లోనే వ్యవసాయాన్ని చేసుకునే వీలు ఉంటుంది. ఈ పద్ధతిలో రెండు లాభాలు ఉంటాయి. ఒకటి అధిక దిగుబడి పంటను పొందడం, రెండవది సాధారణ వ్యవసాయం సాధ్యం కాని చోట ఈ విధానాన్ని అనుసరించి పంటను పొందవచ్చు. తక్కువ వ్యవధిలో ఎక్కువ పంట చేతికి అందుతుంది. సాధారణ పంట పొలాల్లో అవసరమయ్యే నీటిలో 20 శాతం నీటినే వినియోగించి ఈ పంటను పడించుకోవచ్చు. అలాగే కలుపు సమస్య ఈ పద్ధతి ద్వారా అంతగా ఉండదు. చీడపీడల బాధ కూడా ఉండదు. బయటి వాతావరణంతో సంబంధం లేకుండా ఏడాది పొడవుగా ఈ పంటలను సాగుచేసుకుని అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ తరహా సాగు ద్వారా ఆకుకూరలే కాకుండా కాయగూరలు, పండ్లు, పూల పంటలను కూడా సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.ఈ పద్ధతి ద్వారా పంటలు పండిస్తే ఆరోగ్యకరమైన పంటలు పొందే అవకాశం ఉన్నది. ఈ తరహా సాగుకు ప్రోత్సాహం అందిస్తే మంచిదని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.





### ప్రయోగాత్మకంగా సంగారెడ్డి జిల్లా జైలులో..

సంగారెడ్డి జిల్లా జైలులో గతంలో అనేక కొత్త సంస్కరణలు తీసుకురాగా ప్రస్తుతం ఈ జైలు రాష్ట్రంతో పాటు ఇతర జైళ్లకు ఆదర్శంగా నిలుస్తున్నది. తాజాగా జిల్లా జైలు అధికారుల కృషితో కొత్తగా హైడ్రోఫోనిక్స్ విధానంలో సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా ఇక్కడ చేపట్టిన ఈ వ్యవసాయానికి మంచి ఫలితాలు వచ్చాయి. ఈ సాగుకు అవసరమ్యే పరికరాలను జైలు అధికారులే స్వయంగా తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని రెండు, మూడు పంటలను కూడా పండించి వాటి ఫలితాలను చూశారు. వారి అంచనాలకు తగ్గట్టుగానే మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొదటి దఫా ప్రయత్నంగా సాగు చేయడానికి అవసరమైన పరికరాలు 80శాతం సొంతంగా తయారు చేసుకోగా మిగతా వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకుని తెప్పించుకున్నామని జైలు అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ తరహా సాగును పెంచి జైలులోని ఖైదీలకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సంకల్పించామని వారు తెలిపారు. బయట మార్కెట్‌లో ఈ సాగుకు అవసరమయ్యే పరికరాలు కోసం రూ. 12వేల వరకు ఖర్చు అవుతుంది. జైలులో స్వయంగా తామే తయారుచేసుకోవడం ద్వారా తమకు రూ. 4వేల వరకు ఖర్చు వచ్చిందని జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ వివరించారు.

**- మద్దికుంట శ్రీనివాస్,** కంది
**9963121222**




హైదరాబాద్ శివారులో దిశపై లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు

## సుడాన్ ప్రమాదంలో 18 మంది భారతీయుల మృతి

**ఖార్టూమ్:** సుడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని ఒక టైల్స్ ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడు ఘటనలో మరణించిన వారిలో 18 మంది భారతీయులు ఉన్నారని భారతీయ రాయబార కార్యాలయం బుధవారం తెలిపింది. ఖార్టూమ్‌లోని బాహ్రీ ప్రాంతంలో గల సీలా సిరామిక్స్ టైల్స్ ఫ్యాక్టరీలో మంగళవారం ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ పేలిపోవడంతో 23 మంది మరణించగా, 130 మందికి పైగా గాయపడ్డారు. ఘటన తర్వాత 16 మంది భారతీయుల ఆచూకీ తెలియడం లేదని భారత ఎంబసీ పేర్కొంది. 18 మంది భారతీయులు మరణించారని ఒక ప్రకటనలో తెలిపింది.



దివ్యాంగుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పింఛను పెంచిందని, కనీవినీ ఎరుగని రీతిలో నెలకు రూ.3,016 అందజేస్తున్నదని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ దివ్యాంగుల దినోత్సవ సభ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. - పాల్వంచ



# చిదంబరానికి బెయిల్

- ఈడీ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- 105 రోజుల తర్వాత జైలు నుంచి విడుదలయ్యేందుకు మార్గం సుగమం
- కావాలనే ఇరికించారు: కాంగ్రెస్
- బెయిల్‌పై వచ్చిన నేతల క్లబ్‌కు స్వాగతం: బీజేపీ



ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో మాజీ కేంద్ర మంత్రి చిదంబరానికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో చెన్నైలో స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరానికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో 105 రోజులుగా కస్టడీలో ఉన్న చిదంబరానికి బయటికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఆర్ భానుమతి నేతృత్వంలోని జస్టిస్‌లు ఏఎస్ బోపన్న, హృషికేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. వాదోపవాదనలు విన్న అనంతరం పలు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచీకత్తు, ఇద్దరి జమానతు సమర్పించాలని సూచించింది. మీడియాతో మాట్లాడొద్దని, కేసు గురించి ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని చిదంబరానికి స్పష్టంచేసింది. తమ అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లొద్దని, సాక్షులను ప్రభావితం చేసే, ఆధారాలను మార్చే చర్యలకు పాల్పడొద్దని ఆదేశించింది. చిదంబరాన్ని ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో ఆగస్టు 21న సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయన అప్పటి నుంచి తీహార్ జైలులోనే ఉంటున్నారు. ఇదే కుంభకోణానికి సంబంధించి ఈడీ మనీలాండరింగ్ కేసులో అక్టోబర్ 16న చిదంబరాన్ని అదుపులోకి తీసుకున్నది. ఆ తర్వాత ఆరు రోజులకే సీబీఐ కేసులో బెయిల్ వచ్చినా.. ఈడీ కేసు ఉండటంతో చిదంబరం 105 రోజులుగా తీహార్ జైలులోనే ఉంటున్నారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ చిదంబరం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా గతనెల 15న కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ చిదంబరం కస్టడీలో ఉన్నప్పుడే కీలక ఆధారాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆర్థిక నేరాలు చాలా తీవ్రమైనవని, ఇవి దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయని చెప్పారు. అధికారంలో ఉన్నవారు ఇలాంటి నేరాలకు పాల్పడితే ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకం పోతుందని చెప్పారు. ఈడీ ఆరోపణలన్నీ నిరాధారమని చిదంబరం తరపు న్యాయవాదులు కపిల్ సిబల్, ఏఎం సింఘ్వీ ఖండించారు. ఈ కేసులో చిదంబరం ప్రమేయం ఉన్నట్టు నేరుగా నిరూపించే సాక్ష్యాలేవీ ఈడీ వద్ద లేవన్నారు. ఆయన సాక్షులను ప్రభావితం చేసినట్టు, ఆధారాలను చెరిపేసేందుకు ప్రయత్నించినట్టు ఆధారాలు కూడా లేవన్నారు. వాదోపవాదనలను విన్న అనంతరం చిదంబరానికి షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేస్తూ ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈడీ ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ కేసులో మిగతా నిందితులకు ఈ బెయిల్ వర్తించదని తెలిపింది. దర్యాప్తు సంస్థలు 'సీల్డ్ కవర్'లో అందించే పత్రాలపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తు సంస్థలు తరుచూ విచారణ మధ్యలో సీల్డ్ కవర్‌లో పత్రాలు అందిస్తున్నాయని, ఇది విచారణ పారదర్శకతపై ప్రభావం చూపిస్తుందని పేర్కొన్నది. ఈ కేసులో ఈడీ సమర్పించిన పత్రాలను వెనక్కి పంపేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

**ఎప్పటికైనా నిజం నిగ్గుతేలుతుంది: కాంగ్రెస్**

చిదంబరానికి బెయిల్ మంజూరు కావడంపై పలువురు కాంగ్రెస్‌నేతలు హర్షం వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రతీకారం, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే చిదంబరాన్ని 100 రోజులకుపైగా జైలులో ఉంచిందని రాహుల్ గాంధీ విమర్శించారు. నిజం ఎప్పటికైనా నిగ్గుతేలుతుందని, చిదంబరం తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటారని దీమా వ్యక్తం చేశారు. చిదంబరం కొడుకు కార్తీ చిదంబరం మాట్లాడుతూ.. తన తండ్రి 106 రోజుల తర్వాత ఇంటికి వస్తుండటం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఆయనను అనవసరంగా జైల్లో ఉంచారని ఆరోపించారు. చిదంబరం సైతం తనకు బెయిల్ మంజూరుచేయకపోవడంపై ఇటీవల అసహనం వ్యక్తంచేశారు. 'బెయిల్ ఇవ్వకపోవడానికి నేనేమైనా బిల్లా-రంగానా?' అని ధర్మాసనాన్ని ప్రశ్నించారు.

**కాంగ్రెస్‌వి 'అవినీతి' సంబురాలు: బీజేపీ**

బెయిల్ మంజూరుతో కాంగ్రెస్ చేస్తున్న హడావుడిని 'అవినీతి సంబురాలు'గా బీజేపీ అభివర్ణించింది. 'బెయిల్‌పై వచ్చిన కాంగ్రెస్ నేతల క్లబ్'లో చిదంబరం కూడా చేరారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పత్రా ఎద్దేవా చేశారు. ఇప్పటికే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రాబర్ట్ వాద్రా, మోతీలాల్ వోహ్రా, భూపిందర్ హుడా, శశిథరూర్ వంటి కీలక నేతలు బెయిల్‌పై ఉన్నారని, ఈ ఖాతాలో చిదంబరం కూడా చేరారని పేర్కొన్నారు.

## సహచరులపై జవాన్ కాల్పులు

- ఐదుగురు ఐటీబీపీ జవాన్ల మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆపై తనను తాను కాల్చుకుని ఆత్మహత్య
- అధికారులు సెలవు ఇవ్వలేదన్న కోపంతో విచక్షణ కోల్పోయి దారుణం
- ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఘటన



కాల్పుల్లో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న జవాన్లు

**చర్ల రూరల్:** ఉన్నతాధికారులు సెలవులు ఇవ్వలేదన్న కోపంతో విచక్షణ కోల్పోయిన ఓ జవాను తన సహచరులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు అక్కడికక్కడే మృతిచెందారు. తర్వాత తానూ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరో ఇద్దరు తీవ్రగాయాల పాలై రాయ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దారుణం బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగింది. నారాయణపూర్ జిల్లా ఎస్పీ మోహిత్‌గార్గ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాకేంద్రానికి సుమారు 60 కి.మీ. దూరంలోని కడెనార్ అటవీ ప్రాంతంలోని ఉన్న ఐటీబీపీ (ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్) క్యాంపులో రెహమాన్ అనే జవాను ఉన్నతాధికారులు సెలవులు ఇవ్వడం లేదనే కారణంతో బుధవారం తన సహచరులైన ఏడుగురు జవాన్లపై కాల్పులు జరిపాడు. అనంతరం రెహమాన్ తనని తాను తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనలో హిమాచల్‌ప్రదేశ్‌కి చెందిన మహేంద్రసింగ్, పశ్చిమ బెంగాల్‌కి చెందిన సుర్జీత్ సర్కార్, బిశ్వరూప్ మహతో, పంజాబ్‌కి చెందిన దల్జీత్‌సింగ్, కేరళకు చెందిన బిజేష్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజస్థాన్‌కి చెందిన సీతారామ్ ధూన్, కేరళకి చెందిన ఉల్లాస్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని రాయ్‌పూర్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. జవాన్లపై కాల్పులు జరిపిన మసుదుల్ రెహమాన్ అనే జవాన్ పశ్చిమ బెంగాల్‌కి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన నేపథ్యంలో సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని పరిస్థితిపై సమీక్షిస్తున్నారు. ఐటీబీపీ ఘటనపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ విచారణకు ఆదేశించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉండగా, ప్రాథమికంగా అందిన సమాచారాన్ని బట్టి తనకు పోలీసు ఉన్నతాధికారులు తనకు సెలవు ఇవ్వడంలేదనే ఆక్రోశంతోనే విచక్షణ కోల్పోయి కాల్పులకు పాల్పడినట్లు తెలుస్తోంది.

## వివాదంలో మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్

- అధికారిక సమీక్షలో ఆయన సమీప బంధువు హాజరుపై విపక్షం విమర్శలు



**ముంబై, డిసెంబర్ 4:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అధ్యక్షతన ఇటీవల జరిగిన ఒక సమీక్ష సమావేశంలో ఆయన సమీప బంధువు, అధికార పార్టీ శివసేన అనుబంధ సంఘం యువసేన కార్యదర్శి వరుణ్ సర్దేశాయ్ పాల్గొనడం వివాదస్పదమైంది. సోమవారం జరిగిన ఈ సమావేశంలో సర్దేశాయ్‌తో పాటు సీఎం ఉద్ధవ్ తనయుడు, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే పాల్గొన్నారు. దీనిపై బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి మాధవ్ భండారీ బుధవారం స్పందిస్తూ.. 'సీఎం కార్యాలయంలో ప్రత్యామ్నాయ అధికార కేంద్రం ఏర్పాటవుతున్నట్లు కనిపిస్తున్నది. ఇటువంటి ఘటన పునరావృతం కారాదు. నూతన ప్రభుత్వం ఒక తప్పుడు సంప్రదాయాన్ని నెలకొల్పింది. ప్రభుత్వ పనితీరు, కార్యకలాపాలు రహస్యంగా ఉండాలన్న నిబంధనను ఇది ఉల్లంఘించడమే' అని పేర్కొన్నారు. శివసేన మిత్రపక్షం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ప్రధాన అధికార ప్రతినిధి నవాబ్ మాలిక్ ప్రతిస్పందిస్తూ.. 'ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయనకు పాలనానుభవం లేదు. అయినప్పటికీ ఇటువంటి ఘటన పునరావృతం కారాదు' అని వ్యాఖ్యానించారు. సీఎం ఉద్ధవ్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాను పాల్గొనడానికి పెద్ద ప్రాధాన్యం లేదని, పట్టించుకోనవసరం లేదని సర్దేశాయ్ కొట్టి వేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫడ్నవీస్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన భార్య అమృత కూడా సమీక్షల్లో పాల్గొన్నారని సర్దేశాయ్ ఎదురుదాడికి దిగారు. వరుణ్ సర్దేశాయ్.. సీఎం ఉద్ధవ్ భార్య రేష్మకు సమీప బంధువు కావడం విశేషం.

## నిరుపేదలకు అండగా సీఎం కేసీఆర్

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



కరీంనగర్ జిల్లా రామడుగులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**రామడుగు:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలను పకడ్బందీగా అమలుచేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రంలో బుధవారం ఆ మండలంలోని 11 గ్రామాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు రూ.90 లక్షల 10వేల 440 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ నిరుపేద తండ్రి తన బిడ్డపెండ్లికి పడిన కష్టాలను ప్రత్యక్షంగా చూసి కేసీఆర్ చలించారని గుర్తుచేశారు. ఆ నిరుపేద బిడ్డ పెండ్లికి రూ.50 వేలు అందజేశారని, ఆ ఘటనను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకరాష్ట్రం సాధించుకున్నాక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలుచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, జెడ్పీటీసీ సభ్యురాలు మార్కొండ లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, తాసిల్దార్ కోమల్‌రెడ్డి, ఎంపీడీవో సతీశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## 'క్రిస్మస్' విందుకు ఏర్పాట్లుచేయాలి

- అధికారులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్టియన్లకు ఇచ్చే విందుకోసం పకడ్బందీ ఏర్పాటుచేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ విందు ఏర్పాట్లపై బుధవారం బీఆర్కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విందుకు సీఎం కేసీఆర్ కూడా హాజరవుతున్నందున ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు పదివేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నదని, అందుకు తగినట్టుగా భోజన వసతి, సుందరీకరణ, పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏ కే ఖాన్, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

- తొమ్మిది మందికి గాయాలు
- సూర్యాపేట జిల్లా గుంపుల వద్ద ఘటన



సూర్యాపేట జిల్లా గుంపుల వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టి నుజ్జునుజ్జయిన అంబులెన్స్

**చివ్వెంల:** ట్రాక్టర్‌ను అంబులెన్స్ ఢీకొట్టంతో తొమ్మిదిమందికి గాయాలైన ఘటన బుధవారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంపుల శివారులో 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన ఓ వ్యక్తి కర్నాటక రాష్ట్రం రాయిచూర్‌లో పనిచేస్తూ మృతిచెందాడు. మృతదేహాన్ని బంధువులు మంగళవారం రాత్రి అంబులెన్స్‌లో కాకినాడకు తరలిస్తున్నారు. చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామశివారులో పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల వద్ద ట్రాక్టర్‌ను వెనుకనుంచి అంబులెన్స్ ఢీకొట్టింది. ప్రమాదంలో రాయిచూర్‌కు చెందిన అంబులెన్స్ డ్రైవర్ జాహిద్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తాతాపూడి జ్వాల, తాతాపుడి వేణు, తాతాపూడి సత్యం, తాతాపుడి అన్నారం, తాతాపుడి చినబాబుతోపాటు ట్రాక్టర్‌పై ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎన్ లవకుమార్ తెలిపారు.

## భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి

- అధికారులతో సమన్వయంతో పనిచేయాలి
- రెండురోజులు మద్యం,మాంసం దుకాణాలు మూసేయాలి
- ముక్కోటిపై సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ



భద్రాద్రి కొత్తగూడెంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ

**కొత్తగూడెం, నమస్తే తెలంగాణ:** వచ్చే ఏడాది ఆరంభంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రామాలయ పరిధిలో జరుగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని, భక్తులు ఇబ్బంది పడకుండా సకల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రజత్‌కుమార్‌షైనీ ఆదేశించారు. ముక్కోటి ఏర్పాట్లపై బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల కోసం ఏర్పాటు చేయాల్సిన పనులను శాఖలవారీగా సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యాచరణ ప్రణాళికలపై 20 రోజుల్లోగా నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటుచేయాలని చెప్పారు. దేవాలయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమన్వయబృందాలను ఏర్పాటుచేసి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. ఉత్సవాలను వీక్షించడానికి విచ్చేసే ప్రముఖులకు వసతి ఏర్పాటు చేసేందుకు అందుబాటులో ఉన్న విశ్రాంతి భవనాలను సిద్ధంగా ఉంచాలని భద్రాచలం సబ్ కలెక్టర్ భవేశ్‌మిశ్రాను కోరారు. జనవరి 5,6 తేదీల్లో భద్రాచలంతో పాటు దుమ్ముగూడెంలో మాంసపు దుకాణాలు మూసివేయాలని సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు.

**అత్యవసర చికిత్సకేంద్రాలు ఏర్పాటుచేయాలి**

స్వామివారి తెప్పోత్సవం, ఉత్తర ద్వారదర్శనం రెండు రోజులు మద్యం దుకాణాలు మూసివేయాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో సీసీటీవీలు ఏర్పాటుచేయాలని, ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రతీసెక్టార్‌కు జిల్లా అధికారిని బాధ్యులుగా నియమిస్తున్నామని చెప్పారు. జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు అత్యవసర చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేయడంతో పాటు 24 గంటలు పనిచేసేలా సిబ్బందికి విధులు కేటాయించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. భద్రాచలం ఏరియా దవాఖానలో అత్యవసర చికిత్స అందించేందుకు బెడ్లు కేటాయించాలని, గుండెవ్యాధులకు చికిత్స నిర్వహించడానికి ప్రత్యేక వైద్యాధికారిని ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని ప్రధాన రహదారులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్‌దత్, ఐటీడీఏ పీవో వీపీ గౌతమ్, సంయుక్త కలెక్టర్ వెంకటేశ్వర్లు, సబ్‌కలెక్టర్ భవేష్‌మిశ్రా, జిల్లా ప్రత్యేక అధికారి ఇలాత్రిపాఠి, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జీ నరసింహులు, ఉప కార్యనిర్వహణ అధికారి రవీందర్, భద్రాచలం ఏఎస్పీ రాజేశ్ పాల్గొన్నారు.

### మోడల్ స్కూళ్లలో హాజరుశాతం పెంచాలి

- విద్యాశాఖ కార్యదర్శి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మోడల్ స్కూళ్లలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి హెచ్‌ఎంలకు సూచించారు. మోడల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హాజరు శా తం గతంలో 78-80 శాతం ఉన్న హాజరు.. అక్టోబర్, నవంబర్ నెలల్లో 86-88 శాతానికి పెరిగిందని చెప్పా రు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మోడ ల్ స్కూల్, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మోడల్ స్కూల్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మోడల్ స్కూళ్ల లో అధిక హాజరు నమోదయిందని తెలిపారు. 97 శాతం హాజరు సా ధించిన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ హెచ్‌ఎం భానుమతిని అభినందించారు.

### ఫీజు అక్రమ వసూళ్లపై విచారణ

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేశారనే ఆరోపణలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావుపై బుధవారం అశ్వారావుపేట ఎంఈవో కృష్ణయ్య విచారణ చేపట్టారు. డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) పేరుతో విద్యార్థుల నుంచి ఫీజుల పేరుతో ప్రధానోపాధ్యాయుడు అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడని, పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుతుండగా, వారి నుంచి రూ.49 వేల నుంచి 1.2 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయని ఎంఈవో తెలిపారు. పలు విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని చెప్పారు. నివేదికను డీఈవోకు పంపిస్తామని ఎంఈవో కృష్ణయ్య చెప్పారు.

## రుణం ఇవ్వలేదని బ్యాంకు సిబ్బందిపై దాడి

- కెనరా బ్యాంకు మేనేజర్, మరో ఇద్దరికి గాయాలు
- తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఘటన

**కోయంబత్తూర్:** రుణం ఇవ్వలేదనే ఆగ్రహంతో ఓ వ్యక్తి తుపాకి, కత్తితో వెళ్లి బ్యాంకు సిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోటార్ల తయారీ పరిశ్రమ యజమాని అయిన వెట్రివేల్ తమిళనాడులోని కోయంబత్తూర్ కెనరా బ్యాంకులో కోటి రూపాయల రుణం కోసం మార్చిలో దరఖాస్తు చేశాడు. అందుకు అవసరమైన ఆస్తులను బ్యాంకువారికి తాకట్టు పెట్టాడు. అయితే రుణం ఇచ్చేది లేదని బ్యాంకు తిరస్కరించడంతో ఆగ్రహానికి గురయ్యాడు. రుణం ఇప్పిస్తానని చెప్పిన మధ్యవర్తికి రూ.3 లక్షలు కూడా ముట్టజెప్పిన వెట్రివేల్ బ్యాంకు తీరుతో అసంతృప్తి చెందాడు. తుపాకి, కత్తి తీసుకొని బ్యాంకులోకి దూసుకెళ్లాడు. అడ్డుకున్న ఇద్దరు ఉద్యోగులతో పాటు బ్యాంకు మేనేజర్‌పై దాడికి పాల్పడ్డాడు. 'వెట్రివేల్ రుణం కోసం చేసుకున్న దరఖాస్తును పై అధికారులకు పంపాం. పెద్దమొత్తం కావడంతో అధికారులు తిరస్కరించారు. అదనంగా ఆస్తులు తాకట్టుపెట్టడానికి అతను సిద్ధంగా ఉన్నా ప్రధాన కార్యాలయం వారు నిరాకరించారు. దీంతో అతను ఆవేశానికి గురై మాపై అరిచాడు. అర్థం చేసుకోవాలని కోరినా దాడికి పాల్పడటంతో ముగ్గురం గాయపడ్డాం. పోలీసులు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకున్నారు' అని బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనిపై స్పందించిన వెట్రివేల్.. అప్పుల్లో ఉన్న తాను, రుణం మంజూరు కాకపోతే ఆత్మహత్య చేసుకొనే ఆలోచనలో ఉన్నానని తెలిపాడు.

## 'మా అంత్యక్రియలు ఒకేచోట జరిపించండి'

- సామూహిక ఆత్మహత్యకు ముందు గోడపై రాసిన ఘజియాబాద్ వ్యాపారి
- ఇద్దరు పిల్లల్ని చంపి, దంపతుల ఆత్మహత్య
- కంపెనీ ఉద్యోగి కూడా బలవన్మరణం
- ఆత్మహత్యకు ముందు బంధువుకు వీడియో కాల్



గోడపై రాసిన సూసైడ్‌నోట్

**ఘజియాబాద్:** 'మా అంత్యక్రియలు ఒకేచోట జరిపించండి' అని గోడపై రాసి ముగ్గురు సామూహిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో కలకలం రేపింది. వ్యాపారవేత్త గుల్షన్ వాసుదేవ (45), ఆయన భార్య ప్రవీణ్, వారి మేనేజర్ సంజన.. ఇందిరాపురంలోని అపార్టుమెంట్ ఎనిమిదో అంతస్తు పైనుంచి దూకి మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. అంతకుముందు ఫ్లాట్‌లోనే వాసుదేవ.. వారి పిల్లలు హృతిక్ (14), హృతిక (18)ను చంపినట్టు పోలీసులు గుర్తించారు. అక్కడే ఓ గోడపై 'మా అంత్యక్రియలు ఒకే చోట జరిపించండి' అని రాసి ఉన్నదని, అంత్యక్రియల ఖర్చులకు రూ.10 వేలు కూడా అక్కడే పెట్టారని పోలీసులు బుధవారం తెలిపారు. తాము ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడానికి, ఆత్మహత్య చేసుకొనేందుకు కారణం తన బావ రాకేశ్ వర్మ అని ఆరోపిస్తూ.. అతడు ఇచ్చిన చెల్లని(బౌన్స్డ్) చెక్కును సైతం గోడకు అతికించారని పేర్కొన్నారు. 'చెక్కులు బౌన్స్ అయ్యాయి. వర్మ ఆదేశంతో ఆస్తులపై వాసుదేవ పెట్టిన పెట్టుబడి తిరిగి రాలేదు. వ్యాపారం దివాళా తీసింది. కుటుంబం ఒత్తిడిలో పడిపోయింది' అని ఘజియాబాద్ సీనియర్ ఎస్పీ సుధీర్‌కుమార్ సింగ్ తెలిపారు. వాసుదేవ చివరి కోరిక మేరకు ఒకే చోట అంత్యక్రియలు నిర్వహించేందుకు అక్కడ స్వాధీనం చేసుకున్న డబ్బును కుటుంబసభ్యులు, బంధువులకు అప్పగిస్తామని పేర్కొన్నారు. కొడుకు, కుమార్తెను చంపిన తర్వాత, చూసుకొనేందుకు ఎవరూ ఉండరని భావించి పెంపుడు కుందేలును కూడా వాసుదేవ చంపేశారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో వాసుదేవ.. ఢిల్లీలో నివసించే తన బంధువు రమేశ్ అరోరాకు వాట్సప్ వీడియోకాల్ చేశాడు. ఇంట్లోని దృశ్యాలను చూపించాడు. ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడొద్దని, ఆర్థికంగా ఆదుకుంటానని ఆ సమయంలో అరోరా భరోసా ఇచ్చారని పోలీసులు చెప్పారు. వాసుదేవ మానసికంగా కుంగిపోయారని తెలిపారు. నెల నుంచే తన వ్యాపారలావాదేవీలన్నీ ముగించుకున్న వాసుదేవ.. వ్యక్తిగత సిబ్బందికి కూడా జీతాలిచ్చి మళ్లీ పనిలోకి రావొద్దని సూచించాడని పేర్కొన్నారు. ఇంట్లోని దుస్తులను కూడా పంచేశాడని చెప్పారు. సామూహిక ఆత్మహత్యకు కారణమైన రాకేశ్ వర్మను ఘజియాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 5 డిసెంబర్ 2019

''దేవుడా.. ఓ మంచి దేవుడా.. చాలా థ్యాంక్ దేవుడా.. ఫైనల్‌గా డిసెంబర్ 13న సినిమా వస్తోంది. చాలా రోజుల నుంచి వెయిట్ చేస్తున్నాను.. దేవుడా.. ఎప్పుడూ ఇంత టెన్షన్ పడలేదు.. దేవుడా..వెంకీమామ అన్నారు.. మిలట్రీ నాయుడు అన్నారు..రిలీజ్ డేట్ మాత్రం ఇన్నాళ్లు చెప్పలేదు..థ్యాంక్యూ సురేష్ ప్రొడక్షన్స్.. థ్యాంక్యూ అన్నయ్య' అంటూ కథానాయకుడు వెంకటేష్ తను నటించిన సూపర్‌హిట్ మూవీ 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రంలోని ఓ వినోద సన్నివేశాన్ని అనుకరిస్తూ బుధవారం జరిగిన 'వెంకీమామ' విడుదల తేదీ పాత్రికేయుల సమావేశంలో తనదైన శైలిలో వేదికపై నవ్వులు కురిపించాడు.. నాగచైతన్యతో కలిసి ఆయన నటించిన మల్టీస్టారర్ చిత్రం 'వెంకీమామ'. సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకుడు. రాశీఖన్నా, పాయల్‌రాజ్‌పుత్ కథానాయికలు. ఈ నెల 13న చిత్రం విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ 'ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ముప్పై ఏళ్లు అవుతున్న వేదికలపై ఎక్కగానే టెన్షన్‌తో నాకు మాటలు రావు. అందరూ నేర్చుకుంటున్నారు. నాకు మాత్రం మాట్లాడటం రావడం లేదు. నాగచైతన్యలోని ఆల్‌రౌండర్‌ను ఈ సినిమాలో చూస్తారు. నా కల నిజమైన అనుభూతి కలిగింది. రానా, నాగచైతన్యతో కలిసి సినిమాలు చేయాలని ఎప్పుడూ కోరుకునే వాణ్ణి. నాన్న కూడా మాతో సినిమాలు చేయాలని అనుకునేవారు. ఆయన ఉండుంటే సినిమా చూసి ఆనందించేవారు' అని అన్నారు నాగచైతన్య మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'మనం' తర్వాత 'వెంకీమామ' మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది. ఎన్ని సినిమాలు చేసినా ఈ చిత్రాల్ని మర్చిపోను. సురేష్ ప్రొడక్షన్ సంస్థలో సినిమా చేయాలనే కోరిక తీరింది' అని చెప్పారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ ''జై లవకుశ' తర్వాత కోన వెంకట్ ద్వారా ఈ మల్టీస్టారర్ సినిమా చేసే అవకాశం లభించింది. ఒకే కుటుంబానికి చెందిన మామాఅల్లుళ్ల కాంబినేషన్‌లో సినిమా చేస్తే నిజాయితీగా బాగుంటుందనిపించింది. సురేష్‌బాబు దగ్గరకు వెళ్లేముందు చాలా మంది భయపెట్టారు. కానీ కథ వినగానే ఆయన బాగుందన్నారు. తమ కుటుంబంలోని ఇద్దరూ హీరోలు కలిసి చేస్తున్న సినిమా బాగుండాలనే ఆయన ఆలోచనను అర్థం చేసుకుంటూ రూపొందించాను. ప్రతి ఇంట్లోని మామాఅల్లుళ్లను ఈ సినిమా గుర్తుకుతెస్తుంది' అని పేర్కొన్నారు. 'మానవ సంబంధాల నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం రచయిత జనార్ధన మహర్షి చెప్పిన పాయింట్‌ను దర్శకుడు బాబీ అద్భుతంగా డెవలప్ చేశారు. వినోదం, త్యాగం అంశాలతో మామా అల్లుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరిస్తుంది. నవరసాలున్న పూర్తిస్థాయి తెలుగు సినిమా ఇది' అని సురేష్‌బాబు పేర్కొన్నారు. నటనపరంగానే కాకుండా వ్యక్తిగతంగా తాను వెంకటేష్‌ను అభిమానిస్తానని, ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉందని రాశీఖన్నా చెప్పింది. ఈ కార్యక్రమంలోవి శ్వప్రసాద్, వివేక్, విజయ్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకీ మామతో కల నెరవేరింది


వివేక్, బాబీ, నాగచైతన్య, రాశీఖన్నా, వెంకటేష్, సురేష్‌బాబు, విశ్వప్రసాద్

'భిన్న ధృవాల్లాంటి ఓ జంట ప్రేమకథకు అందమైన దృశ్యరూపమిది. కుటుంబ విలువలు, ప్రేమ, క్రీడా నేపథ్య ఇతివృత్తంతో నవ్యమైన అనుభూతిని పంచుతుంది' అని అన్నారు ఉదయ్‌శంకర్. 'ఆటగదరా శివ' చిత్రంలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రతో తొలి అడుగులోనే కథానాయకుడిగా ప్రశంసల్ని అందుకున్నారాయన. ఉదయ్‌శంకర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్‌మ్యాచ్'. అధిరోహ్ క్రియేటివ్ సైన్స్ ఎల్.ఎల్.పి పతాకంపై జి.శ్రీరామ్‌రాజు, భరత్‌రామ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్.వి.నిర్మల్‌కుమార్ దర్శకుడు. ఈ నెల 6న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో హీరో ఉదయ్‌శంకర్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

# ఈ మనసే.. రీమిక్స్ చూసి పవన్ అభినందించారు!


ఉదయ్‌శంకర్

**కమర్షియల్ హీరోగా పేరుతెచ్చుకోవాలనే యాక్షన్, పాటలున్న ఈ కథను ఎంచుకున్నారా?**

• కథ నా దృష్టిలో అసలైన హీరో. కథ బాగుంటేనే సినిమాకు, హీరోకు పేరొస్తుంది. 'ఆటగదరాశివ' తర్వాత ప్రేమకథతో సినిమా చేయాలని ఆరేడు నెలల పాటు చాలా కథలు విన్నాను. ఆ సమయంలో రచయిత భూపతిరాజా 'మిస్‌మ్యాచ్' పాయింట్ వినిపించారు. నాకు చాలా నచ్చింది. తండ్రీకూతుళ్లు, తల్లీకొడుకుల అనుబంధంతో పాటు వాణిజ్య హంగులు, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా సినిమా ఉంటుంది.

**'మిస్ మ్యాచ్' అని ఎవరూ తెరపై అంటారు?**

• భిన్న మనస్తత్వాలు కలిగిన ఓ ప్రేమజంట కథ ఇది. సినిమాలో ఐటీ ఉద్యోగిగా నా పాత్ర వినూత్నంగా ఉంటుంది. జీవితంలో క్రమశిక్షణకు విలువనిచ్చే యువకుడిగా కనిపిస్తాను. తన వ్యక్తిత్వానికి భిన్నమైన కుస్తీ క్రీడాకారిణితో ప్రేమలో పడతాడు. ఆ జంట ప్రేమాయణం ఏ విధమైన మలుపులు తిరిగిందన్నది తెరపై ఆకట్టుకుంటుంది.

**మీ నిజజీవితంతో హీరో పాత్రకు ఏమైనా పోలికలు ఉంటాయా?**

• తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడే నంబర్స్ మెమోరీలో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాను. గణితంలోని 'పై' అంకెలను పదివేల వరకు మెమోరైజ్ చేసి లిమ్కాబుక్‌లో స్థానాన్ని సంపాదించుకున్నాను. ఆ అంకెలన్నీ ఎలా గుర్తుంటాయో నాకు తెలియదు. ఆ ప్రశ్న నన్ను చాలా మంది అడిగారు. దానికి సమాధానం మాత్రం నా దగ్గర లేదు. జ్ఞాపకశక్తి అనేది దేవుడిచ్చిన నాకు ఇచ్చిన గొప్ప బహుమతి. ఆ అంశాన్ని ప్రతిబింబించే చిన్న సన్నివేశాన్ని సినిమాలో పెట్టాం.

**ప్రస్తుతం తెలుగు తెరపై వస్తున్న ప్రేమకథలతో పోలిస్తే ఈ సినిమాలో ఎలాంటి వైవిధ్యత కనిపిస్తుంది.**

• మిస్ మ్యాచ్ అనిపించుకునే ఓ జంట కథ ఇది. కుటుంబ పరంగా ఎదురైన అవరోధాల్ని వారు ఏ విధంగా అధిగమించి ఒక్కటయ్యారు? కుస్తీ క్రీడాకారిణి అయిన ప్రియురాలి లక్ష్యసాధనకు ప్రేమికుడు ఎలా అండగా నిలిచాడన్నది ఆకట్టుకుంటుంది. విరామ సన్నివేశాల ముందు వచ్చే మలుపు ఉత్కంఠను పంచుతుంది.

**గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన మీ జీవితం హీరోగా ఎలా మలుపుతిరిగింది?**

• అదే నా జీవితంలో పెద్ద మిస్‌మ్యాచ్(నవ్వుతూ). మ్యాథమెటిక్స్‌లో గిన్నిస్‌బుక్ రికార్డ్ సాధించినా ఇంటర్‌లో మాత్రం బైపీసీ గ్రూప్ తీసుకున్నాను. ఆ తర్వాత సినిమాలపై ఆసక్తితో డెంటిస్ట్ కోర్సును రెండో ఏడాదితో వదిలేశాను. ప్రస్తుతం నా దృష్టంతా నటనపైనే ఉంది.

**'తొలిప్రేమ'లోని 'ఈ మనసే' పాటను రీమిక్స్ చేయాలనే ఆలోచన ఎవరిది?**

• రీమిక్స్ ఆలోచన నాదే. పవన్‌కల్యాణ్‌కు నేను వీరాభిమానిని. అవకాశాల కోసం ఎదురుచూస్తున్న రోజుల్లో హీరోగా మారిన తర్వాత ప్రేమకథతో సినిమా చేస్తే 'ఈ మనసే' పాటను నా సినిమాలో రీమిక్స్ చేయాలని నిశ్చయించుకున్నాను. బలవంతంగా ఇరికించినట్లుగా కాకుండా సందర్భానుసారంగానే ఆ పాట సినిమాలో వస్తుంది. ఎలాంటి టెన్షన్స్, ఇబ్బందులు ఉండకూడదని షూటింగ్ చివరలో ఈ పాటను చిత్రీకరించాం. విజయ్ మాస్టర్ నృత్యసారథ్యంలో సింగిల్‌షాట్‌లో 120 మంది సాంకేతిక నిపుణులు, ఆరవై మంది డ్యాన్సర్లపై హైదరాబాద్‌లో విభిన్నంగా చిత్రీకరించాం.పవన్‌కల్యాణ్‌పై నాకున్న అభిమానాన్ని చాటిచెప్పడానికే సినిమాలో పాటను రీమిక్స్ చేశాం.

**పవన్‌కల్యాణ్ స్వయంగా రీమిక్స్ పాటను విడుదల చేశారు కదా. పాట విని ఆయన ఏమన్నారు?**

• పాటను పవన్‌కల్యాణ్ చూసి ఎంజాయ్ చేశారు. విడుదలచేస్తున్న సమయంలో సింగిల్‌షాట్‌లో చిత్రీకరించిన విషయం ఆయనకు చెప్పలేదు. పాట మొత్తం చూసి సింగిల్‌షాట్‌లో చిత్రీకరించిన విషయం గుర్తుపట్టారు. చాలా కష్టపడి పాటతో పాటు సినిమాను చేశారు. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని అభినందించారు.

**నటుడిగా తొలి సినిమా 'ఆటగదరాశివ' నుంచి ఏం నేర్చుకున్నారు.?**

• చాలా మంది నవతరం హీరోలు ఫైట్స్, పాటలు, రొమాన్స్‌తో కూడిన కథల్ని ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు. నేను అలాంటి సినిమా చేస్తే వారిలో ఒకరిగా కలిసిపోయేవాణ్ణి. రొటీన్‌గా కాకుండా వైవిధ్యంగా ప్రయత్నించాడని ప్రేక్షకులు అనుకోవాలనే ఆలోచనతో 'ఆటగదరాశివ' సినిమా చేశాను. కన్నడ సినిమా 'రామా రామారే'కు రీమేక్ అది. చక్కటి భావోద్వేగాలతో నటనకు ఆస్కారం ఉన్న కథ కావడంతో ఆ సినిమాలో హీరోగా నటించాను. డీగ్లామర్ రోల్, హీరోయిన్ లేని ఆ సినిమా నటుడిగా చక్కటి ప్రయత్నం చేశాననే పేరును తీసుకొచ్చింది. దర్శకుడు త్రివిక్రమ్ సినిమా చూసి అభినందించారు. బాగా నటించానని మెచ్చుకున్నారు.



**నాన్న శ్రీరాం రచయిత. ఫిలాసఫీపై పలు పుస్తకాలు రాశారు. ఆయన రచనలు సినీ, రాజకీయ ప్రముఖులు చాలా మందిని ప్రభావితం చేశాయి. మా నాన్నగారి ఊరు గద్వాల సమీపంలోని మల్దకల్. అమ్మవాళ్లది జడ్చర్ల. నా పాఠశాల విద్యాభ్యాసం అంతా నిజామాబాద్‌లో సాగింది.**

• **ఐశ్వర్యారాజేష్‌కు పాతిక ముప్పై సినిమాలు చేసిన అనుభవం ఉంది. నాకంటే సీనియర్ హీరోయిన్‌తో పనిచేస్తున్నాననే భయం షూటింగ్ ప్రారంభమైన రెండు, మూడు రోజులు నన్ను వెంటాడింది. ఆ ఆలోచనల్నీ పక్కన పెట్టి నా పాత్రకు న్యాయం చేయడానికి ప్రయత్నించాను. ఐశ్వర్యారాజేష్‌లో ఉన్న కలుపుగోలుతనం నాలోని భయాన్ని దూరం చేసింది.**

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

• ఈ సినిమా ఫలితాన్ని అనుసరించి తదుపరి చిత్రానిపై నిర్ణయానికి వస్తాను. 'అర్జున్‌రెడ్డి' చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన గిరీష్‌యాదవ్ చెప్పిన ఓ కథ నన్ను ఆకట్టుకుంటుంది. .










